అక్టోబర్
2018

150

సంపుటి : 13 సంచిక : 6 వెల రు. 10 /-

ఈ సంచికలో........

క్యూబా శత్రువుల ఆకాంక్షలు నెరవేరవు
తాగునీటి వ్యాపారం
ఆధిపత్యం నిలుపుకోడానికి అమెరికా ఆరాటం
వేతనాలు - కార్మికులు
ముంచుకొస్తున్న సంక్షోభం
సామాజిక తరగతులు-భూమి-అసమానతలు
ప్రజాస్వామ్యం - పెట్టుబడిదారీ 'అభివృద్ధి'
వామపక్షాలది సైద్ధాంతిక ఓటమి కాదు
సావర్కర్ 'వీరత్వం'
శరీరం ఛిద్రమైనా చెదరని యోధుడు

**నివాళి**

# శరీరం ఛిద్రమైనా చెదరని యోధుడు

**కామ్రేడ్** లక్ష్మీనారాయణ కాకుమాను మండలంలోని భల్లుఖానుడివారిపాలెంలో 1917 జులై 16న జన్మించారు. తండ్రి సుబ్బారావు, తల్లి సుబ్బాయమ్మ. తల్లిదండ్రుల తొమ్మిది మంది సంతానంలో కామ్రేడ్ లక్ష్మీనారాయణ రెండోవారు. వీరికి ఐదుగురు అన్నదమ్ములు, ముగ్గురు అక్కచెల్లెళ్లు ఉన్నారు. కామ్రేడ్ లక్ష్మినారాయణ తండ్రిగారు సొంతింట్లోనే పిల్లలకు చదువు చెబుతూ తమకున్న కొద్దిపాటి పొలంతో జీవనం సాగిస్తుండేవారు. కామ్రేడ్ లక్ష్మీనారాయణ భార్య కమలమ్మ. ఆయన ఏడో తరగతి వరకు చదువుకున్నారు. ఒక రైతు పశువుల పాకను అమ్మకానికి పెట్టినప్పుడు దాన్ని రూ.500లకు కామ్రేడ్ లక్ష్మినారాయణే కొనుగోలు చేసి అప్పటిదాకా పాఠశాలలేని గ్రామంలో పాఠశాలను, గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేశారు. అప్పటికే అభ్యుదయ భావాలున్న కామ్రేడ్స్ లక్ష్మీనారాయణ చివుకుల శేషశాస్త్రి, కొల్లా వెంకయ్యతో సంబంధాలను ఏర్పరచుకున్నారు. 1939లో పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఉపాధ్యాయ ఉద్యమంలో పనిచేయడం ప్రారంభించారు. ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షునిగా పనిచేయడమేకాక, 'ఉపాధ్యాయ' పత్రిక సంపాదకవర్గంలో సభ్యునిగా రాష్ట్ర స్థాయిలోనూ బాధ్యతలను నిర్వహించారు. పిల్లలకు చదువుతోపాటు, గ్రామంలోని యువకులకు వయోజన విద్యనేర్పడం ప్రారంభించారు. అభ్యుదయ సాహిత్యాన్ని, పత్రికలను గ్రంథాలయానికి తెప్పించి యువకుల్లో చైతన్యం కలిగించడానికి కృషి చేశారు. కామ్రేడ్ లక్ష్మీనారాయణ చేస్తున్న కృషిని గ్రామంలోని ప్రతి ఒక్కరూ అభినందించారు.

కామ్రేడ్ లక్ష్మీనారాయణ చాలా గొప్పవక్త. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, భూస్వాముల దౌర్జన్యాలు, గ్రంథాల్లో నిక్షిప్తమైన వర్గతత్వం, అవి ప్రచారం చేసే మూఢనమ్మకాలు మొదలైన విషయాలపై అనర్గళంగా ఉపన్యసించేవారు. ముందు ఉపాధ్యాయుల్లో మార్పురావాలని, ఆ మార్పునుంచే విద్యార్థులనే వృక్షానికి అభ్యుదయ మనే కొమ్మలు, రెమ్మలు పుట్టి ప్రగతిపూలు పూయాలని చెబుతూఉండేవారు.



**కామ్రేడ్ ముక్తినూతలపాటి లక్ష్మీనారాయణ**

కామ్రేడ్ లక్ష్మీనారాయణ నాయకత్వంలో గ్రామంలోని కూలీలకిచ్చే కూలిని మూడు మానికల నుంచి నాలుగు మానికలకు పెంచాలని ఆందోళన ప్రారంభించి, కూలీలను సమీకరించి సమ్మె నిర్వహించారు. అప్పటి వరకు కామ్రేడ్ లక్ష్మీనారాయణ చేస్తున్న సేవలను కొనియాడిన భూస్వాములు వారి దోపిడికి వ్యతిరేకంగా కూలీలను చైతన్యం చేసిన కామ్రేడ్ లక్ష్మీనారాయణపై తీవ్ర వ్యతిరేకతను పెంచుకున్నారు. కూలీలు చేపట్టిన ఈ పోరాటం ద్వారా గ్రామంలో వర్గ పోరాటాలకు అంకురార్పణ జరిగింది. కామ్రేడ్ లక్ష్మీనారాయణ తన చొరవతో దళితవాడల్లోని యువకులతో సంబంధాలేర్పరచుకుని పదిమందికి పైగా యువకులను కమ్యూనిస్టు పార్టీవైపు ఆకర్షించేలా కృషి చేశారు. గ్రామమంతటిలో 30 నుంచి 40 మందిదాకా ఉన్న యువకులకు కామ్రేడ్ లక్ష్మీనారాయణే నాయకుడు. స్వాతంత్ర్యానంతరం గ్రామంలోని ప్రజలు కమ్యూనిస్టు, కాంగ్రెస్ పార్టీగా చీలిపోయారు. వీరిలో అధికభాగం కమ్యూనిస్టుపార్టీ వైపు నిలిచారు. చిన్న రైతులు, వ్యవసాయ కార్మికులు కమ్యూనిస్టుపార్టీతోనే ఉండేవారు. ఈ స్ఫూర్తితోనే అప్పట్లో తెనాలిలో మూడు రోజులపాటు నిర్వహించిన రైతు మహాసభకు గ్రామం నుంచి 30 బళ్లలో ప్రజలు తమ సొంతఖర్చులతో వెళ్లి వండుకుతిని మహాసభల్లో పాల్గొన్నారు. బందరు కాల్వ పూడికతీతలోనూ పదిమంది యువకులు నెలరోజులపాటు సొంత పనులు మానుకుని అక్కడే ఉండి పని చేశారు. కామ్రేడ్ లక్ష్మీనారాయణ ఈ కార్యక్రమాలన్నింటికీ స్వయంగా నాయకత్వం వహించేవారు.

1947లో కమ్యూనిస్టు పార్టీని నిషేధించిన తరువాత గ్రామంలో మేడే జరిగింది. నిషేధాజ్ఞలను ఉల్లంఘించి మేడే జరిపారని కాంగ్రెస్ భూస్వాములు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గ్రామానికొచ్చి ఊరేగింపులో పాల్గొన్న కమ్యూనిస్టులను తీవ్రంగా కొట్టారు. గ్రామంలో ప్రశాంతంగా ఊరేగింపు నిర్వహిస్తున్న తమపై పోలీసులు దాడి చేసేలా కాంగ్రెస్ భూస్వాములు కుట్రపన్నడాన్ని వ్యతిరేకిస్తూ గ్రామంలోని 30 మంది యువకులు సమావేశమై కాంగ్రెస్ భూస్వాములకు చెందిన మూడెకరాల పొగాకు తోటను పీకేశారు. అయితే ఇది మంచి పద్ధతి కాదని కామ్రేడ్ లక్ష్మీనారాయణ వ్యతిరేకించారు. కానీ మెజార్టీ అభిప్రాయం ప్రకారం తరువాత అంగీకరించారు. ఈ గొడవతో గ్రామంలో భూస్వాములకు, వ్యవసాయ కార్మికులకు మధ్య ద్వేషాలు పెరిగి కొట్లాటలు, పంటలు తగులబెట్టుకోవడం, భూస్వాముల అండతో పోలీసులు కమ్యూనిస్టులను చితకబాదడం నిత్యకృత్యమయ్యాయి. కమ్యూనిస్టు పార్టీ సానుభూతిపరుడైన సాంబయ్యను భూస్వాములు తీవ్రంగా నష్టపరిచారు. ప్రతిదాడులు ప్రారంభమవ్వడంతో గ్రామంలో వాతావరణం వేడెక్కింది. వీటన్నిటికీ కారణం కామ్రేడ్ లక్ష్మీనారాయణేనంటూ అటు భూస్వాములు, ఇటు పోలీసులు ఆయనపై నిఘా పెట్టారు.

తెలంగాణా సాయుధ పోరాటం తీవ్ర రూపాన్ని తీసుకోవడంతో కోస్తాజిల్లాల్లోనూ కమ్యూనిస్టులపై నిర్బంధం పెరిగింది. బాపట్ల ప్రాంతంలో ముఖ్యమైన కమ్యూనిస్టు నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందిన కామ్రేడ్ లక్ష్మీనారాయణపై నిఘా ఎక్కువైంది. అదును కోసం ఎదురు చూస్తున్న భూస్వాములు, అవకాశం దొరికిందికదా అని కామ్రేడ్ లక్ష్మీనారాయణ కదలికలను ఎప్పటికప్పుడు పోలీసులకు చేరవేస్తూ ఉండేవాళ్లు. తప్పని సరి పరిస్థితుల్లో కామ్రేడ్ లక్ష్మీనారాయణ పూర్తిగా అజ్ఞాతంలోకి వెళ్లారు. పొన్నూరు, బాపట్ల మధ్య రహస్యంగా తిరుగుతూ ఆందోళన కార్యక్రమా లను స్వయంగా పర్యవేక్షిస్తుం దేవారు.

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. శరీరం ఛిద్రమైనా చెదరని యోధుడు.... 2

2. క్యూబా శతృవుల ఆకాంక్షలు నెరవేరవు
మిగుయెల్ డియాజ్ కానెల్.......... 4

3. తాగునీటి వ్యాపారం
ఆర్. అరుణ్‌కుమార్ .................. 8

4. ఆధిపత్యం నిలుపుకోడానికి అమెరికా ఆరాటం
ఎస్. వెంకట్రావు .................... 10

5. వేతనాలు - కార్మికులు
పి. అజయకుమార్.................. 14

6. ముంచుకొస్తున్న సంక్షోభం
ఎ. కోటిరెడ్డి.......................... 16

7. సామాజిక తరగతులు -భూమి - అసమానతలు
సి. సాంబిరెడ్డి ........................ 21

8. ప్రజాస్వామ్యం - పెట్టుబడిదారీ 'అభివృద్ధి'
రాజన్ గురుక్కల్ ..................... 23

9. వామపక్షాలది సైద్ధాంతిక ఓటమి కాదు
ప్రొ॥ విజయ్‌ప్రసాద్ ..................... 29

10. సావర్కర్ 'వీరత్వం'
ఎజి నూరాని ....................... 34



**సంపాదకుడు:**

**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు:**బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ) గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్ : కె.హరికిషోర్: 9490099275**
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# అసమానతలు

**మ**నం నివసిస్తున్న ప్రపంచం ఎంత హేతువిరుద్ధంగా ఉందో సెప్టెంబర్ 26వ తేదీన క్యూబా అధ్యక్షుడు మిగుయెల్ డియాజ్ కానెల్ ఐక్య రాజ్య సమితిలో చేసిన ప్రసంగంలో బట్టబయలు చేశారు. ప్రపంచంలో శ్రామికులు రెక్కలు ముక్కలు చేసుకుని ఉత్పత్తి చేస్తున్న సంపదలో 46 శాతం కేవలం 0.7 శాతం ధనికుల చేతిలో పోగుపడితే 70 శాతం మంది ప్రజల చేతుల్లో ఉన్నది 2.7 శాతం మాత్రమే. ప్రపంచ జనాభాలో 34.6 కోట్ల మంది దారిద్ర్యంలో బతుకుతున్నారు. వీరిలో 81.5 కోట్ల మంది ఆకలితో అలమటిస్తున్నారు. ఇవన్నీ అంతర్జాతీయ సంస్థలు ఇచ్చిన లెక్కలే. తన ముందు మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పినట్లు ఇవి సోషలిజం వల్ల రాలేదనీ, ఈ అసమానతలు పెట్టుబడిదారీ వ్యవస్థకు పుట్టిన వికృత శిశువులనీ క్యూబా అధ్యక్షుడు స్పష్టం చేశారు.

అసమానతలు పెట్టుబడిదారీ ప్రపంచమంతా ఉన్నాయి, ఇంకా ఇంకా పెరుగుతున్నాయి. అమెరికాలో 1 శాతం ధనికుల వద్ద 34 శాతం, 10 శాతం ధనికుల వద్ద 74 శాతం సంపద పోగైంది. భారత దేశంలో 74.5 శాతం సంపద కేవలం ఒక్క శాతం ధనికుల వద్ద పోగుపడింది. ప్రపంచ జనాభాలో 50 శాతం పేద ప్రజల సంపద 2010-2015 మధ్య 41శాతం తగ్గిపోగా అదే సమయంలో ప్రపంచంలోని 62 మంది సూపర్ ధనికుల వద్ద మరో 50,000 కోట్ల డాలర్లు పోగైంది. ఒక బస్సులో పట్టేంత మంది ఈ సూపర్ ధనికుల వద్ద మొత్తం జనాభాలో 50 శాతం మంది వద్ద ఉన్న సంపదకన్నా ఎక్కువ పోగైంది.

సంపద అసమానతల్లో భారత దేశం ప్రపంచంలోనే రష్యా తరువాత రెండో స్థానంలో ఉంది. దేశంలోని 74.5 శాతం సంపద 1 శాతం ధనికుల వద్ద పోగై ఉంది. వీరి సంపద రానురాను పెరుగుతోంది, పేదల వద్ద సంపద క్రమంగా తగ్గుతోంది. 2014-2016 మధ్య రెండేళ్లలో 1 శాతం ధనికుల సంపద 49 శాతం నుండి 58.4 శాతానికి పెరిగింది. దేశంలో కింది స్థాయిలోని 50శాతం జనాభా వద్ద ఉన్నది కేవలం 2.1 శాతం మాత్రమేనని ఆక్స్‌ఫామ్ సర్వేలో తేలింది.

అసమానతలు తగ్గించడానికి కష్టపడి పనిచేస్తున్నట్లు ప్రభుత్వాలు నిరంతరం ప్రచారం చేస్తుంటాయి. సామాన్య ప్రజల గురించి, వారి సంక్షేమం గురించి మాట్లాడని ప్రభుత్వాలు ప్రపంచంలో లేనే లేవు. మన దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ప్రభుత్వాలు అభివృద్ధి మంత్రం జపిస్తూనే ఉన్నాయి. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే ఉన్నాయి. కానీ అసమానతలు పెరుగుతూనే ఉన్నాయి. పేదలు మరింత పేదలవుతున్నారు, ధనికులు మరింత ధనికులవుతున్నారు.

అసమానతలకు వ్యతిరేకంగా పోరాడ్డం అంటే ఉద్యోగాల కోసం, ఉపాధి కోసం, కూలి కోసం, మెరుగైన వేతనాల కోసం, సంక్షేమ కార్యక్రమాల కోసం, గిట్టుబాటు ధరల కోసం పోరాడ్డం అని సాధారణ భావన. నిజమే, వీటికోసం పోరాడాల్సిందే. ఎందుకంటే ఇవి సాధించుకుంటే శ్రామిక ప్రజలకు ఎంతో ఉపశమనం. కానీ ఈ తరహా పోరాటాలతోనే అసమానతలు అంతం కావని చరిత్ర చెబుతోంది.

పెట్టుబడిదారీ ఆర్థిక చట్రానికి లోబడి వున్నంతకాలమూ ఎన్ని సంస్కరణలు జరిగినా అవి అసమానతలను తగ్గించనూ లేవు, పెట్టుబడిదారీ సంక్షోభాన్నీ పరిష్కరించనూ లేవు. ఇది గత పదేళ్ళ ప్రపంచ సంక్షోభం మనకు స్పష్టం చేస్తోంది.

పెట్టుబడిదారీ పాలనకు రాజకీయ ప్రత్యామ్నాయంగా సోషలిజాన్ని ముందుకు తేవడమే పరిష్కారం. శ్రామికవర్గ పోరాటాలను విస్తృతంగా దేశంలోను, ప్రపంచవ్యాప్తంగాను పెంపొందించడమే ఈ ప్రత్యామ్నాయాన్ని బలోపేతం చేయగల మార్గం. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) అంతిమ లక్ష్యం అదే. దానికి లోబడే మిగతావన్నీ.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# క్యూబా శత్రువుల ఆకాంక్షలు నెరవేరవు

**మిగుయెల్ డియాజ్ కానెల్**



రచయిత క్యూబా అధ్యక్షులు

క్యూబా అధ్యక్షుడు మిగుయెల్ డియాజ్ కానెల్ సెప్టెంబరు 26వ తేదీన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో చేసిన ప్రసంగాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం.

–సంపాదకులు

గతంలో ఐక్యరాజ్యసమితి సమావేశంలో ప్రసంగించిన ఫైడల్ కాస్ట్రో, చే గువేరా, రావుల్ కాస్ట్రో, హుందాతనానికి 'చాన్సలర్' అయిన రావుల్ రోవా తదితరులను గురించి, వారు ప్రసంగించిన చారిత్రక సందర్భాలను ప్రస్తావించకుండా క్యూబా తరపున ఇక్కడ ప్రసంగించటం అసంభవం. వారు క్యూబా ప్రజల గొంతుకను మాత్రమే కాకుండా లాటిన్ అమెరికా, కరీబియన్, ఆఫ్రికా, ఆసియా, అలీన దేశాల ప్రజల వాణిని కూడా వినిపించారు. న్యాయమైన అంతర్జాతీయ సంబంధాల కోసం వారితో కలిసి మేము అర్ధశతాబ్దానికి పైగా పోరాటాలు చేస్తూనే ఉన్నాం. దానిని ఇంకా సాధించలసే ఉన్నది.

ప్రపంచంలో అన్యాయమైన అసమానతలు రాజ్యమేలుతున్నాయి. అత్యంత సంపన్నులైన 0.7 శాతం మంది 46 శాతం సంపదను కలిగి ఉండగా, 70 శాతం మంది వద్ద 2.7 శాతం మాత్రమే ఉన్నది. 346 కోట్లమంది ప్రజలు దరిద్రంలో బతుకుతున్నారు. 81.5 కోట్లమంది ఆకలితో అలమటిస్తున్నారు. 75.8 కోట్లమంది నిరక్షరాస్యులుగా ఉన్నారు. 84.4 కోట్లమందికి మౌలిక వనరైన తాగునీరు అందుబాటులో లేదు. ఈ అంకెలన్నింటినీ అంతర్జాతీయ సంస్థలు తయారు చేసి, క్రమబద్ధంగా వినియోగిస్తున్నాయి. కాని అంతర్జాతీయ సమాజంలో తగినంత చైతన్యాన్ని పెంచటంలో వారు విఫలమయ్యారు.

నిన్న అమెరికా అధ్యక్షుడు మాట్లాడినట్లు ఇవేవీ సోషలిజం వలన సంభవించినవి కాదు. అవి పెట్టుబడిదారీ విధానం ఫలితంగా, ముఖ్యంగా సామ్రాజ్యవాదం, నయా సరళీకరణ విధానాల ఫలితంగా సంభవించాయి. ఈ విధానానికి సహజమైన ప్రజలను పట్టించుకోకపోవటం, వారిని అభివృద్ధి నుండి మినహాయించటం ఫలితంగా ఇవి సంభవిస్తున్నాయి. ప్రజలను దోపిడీ చేసి, వారిని దుర్భర దారిద్ర్యంలో ముంచుతూ కొద్దిమంది వద్ద సంపద పోగుపడటాన్ని ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలు బలపరుస్తున్నాయి.

పెట్టుబడిదారీ విధానం వలస విధానాన్ని స్థిరపరిచింది. అది ఫాసిజం, టెర్రరిజం, వర్ణ వివక్షలకు జన్మనిచ్చింది. యుద్ధాలను, ఘర్షణలను వ్యాప్తిచేసింది. ప్రజల స్వేచ్ఛ, స్వయం నిర్ణయ హక్కులను ధ్వంసం చేసింది. కార్మికులు, అల్పసంఖ్యాకులు, శరణార్థులు, వలస వచ్చిన వారిపై దారుణాలు సాగించింది. ప్రజల సమైక్యతకు, ప్రజాస్వామ్యంలో ప్రజలు భాగస్వాములు కావటానికి పెట్టుబడిదారీ విధానం వ్యతిరేకం. ఆ వ్యవస్థకు సహజమైన ఉత్పత్తి, వినియోగం దోపిడీనీ, సైనికీకరణను పెంచుతాయి. శాంతికి ప్రమాదం కలిగిస్తాయి. మానవ హక్కులకు విఘాతం కలిగిస్తాయి. పర్యావరణానికి ప్రమాదం కలిగిస్తాయి. మానవజాతి మనుగడనే ప్రమాదంలో పడవేస్తాయి.

మానవజాతిని ఆకలి, దారిద్ర్యం, నివారించగల వ్యాధులను అరికట్టటం తదితరాల నుండి బయటపడవేయటానికి తగినన్ని ఆర్థిక, సాంకేతిక వనరులు లేవనే పేరుతో ఎవరినీ మోసం చేయలేరు. పారిశ్రామిక దేశాలకు తగినంత రాజకీయ సంకల్పం ఉండటం కావాలి. అత్యంత తీవ్రమైన భౌగోళిక సమస్యలను పరిష్కరించాలంటే విస్తారంగా నిధులు ఖర్చుపెట్టాల్సిన చారిత్రక కర్తవ్యాన్ని నిర్వహించాలి.

2030 లక్ష్యాలను అందుకోవటానికి నిధుల కొరత ఉన్నదని ఒకవైపున చెబుతున్నారు. మరోవైపున 2017లో 1.74 లక్షల కోట్ల డాలర్లను సైనిక అవసరాల కోసం వృధా చేశారు. పర్యావరణ మార్పులు అనేవి మనం తప్పించుకోలేని మరో వాస్తవం. మానవజాతి జీవించటానికి, ముఖ్యంగా చిన్న దీవులలో జీవిస్తున్న వారికి ఈ మార్పులు తీవ్ర ప్రమాదాన్ని కలిగిస్తున్నాయి. కొన్ని మార్పుల ఫలితాలు ఇప్పటికే తిరిగి వెనక్కు తీసుకురాలేని స్థితికి చేరుకున్నాయి. పారిశ్రామికీకరణ ముందునాటికన్నా 1.1 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగిందని శాస్త్రీయ అధ్యయనాలు నిరూపిస్తున్నాయి. పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్న వారిలో 10 మందిలో 9 మంది వాయు కాలుష్యంలో జీవిస్తున్నారు.

అయినప్పటికీ నిన్నటి, నేటి పర్యావరణ కాలుష్యానికి ప్రధాన కారకులలో ఒకరైన అమెరికా పర్యావరణ మార్పులపై ప్యారిస్ ఒప్పందాన్ని అమలు జరపటానికి, మిగతా ప్రపంచంతో కలిసి నడవటానికి నిరాకరిస్తున్నది. ఆ విధంగా అది మన భవిష్య తరాలను, మానవులతో కలిపి మొత్తం జీవజాతుల మనుగడను ప్రమాదంలో పడవేస్తున్నది.

వీటితో పాటుగా మానవజాతిని మరింత ప్రమాదంలో పడవేసేలా సామ్రాజ్యవాదం, సైనిక, అణ్వాయుధ ఆధిక్యత, వాటి విస్తరణతో ముందుకుపోతున్నది. సాధారణ, పూర్తిస్థాయి నిరాయుధీకరణకు, మెజారిటీ ప్రజల ఆకాంక్షలకు ప్రతికూలంగా ఉన్నది. ఈ లక్ష్యాలకు క్యూబా కట్టుబడి ఉన్నది. దానిని అమలు చేయటంలో క్యూబా కట్టుబాటుకు సాక్ష్యంగా అణ్వాయుధాలను నిషేధించాలనే ఒప్పందాన్ని

జనవరి 31 వ తేదీన క్యూబా ఆమోదించి, ఆ తీర్మానాన్ని ఆమోదించిన ఐదవ దేశంగా నిలిచింది.

భయంకరమైన యుద్ధాల వలన జరిగే విధ్వంసాన్ని దేశాల మధ్య చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న మానవజాతి కోర్కె ఫలితంగా ఈ సంస్థ రూపుదిద్దుకున్నది. స్థానిక ఘర్షణలు తీవ్రం కావటం, మానవత్వంతో కూడిన జోక్యం ముసుగులో దురాక్రమణ యుద్ధాలు, ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలను బలవంతంగా కూలద్రోయటం, పరిమిత తిరుగుబాట్ల పేరుతో దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకుంటున్నారు. వివిధ రకాలైన సాకులు చెబుతూ కొన్ని దేశాలు పదేపదే ఇదే విధానాలను అమలుచేయటానికి ప్రయత్నించటం వలన ఈ విషయాలపై మాట్లాడకుండా ఉండటం అసంభవంగా ఉన్నది.

అన్ని రకాలైన మానవహక్కులను రక్షించటానికి, మరింత విస్తృతం చేయటానికి, అందరికీ మానవహక్కులను కల్పించటానికి అంతర్జాతీయ సహకారం తప్పనిసరి. అయినప్పటికీ వివక్ష చూపటం, ఎంచుకున్నచోట ఆధిపత్యం సాధించటం కోసం మానవహక్కులను ఉల్లంఘించటం, శాంతిని, స్వయం నిర్ణయ హక్కులను, ప్రజలు తాముగా అభివృద్ధి చెందే హక్కులను ఉల్లంఘిస్తున్నారు.

అంతరిక్షాన్ని, సైబర్‌స్పేస్‌ను సైనికీకరించటాన్ని క్యూబా వ్యతిరేకిస్తున్నది. ఇతర దేశాలను దెబ్బతీయటం కోసం సమాచార, సాంకేతిక పరిజ్ఞానాన్ని చట్టవిరుద్ధంగా, రహస్యంగా వినియోగించటాన్ని వ్యతిరేకిస్తున్నది. ప్రజాస్వామ్యం, సమన్యాయంతో కూడిన ప్రపంచం వైపు పురోగమించటానికి బహుళపక్ష, అంతర్జాతీయ చట్టాలను, సూత్రాలను పూర్తిగా గౌరవించటం, శాంతియుత సహజీవనం, అంతర్జాతీయ శాంతి, రక్షణలను కాపాడటం, వ్యవస్థాగతమైన సమస్యలకు శాశ్వత పరిష్కారాలను వెతకటం అవసరం. ఈ తర్కానికి వ్యతిరేకంగా బెదిరించటం లేదా బలప్రయోగం చేయటం, తనయిష్టం వచ్చినట్లుగా వ్యవహరించటం, వత్తిడి చేయటం, ప్రతీకార చర్యలు తీసుకోవటం, ఆంక్షలు విధించటం అమెరికా విధానంగా ఉన్నది. తన రాజకీయ లక్ష్యాలను ఇతరులపై రుద్దటానికి భద్రతామండలిలో ఉన్న వీటోహక్కును దుర్వినియోగం చేస్తున్నది. ఐక్యరాజ్యసమితి లోపలనే అంతర్గతంగా బెదిరింపులకు పాల్పడుతూ తీవ్రమైన సవాళ్ళను విసురుతున్నది.

మనం భావించిన విధంగా చర్చలు, నిర్ణయాలు, ప్రాతినిధ్యానికి ప్రధాన సంస్థగా ఐక్యరాజ్యసమితిని ఎందుకని బలోపేతం చేయలేకపోతున్నాం? ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సభ్యత్వాన్ని, పని విధానాన్ని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్పు చేయాలి. భద్రతామండలి సంస్కరణలను ఆలస్యం చేయటం గాని, నిరోధించటం గాని చేయరాదు.

“ఈ తర్కానికి వ్యతిరేకంగా బెదిరించటం లేదా బలప్రయోగం చేయటం, తనయిష్టం వచ్చినట్లుగా వ్యవహరించటం, వత్తిడి చేయటం, ప్రతీకార చర్యలు తీసుకోవటం, ఆంక్షలు విధించటం అమెరికా విధానంగా ఉన్నది. తన రాజకీయ లక్ష్యాలను ఇతరులపై రుద్దటానికి భద్రతామండలిలో ఉన్న వీటోహక్కును దుర్వినియోగం చేస్తున్నది.”



అమెరికా దురాక్రమణలో క్యూబా గ్వాటనామో బే నౌకాకేంద్రం

ఐక్యరాజ్యసమితి 50వ వార్షికోత్సవం సందర్భంగా సర్వసైన్యాధ్యక్షుడు ఫైడల్ కాస్ట్రో మానవజాతిలోని అత్యధికుల ఆకాంక్షలను వ్యక్తం చేస్తూ ప్రసంగించాడు. ఆయన ప్రసంగాన్ని నేను ఉటంకిస్తాను.“ ఆధిపత్యవాద పద్ధతులు, అణ్వాయుధాలు, జోక్యందారీ విధానం, జాతి వివక్ష, జాతి, మతపరమైన అసహనం, ఏ ఒక్క దేశం యొక్క సార్వభౌమత్వాన్ని అతిక్రమించకుండా ఉండటం, ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కును, స్వాతంత్ర్యాన్ని గౌరవించటం, మానవజాతి యొక్క అన్ని విభాగాల సంస్కృతి, సాంప్రదాయాలను పరిగణనలోకి తీసుకొని వ్యవహరించే ప్రపంచం కావాలని మనం కోరుకుంటున్నాం. మనుషులను, మహిళలను, పిల్లలను, యువకులను, పెద్దవారిని నిశ్శబ్ద అణ్వాయుధాల వలె సంహరించే క్రూరమైన దిగ్బంధనాలు లేని ప్రపంచాన్ని కోరుకుంటున్నాం”.

ఈ డిమాండ్‌లు చేసి 20 సంవత్సరాలు గడిచిపోయాయి. వీటిలో ఏ ఒక్కటీ నెరవేరలేదు. వాస్తవంలో ఈ దుర్లక్షణాలన్నీ మరింత తీవ్రమైనాయి. ఇవి ఎందుకు తీవ్రమైనాయని అడిగేహక్కు మనందరికీ ఉన్నది. వీటికి తగిన శక్తివంతమైన పరిష్కారాలు కావాలని పట్టుపట్టే బాధ్యత మనందరికీ ఉన్నది.

**వెనిజులా నికరాగ్వాలకు మద్దతు తెలుపుతున్నాం**

2014లో లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాల ప్రభుత్వాధినేతలు, దేశాధినేతలు చేసిన ప్రకటనకు పొసగని, తీవ్రమైన బెదిరింపులకు మన అమెరికా ప్రస్తుతం గురవుతున్నది. లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాల 2వ అగ్రనాయక సమావేశంలో ఈ ప్రాంతాన్ని శాంతిజోన్‌గా తీర్మానించిన ప్రకటనపై ఆ రోజు హవానాలో సంతకాలు చేశారు. ప్రస్తుత అమెరికా ప్రభుత్వ యంత్రాంగం మన్రో సిద్ధాంతం సరైనదేనని ప్రకటిస్తూ, తన సామ్రాజ్యవాద విధానాన్ని ఈ ప్రాంతంలో నూతనంగా విస్తరిస్తూ, దారుణమైన క్రూరత్వంతో వెనిజులాపై దాడి చేస్తున్నది.

**"1967 సరిహద్దుల ప్రాతిపదికగా రెండు దేశాలను ఏర్పాటు చేయటం, పాలస్తీనియన్లు తమ స్వయం నిర్ణయహక్కును అమలు జరుపుకునే విధంగా, తూర్పు జెరుసలెం రాజధానిగా స్వతంత్రమైన, సర్వసత్తాక దేశంగా పాలస్తీనా ఏర్పాటుకు, ఇజ్రాయిల్-పాలస్థీనా వివాదానికి న్యాయమైన, సమగ్రమైన, శాశ్వత పరిష్కారానికి మా మద్దతును పునరుద్ఘాటిస్తున్నాం."**



నూతన రాజ్యాంగంపై చర్చిస్తున్న క్యూబా పౌరులు

ఇటువంటి భయం గొలుపుతున్న పరిస్థితులలో బొలివారియన్, ఛావిస్టా విప్లవానికి, వెనిజులా ప్రజల పౌర, సైనికుల ఐక్య సంస్థకు, రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ఆ దేశ చట్టబద్ధ అధ్యక్షుడు నికొలస్ మదురోకు మేము సంపూర్ణమైన మద్దతును తెలియజేస్తున్నాం. ఆ దేశ ఆర్థికవ్యవస్థ గొంతునులిమే, వెనిజులా కుటుంబాలకు నష్టం కలిగించే జోక్యందారీ విధానాలను, ఆంక్షలను మేము వ్యతిరేకిస్తున్నాం.

అదేవిధంగా నికరాగువా ప్రభుత్వాన్ని అస్థిరపరిచే చర్యలను మేము వ్యతిరేకిస్తున్నాం. ఆ దేశం శాంతియుతంగా సామాజిక, ఆర్థిక, ప్రజా సంక్షేమ రంగాలలో చెప్పుకోదగిన అభివృద్ధిని సాధించింది. లూలా ఇనాసియో లూలా డ సిల్వాను రాజకీయ ప్రేరేపితంగా జైలులో నిర్బంధించటాన్ని, బ్రెజిల్‌లో అత్యంత ప్రజాభిమానం పొందిన నాయకునికి ప్రజలు ఓటువేసి అధ్యక్షునిగా ఎన్నుకోవటాన్ని నిరోధించటాన్ని మేం వ్యతిరేకిస్తున్నాం. బానిసత్వం యొక్క భయంకరమైన ఫలితాలకు బదులుగా న్యాయ బద్ధంగా పరిహారం కోరుతున్న కరీబియన్ ప్రజల కు న్యాయమైన, వారికి అర్హమైన రాయితీలను ఇవ్వాలని కోరుతున్నాం. ప్యూర్టోరికోలో మా సహోదర ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కును, స్వాతంత్ర్యాన్ని గౌరవిస్తాం. మాల్వినాస్ దీవులు, సౌత్‌శాండ్‌విచ్, సౌత్ జార్జియన్ దీవులపైఅర్జెంటీనా సార్వభౌమత్వాన్ని మేం గౌరవిస్తాం.

1967 సరిహద్దుల ప్రాతిపదికగా రెండు దేశాలను ఏర్పాటు చేయటం, పాలస్తీనియన్లు తమ స్వయం నిర్ణయహక్కును అమలు జరుపుకునే విధంగా, తూర్పు జెరుసలెం రాజధానిగా స్వతంత్రమైన, సర్వసత్తాక దేశంగా పాలస్తీనా ఏర్పాటుకు, ఇజ్రాయిల్–పాలస్థీనా వివాదానికి న్యాయమైన, సమగ్రమైన, శాశ్వత పరిష్కారానికి మా మద్దతును పునరుద్ఘాటిస్తున్నాం. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలను మరింత పెంచేలా జెరుసలెంలో ఏకపక్షంగా అమెరికా రాయబార ప్రతినిధులను నియమించటాన్ని మేం తిరస్కరిస్తు న్నాం. గాజా పౌరులకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్ పాల్పడుతున్న ఆటవిక చర్యలను మేం ఖండిస్తున్నాం.

సహారా ప్రజలకు మాదృఢమైన మద్దతును తెలుపుతున్నాం. పశ్చిమ సహారా ప్రజలు స్వయం నిర్ణయహక్కుతో తమప్రాంతంలో శాంతియుతంగా జీవించే విధంగా అంతిమ పరిష్కారం కోసం అన్వేషణకు మద్దతు తెలుపుతున్నాం. సిరియాపై రుద్దిన సమస్యలను శాంతియుతంగా, చర్చల ద్వారా పరిష్కరించాలని, విదేశీ జోక్యం లేకుండా ప్రజల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడే విధంగా జరిగే పరిష్కారం కోసం జరిగే అన్వేషణకు మద్దతు తెలుపుతున్నాం. ఆ దేశం యొక్క చట్టబద్ధ అధికారుల పాత్రలేకుండా జరిగే ఎటువంటి ప్రత్యక్ష, పరోక్ష జోక్యాలనైనా మేం వ్యతిరేకిస్తాం. నాటోను రష్యా సరిహద్దుల వరకు విస్తరించటం తీవ్రమైన బెదిరింపులకు కారణమౌతున్నది. నిరంకుశంగా ఆంక్షలు విధించటం పరిస్థితిని మరింత దిగజార్చింది. వీటిని మేం తిరస్కరిస్తున్నాం. ఇరాన్‌తో చేసుకున్న అణు ఒప్పందానికి కట్టుబడి ఉండాలని మేం డిమాండ్ చేస్తున్నాం.

కొరియాల మధ్య సంబంధాల మెరుగుదలను, చర్చలను మేం స్వాగతిస్తున్నాం. కొరియా ద్వీపకల్పంలో శాశ్వతశాంతి, స్థిరత్వం, స్నేహ సంబంధాలను మెరుగు చేసుకోవటానికి ఇదేమార్గం. అదే సమయంలో డెమోక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియాకు వ్యతిరేకంగా ఏకపక్షంగా, అన్యాయంగా విధిస్తున్న ఆంక్షలను, కొరియా అంతర్గత వ్యవహారాలలో విదేశీ జోక్యాన్ని ఖండిస్తున్నాం. అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలను ఉల్లంఘించటం, చైనాకు, యూరోపియన్ దేశాలకు వ్యతిరేకంగా ఆంక్షలు విధించటం హానికరమైన ఫలితాలకు దారి తీస్తుంది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలపై తీవ్ర ప్రభావాన్ని కలిగిస్తుంది. చర్చలకు, సహకారానికి మేం ప్రాధాన్యతనిస్తాం. ఈ విధానాల ఫలితంగా రాజకీయ చర్చలు, సహకారంపై యూరోపియన్ యూనియన్‌తో క్యూబా చేసుకున్న ఒప్పందం అమలులోకి వచ్చిందని ఈరోజు నేను తెలియచేస్తున్నాను. మా ఉభయుల మధ్య పరస్పర ప్రయోజనకరమైన సంబంధాలను అభివృద్ధి చేసుకోవటానికి ఇది మంచి పునాదిగా ఉపయోగపడుతుంది.

**క్యూబాపై దురాక్రమణ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం**

అమెరికాలోని ప్రభుత్వం క్యూబా పట్ల దురాక్రమణపూరిత విధానాన్ని అనుసరిస్తున్నది. మా దేశంలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలను నాశనం చేసే విధానాలను అనుసరిస్తున్నది. ఉభయదేశాల ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమైన, మైనారిటీగా ఉన్న రంగాల వత్తిడికి లంగిపోతున్న అమెరికా

లోని నూతన ప్రభుత్వం తప్పుడు సాకులతో కృత్రిమంగా ఉద్రిక్తతలను, శత్రుత్వాన్ని రెచ్చగొట్టటం పై కేంద్రీకరించింది. ఇది ఏ ఒక్కరి ప్రయోజనాలకు దోహదం చేయదు.

"మాపై అమలు జరుపుతున్న క్రూరమైన ఆర్థిక, వాణిజ్య, ద్రవ్య దిగ్బంధాలను అంతం చేయాలని, చట్ట విరుద్ధంగా ఆక్రమించుకున్న గ్వాంటనామో బే నౌకా కేంద్రాన్ని మాకు అప్పగించాలని, వేలాది మంది మరణాలకు, వికలాంగులు కావటానికి, అనేక సంవత్సరాల దిగ్బంధం ఫలితంగా ఆర్థికంగా, ఆస్తులకు కలిగిన నష్టానికి తగిన పరిహారం చెల్లించాలని అవిశ్రాంతంగా అమెరికాను డిమాండ్ చేస్తూనే ఉంటాం."

మా మధ్య లాంఛనమైన రాయబార సంబంధాలు, పరిమితమైన రంగాలలో పరస్పరం ప్రయోజనం కలిగించే కార్యక్రమాలు ఉన్నవాటికి ఇది విరుద్ధంగా ఉంది. మన ప్రజల మధ్య కళలు, ఆటలు, శాస్త్ర విజ్ఞానం, పర్యావరణం తదితరాలలో చారిత్రకంగా, సాంస్కృతికంగా సన్నిహిత సంబంధాలు పెరుగుతున్నాయి. విస్తృతమైన వాణిజ్య సంబంధాలు పెంపొందించుకోవటానికి అవకాశాలు ఉన్న విషయం స్పష్టమే. న్యాయమైన, గౌరవప్రదమైన అవగాహన మొత్తం ఈ ప్రాంతానికి ప్రయోజనం కలిగిస్తుంది. అయినప్పటికి క్యూబా ఆర్థిక వ్యవస్థ గొంతునులమటానికి, ఆటంకాలు కలిగించటానికి, రాజ్యాంగబద్ధ పాలనను దెబ్బతీయటానికి అమెరికా ప్రయత్నం చేస్తున్నది. క్యూబా ప్రజలను, మొత్తం దేశాన్ని శిక్షించే కౄరమైన విధానం ఇది. ప్రపంచంలో ఏదేశంపైన అయినా అమలుజరిపిన వాటి కన్నా తీవ్రమైన, దీర్ఘకాలికమైన ఆర్థిక ఆంక్షలు ఇవి. దేశ అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్న కొన్ని తరాల క్యూబా ప్రజల ఆకాంక్షలకు ఇది ప్రధానమైన ఆటంకంగా ఉన్నది. ఇప్పటి వరకు అనేకసార్లు ఇక్కడి నుండి చెప్పిన విధంగా దురాక్రమణ పూరితంగా ఈ దిగ్బంధాన్ని అమలు చేయటంతో మా దేశ సార్వభౌమత్వాన్ని, అన్ని దేశాల ప్రజల ప్రయోజనాలను దెబ్బతీస్తున్నది. ఆర్థిక, వాణిజ్య, ద్రవ్య పరంగా క్యూబాపై అమెరికా విధించిన దిగ్బంధాన్ని ఏకగ్రీవంగా తిరస్కరిస్తు న్న సర్వసభ్య సమావేశానికి క్యూబా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

అయినప్పటికి మా దేశానికి వ్యతిరేకంగా అమెరికా తీసుకుంటున్న చర్యలు పరిధులను దాటుతున్నాయి. క్యూబా అంతర్గత వ్యవహారాలలో అమెరికా బహిరంగంగా, రహస్యంగానూ జోక్యం చేసుకుంటున్నది. తన లక్ష్యాన్ని సాధించేందుకూ, క్యూబా సార్వభౌమత్వానికి , స్వాతంత్ర్యానికి భంగం కలిగించేందుకూ, ఐక్యరాజ్యసమితి నిబంధనలు, ప్రమాణాలకు వ్యతిరేకంగా వందల కోట్ల డాలర్లను అధికారికంగా తన బడ్జెట్ నుండి కేటాయిస్తున్నది. పరస్పర గౌరవం, స్వేచ్ఛతో కూడిన సమానత్వం ప్రాతిపదికగా అమెరికా ప్రభుత్వంతో గౌరవప్రదమైన, నాగరికమైన సంబంధాలను అభివృద్ధి చేసుకోవటానికి క్యూబా సిద్ధంగా ఉన్నది. ఇది క్యూబా ప్రజల నిశ్చయం. ఇదే నిశ్చయాన్ని మెజారిటీ



క్యూబా విప్లవ నేత ఫైడల్ కాస్ట్రో



వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో

అమెరికన్ ప్రజలు, ముఖ్యంగా క్యూబా నుండి వెళ్ళి అక్కడ ఉంటున్నవారు వ్యక్తం చేస్తున్నారు.

మాపై అమలు జరుపుతున్న కౄరమైన ఆర్థిక, వాణిజ్య, ద్రవ్య దిగ్బంధాలను అంతం చేయాలని, చట్ట విరుద్ధంగా ఆక్రమించుకున్న గ్వాంటనామో బే నౌకా కేంద్రాన్ని మాకు అప్పగించాలని, వేలాది మంది మరణాలకు, వికలాంగులు కావటానికి, అనేక సంవత్సరాల దిగ్బంధం ఫలితంగా ఆర్థికంగా, ఆస్తులకు కలిగిన నష్టానికి తగిన పరిహారం చెల్లించాలని అవిశ్రాంతంగా అమెరికాను డిమాండ్ చేస్తూనే ఉంటాం. పరస్పర గౌరవం, సమానత్వం ప్రాతిపదికగా చర్చలకు, సహకారానికి క్యూబా ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. మా జాతీయ సార్వభౌమత్వానికి, స్వాతంత్ర్యానికి భంగం కలిగించే రాయితీలను క్యూబా ఎప్పడూ ఇవ్వదు. మేము కట్టుబడిన సూత్రాలపై రాజీకి, షరతులకు అంగీకరించం. అమెరికా దిగ్బంధం, శత్రుత్వం, క్యూబాలో ప్రభుత్వాన్ని మార్చటానికి ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ క్యూబా విప్లవం ఇక్కడ ఉంది. సజీవంగా, శక్తివంతంగా, తన సిద్ధాంతం పట్ల నిబద్ధతతో ఉంది.

మా ప్రభుత్వంలో తరాల మార్పు మా విప్లవ శత్రువులకు ఎటువంటి ఆశలను కల్పించదు. మేం ఆ విప్లవాన్ని కొనసాగించే వారమే. విచ్ఛిన్నం చేసేవారం కాము. తన సార్వభౌమత్వం, స్వాతంత్ర్యం, సోషలిజం, ప్రజాస్వామ్యం, అభివృద్ధి కోసం తన నమూనా ఆర్థిక, సామాజికాభివృద్ధిని మరింత ముందుకు తీసుకుపోవటానికి కృషి చేస్తుంది. మా ప్రజలు స్వేచ్ఛగా ఎంచుకున్న మార్గం ఇది. స్వాతంత్ర్యం, గౌరవం కోసం 150 సంవత్సరాల పోరాటాలతో కూల్చివేసిన పాత విధానాలకు మా దేశం తిరిగి వెళ్ళదు. అత్యధిక ప్రజల ఆమోదంతో 60 సంవత్సరాల క్రితం ప్రారంభించిన పనిని మేం పూర్తిచేస్తాం.

ఇదేలక్ష్యంతో మేం రాజ్యాంగ సంస్కరణల కార్యక్రమాన్ని ప్రారంభించాం. ప్రజలు చర్చలు జరపటం, చివరిలో ప్రజాభిప్రాయ సేకరణతో నూతన రాజ్యాంగాన్ని ఆమోదించబోతున్నాం. అత్యంత ప్రజాస్వామికంగా ఈ కార్యక్రమం జరుగుతున్నది. మా వ్యూహాత్మక లక్ష్యాలలో ఎటువంటి మార్పులు ఉండవని, సోషలిజం యొక్క తిరుగులేని లక్ష్యాలను ఆమోదిస్తారని నేను పూర్తి విశ్వాసంతో ఉన్నాను. మా విదేశాంగ విధాన లక్ష్యాలలో ఏ విధమైన మార్పులు ఉండవు. ఫైడల్ కాస్ట్రో 58 సంవత్సరాల క్రితం నిలబడి మాట్లాడిన వేదికపై నిలబడి, ప్రతి సంవత్సరం బెదిరింపులు, వత్తిళ్ళను ఎదిరించి, క్యూబా దిగ్బంధనాన్ని రద్దుచేయాలని ఓటు వేస్తున్న190కి పైగా దేశాల ప్రతినిధుల ముందు మాట్లాడటం అత్యంత సంతోషంగానూ, అద్భుతంగానూ ఉంది. యువతరం ఈ వేదికను ఎక్కటానికి ముందే మానవజాతిలో అత్యధికుల ఆకాంక్షలు నెరవేర తాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ సెలవు తీసుకుంటున్నాను. ❈

# తాగునీటి వ్యాపారం

**ఆర్. అరుణ్‌కుమార్**



**రచయిత**
**సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు**

**(ఇదేదో మనం కొనుక్కునే వాటర్ బాటిల్స్ గురించో, ఇంట్లో వాడుకునే వాటర్ ఫిల్టర్ల గురించో కాదని ముందుగా మనవి)**

ప్రపంచ జనాభాలో 18 శాతం మనదేశంలో ఉన్నారు. ప్రపంచ మంచినీటి వనరుల్లో మనదేశంలో ఉన్నవి మాత్రం 4 శాతమే. నీరు ఎంత విలువైన అవసరమో దీనిని బట్టి స్పష్టమౌతుంది. ఐతే మన పాలకులకి ఇదే విషయం ఇంకోలా అర్థం అయింది. ప్రైవేటు కార్పొరేట్లకు అదనంగా దోచిపెట్టడానికి ఇంకొక 'సరుకు' నీరు అని వాళ్లు భావిస్తున్నారు. 2025 నాటికి ప్రపంచంలో నీటి వ్యాపారం లక్ష కోట్ల డాలర్ల స్థాయికి చేరుతుందని అంచనా. అంటే ప్రస్తుత మారకం ప్రకారం 72 లక్షల కోట్ల రూపాయిలు. ఇందులో అధమ పక్షం పదో వంతు మన దేశంలో జరిగే నీటి వ్యాపారం అని అంచనాకి రావొచ్చు.

ఇప్పటికే తాగునీటి సరఫరా ఒక వ్యాపారంగా మారే ప్రక్రియ వేగం పుంజుకున్నదని తెలియజెప్పే దృష్టాంతాలు చాలా ఉన్నాయి. అందులో ఒక తాజా ఉదాహరణ: జూన్ 2018లో కోయంబత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని తాగునీటి సరఫరా నిర్వహణను సూయిజ్ అనే ఒక ఫ్రెంచ్ బహుళ జాతి కంపెనీకి కట్టబెట్టాలని నిర్ణయించింది. 26 సంవత్సరాల పాటు ఈ కాంట్రాక్టు కాలపరిమితి ఉంటుంది. రూ.2961 కోట్ల విలువైన కాంట్రాక్టు ఇది. నీటి సరఫరా చేపట్టినందుకే ఈ మొత్తం సూయిజ్‌కు చెల్లిస్తారు. దాంతోపాటు ప్రతి వెయ్యిలీటర్ల నీటికి రూ. 4.50 చొప్పున కంపెనీ అదనంగా యూజర్ చార్జీలు వసూలు చేస్తుంది. ఈ చార్జీలు క్రమంగా రూ. 9.50 వరకు పెంచుకోవడానికి కూడా ఆమోదం ఉంది. నీటి సరఫరా వ్యాపారంలో ఉన్న మూడు అతిపెద్ద కార్పొరేట్లలో ఈ సూయిజ్ కంపెనీ ఒకటి. ఢిల్లీలో 2012లో తన కార్యక్రమాలు ప్రారంభించిన ఈ కంపెనీ ఆ తరువాత బెంగళూరు, కోల్‌కత్తా నగరాలకు కూడా విస్తరించింది. రోజుకు 550 కోట్ల లీటర్ల నీటిని 4 కోట్ల 40 లక్షల మంది ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు సూయిజ్ ప్రకటించుకుంది. కాగ్ 2015 నివేదిక ఈ సూయిజ్ కంపెనీ చెన్నైలోని చెరంబక్కం సరస్సును చాలా లోపబూయిష్టంగా నిర్వహించిందని ఘాటుగా విమర్శించింది. అయినా మళ్లీ కోయంబత్తూరు కాంట్రాక్టును ఆ కంపెనీకే కట్టబెట్టడం విశేషం.

సూయిజ్ ఒక్కటే కాదు, ఇంకా సుమారు 300 ప్రైవేటు కంపెనీలు మనదేశంలో మంచినీటి సరఫరాలో భాగం అయ్యాయని మంథన్ అధ్యన్ కేంద్రం అనే ఓ స్వచ్ఛంధ సంస్థ అధ్యయనంలో వెల్లడైంది. వియోలా వాటర్ (ఇండియా), జస్‌కో, విశ్వఇన్ఫ్రాస్ట్రక్చర్ లి, ఎమ్మెస్కే ప్రాజెక్టు ( ఇండియా), ఆరెంజ్ సిటీ వాటర్ ప్రై.లి. రేడియస్ వాటర్‌లి. వంటివి ఈ వ్యాపారంలో ఉన్న బడా కంపెనీలు.

నయా ఉదారవాద విధానాల అమలుతో నీటి సరఫరా ప్రైవేటీకరణ కూడా క్రమంగా పెరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రపంచ బ్యాంకు స్మార్ట్ సిటీ ప్రాజెక్టు, జెఎన్ఎన్‌యుఆర్‌ఎం వంటి కేంద్ర పథకాల ద్వారా రుణాలు ఇచ్చే సందర్భంలో విధించిన షరతులలో నీటి సరఫరా ప్రైవేటీకరణ కూడా ఒక ముఖ్యమైన షరతు. కర్ణాటక మునిసిపల్ సంస్కరణల ప్రాజెక్టు, తమిళనాడు పట్టణాభివృద్ధి ప్రాజెక్టు, ఆంధ్రప్రదేశ్ పట్టణ సంస్కరణల,



తాగునీటితో బడా కంపెనీల వ్యాపారం



తెలంగాణలో కిలోమీటర్ల దూరం నడిచివెళ్లి మంచినీళ్లు తెస్తున్న మహిళలు

మునిసిపల్ సేవల ప్రాజెక్టు, గుజరాత్ పట్టాణిభివృద్ధి కార్యక్రమం, పశ్చిమ బెంగాల్ పట్టాణాభివృద్ధి ప్రాజెక్టు వంటి ప్రపంచ బ్యాంకు ప్రాజెక్టులు రాష్ట్రాలతో నేరుగా కుదుర్చుకునే ఒప్పందాలు. వీటిన్నింటిలో ప్రపంచబ్యాంకు విధించిన షరతులలో మంచినీటి సరఫరాను ప్రైవేటీకరించడం అన్నది ఒకటి. దాంతోపాటు యూజర్ ఛార్జీలు వసూలు చేయాలన్నది ఇంకో షరతు కూడా ఉంది.

1992 నుంచి ప్రపంచబ్యాంకు తన నివేదికలలో నీటి సరఫరాను ప్రైవేటీకరించాలన్న ప్రచారం మొదలుపెట్టింది. అంతటితో ఆగకుండా ప్రైవేటు కంపెనీలు ఈ నీటి సరఫరా ప్రాజెక్టులు చేపట్టాలంటే వాటికి లాభాలు గ్యారంటీగా వచ్చేలా నీటి సరఫరా చార్జీలను పెంచాలని కూడా నిర్దేశించింది. 2018 మే నెలలో మన భారత ప్రభుత్వం ప్రపంచబ్యాంకు నుంచి 'ఆటల్ భూజల యోజన' ప్రాజెక్టు కోసం 45 కోట్ల డాలర్ల రుణాన్ని (సుమారు రూ 3200 కోట్లు) తీసుకుంది. నీటి చార్జీలను పెంచాలనే ముందస్తు షరతు ఇక్కడ కూడా ఉంది.

తాగునీటిని ప్రజలకు అందించడం ఒక ప్రభుత్వపు బాధ్యతగా కాకుండా, దాని నిర్వహణయే ఖర్చు ప్రజలనుంచే వసూలు చేయాలనే దుర్మార్గపు ఆలోచనకు 8వ పంచవర్ష ప్రణాళిక (1992–97) లోనే అంటే పివి నర్సింహారావు హయాంలోనే బీజం పడింది. 2002లో జాతీయ నీటి విధానం అనే డాక్యుమెంటును ఆమోదించినప్పుడు అందులో నీటి సరఫరా నిర్వహణను ప్రైవేటు రంగానికి అప్పజెప్పాలని పేర్కొన్నారు. 2012లో తిరిగి ఆమోదం పొందిన నీటి విధాన పాలసీలోనూ ఇదే విషయాన్ని మళ్లీ మరోసారి చెప్పారు.

నీటి ప్రైవేటీకరణ అమలుకోసం ప్రత్యేక సంస్థల ఏర్పాటు కూడా జరుగుతోంది. కర్ణాటక అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కార్పొరేషన్ అటువంటి సంస్థలలో మొదటిది. ఇటువంటివి ఇప్పుడు ప్రతీ రాష్ట్రంలోనూ ఏర్పడ్డాయి. కేవలం పరిపాలన సౌలభ్యం కోసం, ప్రత్యేక అధ్యయనం కోసం, వేగంగా నిర్ణయాలు చేయడం కోసం ఏర్పడినవే ఇవి అని ప్రభుత్వం వీటి ఏర్పాటును సమర్థించు కుంటున్నది. కానీ ఈ సంస్థ లేవీ ప్రజలెన్నుకున్న మున్సిపల్ పాలక మండళ్లకు జవాబుదారీగా ఉండవు. తాజాగా స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా ఏర్పరుస్తున్న ప్రత్యేక సంస్థలను ఏకంగా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలుగా రిజిష్టరు చేస్తున్నారు. ప్రపంచ బ్యాంకు మాటల్లో చెప్పాలంటే నీటి సరఫరా

**"35 దేశాలలోని 180 నగరాలలో ప్రైవేటు నీటిసరఫరా విధా నాన్ని రద్దుచేసి మళ్లీ మునిసిపాలిటీలే నీటి నిర్వహణను చేపట్టవలసి వచ్చింది. సూయెజ్, వియోలా వంటి బహుళజాతి ప్రైవేటు నీటి కంపెనీలకు పుట్టిల్లు ఫ్రాన్స్ దేశంలోనే ప్రజలు చేసిన పోరాటాల ఫలితంగా 41 నగరాల మునిసిపాలిటీలు తిరిగి నీటి సరఫరా నిర్వహణను ప్రైవేటు కంపెనీల నుంచి వెనక్కి తీసుకున్నాయి."**



**పట్టణాలలో నీటికోసం నిరీక్షిస్తున్న మహిళలు**

నిర్వహణను రాజకీయ రహితంగా, కమర్షియల్‌గా చేపట్టడానికి ఇదే సరైన మార్గం! కోయంబత్తూరు ప్రాజెక్టును సూయిజ్ కంపెనీకి అప్పజెప్పాలన్న నిర్ణయాన్ని మునిసిపల్ కమిషనరే స్వయంగా తీసుకున్నాడు తప్ప ఎన్నికైన మునిసిపల్ మండలి కాదు.

ఇప్పటి దాకా అమలు జరిగిన నీటి సరఫరా ప్రైవేటీకరణ ప్రతిరోజూ, రోజులో 24 గంటలూ నీరందించిన స్థితిని ఎక్కడైనా సాధించిందా? సాకారం చేసిందా? అంటే అటువంటిదెక్కడా లేదు. జెంషెడ్‌పూర్, మైసూరు, నాగపూర్ వంటి నగరాల అనుభవాలన్నీ ఈ వాస్తవాలనే తెలియజేస్తున్నాయి. నిజానికి ప్రపంచవ్యాప్తంగా సాధారణ ప్రజలు క్రమక్రమంగా నీటి సరఫరాను తిరిగి స్థానిక సంస్థలే చేపట్టాలన్న ఉద్యమాలలోకి దిగుతున్నారు. 35 దేశాలలోని 180 నగరాలలో ప్రైవేటు నీటిసరఫరా విధానాన్ని రద్దుచేసి మళ్లీ మునిసిపాలిటీలే నీటి నిర్వహణను చేపట్టవలసి వచ్చింది. సూయెజ్, వియోలా వంటి బహుళజాతి ప్రైవేటు నీటి కంపెనీలకు పుట్టిల్లు ఫ్రాన్స్ దేశంలోనే ప్రజలు చేసిన పోరాటాల ఫలితంగా 41 నగరాల మునిసిపాలిటీలు తిరిగి నీటి సరఫరా నిర్వహణను ప్రైవేటు కంపెనీల నుంచి వెనక్కి తీసుకున్నాయి.

విచిత్రం ఏమిటంటే, 2005 ప్రపంచ బ్యాంకు నివేదిక కూడా ప్రైవేటు కంపెనీలు నీటి సరఫరా చేపట్టిన తరువాత సామర్థ్యం పెరిగిన దాఖలా ఎక్కడా కనిపించడం లేదని ఒప్పుకుంది. ఐనప్పటికీ అప్పులిచ్చేటప్పుడు మాత్రం నీటి ప్రైవేటీకరణ షరతు పెడుతూనే ఉంది!

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం తీవ్రమౌతున్న నేపథ్యంలో అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి నీటి ప్రైవేటీకరణ చేపట్టాలన్న ఒత్తిడిని మరింత తీవ్రంగా పెంచుతోంది. గ్రీస్, పోర్చుగల్, ఇటలీ, ఐర్లాండ్ వంటి దేశాలలో ఈ ప్రయత్నాలు బెడిసికొట్టాయి. తీవ్ర ప్రతి ఘటనలతో ప్రజలు స్పందించేసరికి ప్రభుత్వాలు తోక ముడిచాయి. బొలీవియా లోనూ, అమెరికాలోని అట్లాంటా రాష్ట్రంలోనూ ఇటు వంటి పోరాటాలు జరిగాయి. ఈ స్ఫూర్తిదాయక అనుభవాలే మనకు దిక్సూచి. ❋

# ఆధిపత్యం నిలుపుకోడానికి అమెరికా ఆరాటం



రచయిత
మార్క్సిస్టు సంపాదకులు

**ఎస్. వెంకట్రావు**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత నెల మరో 20,000 కోట్ల డాలర్ల (సుమారు 14 లక్షల కోట్ల రూపాయల) చైనా వస్తువులపై 10 శాతం దిగుమతి సుంకాలు విధించడంతో అమెరికా – చైనాల మధ్య వాణిజ్య యుద్ధం మరింత ముదిరింది. చరిత్రలో ఏ అమెరికా అధ్యక్షుడు కూడా మరో దేశంపై ఇంత పెద్ద ఎత్తున వాణిజ్య సుంకాలు విధించలేదు. సెప్టెంబర్ 24 నుండి చైనా దిగుమతులపై ఈ అదనపు సుంకాలు అమలులోకి వస్తాయనీ, ఈ ఏడాది చివరికి ఈ సుంకాలు 25 శాతానికి పెరుగుతాయని ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. చైనానుండి దిగుమతయ్యే దాదాపు 1000 రకాల వస్తువులపై అమెరికా సుంకాలు పెరుగుతాయి. గత జులై 6న, అంతకు ముందు ట్రంప్ ప్రభుత్వం 5000 కోట్ల డాలర్ల (సుమారు 3.5 లక్షల కోట్ల రూపాయల) విలువైన చైనా దిగుమతులపై 25 శాతం సుంకాలు విధించిన దానికి ప్రస్తుత సుంకాలు అదనం. చైనా నుండి దిగుమతయ్యే మరో 26,700 కోట్ల డాలర్ల వస్తువులపై సుంకాలు విధిస్తామని ట్రంప్ సెప్టెంబర్ 6న హెచ్చరించారు. ఇవి అమలైతే అమెరికా మొత్తం 51,700 కోట్ల డాలర్ల చైనా వస్తువులపైన అంటే దాదాపు చైనా నుండి దిగుమతయ్యే వస్తువులన్నిటిపైనా సుంకాలు విధించినట్లవుతుంది.

అమెరికా చైనా మధ్య 65,000 కోట్ల డాలర్ల వ్యాపారం ఏటా జరుగుతోంది. గత ఏడాది అమెకాకు చైనా 50,500 కోట్ల డాలర్ల ఎగుమతులు చేసింది. అమెరికా నుండి చైనాకు సుమారు 15,000 కోట్ల డాలర్ల సరుకులు దిగుమతయ్యాయి. ఇప్పటి వరకు అమెరికా 25,000 కోట్ల డాలర్ల చైనా వస్తువులపై అదనపు సుంకాలు విధించింది మరో 26,700 కోట్ల డాలర్ల వస్తువులపై విధించడానికి సన్నాహాలు చేస్తోంది. రెండోవైపు చైనా ప్రతీకారంగా గతంలోనే 5,000 కోట్ల డాలర్ల అమెరికా వస్తువులపై అదనపు సుంకాలు విధించింది. ప్రస్తుత ట్రంప్ ప్రకటనకు ప్రతీకారంగా మరో 6000 కోట్ల డాలర్ల (సుమారు 4.2 లక్షల కోట్ల రూపాయల) అమెరికా దిగుమతులపై సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించింది. అంటే అమెరికా, చైనాలు తమ మధ్య వాణిజ్యం జరుగుతున్న మొత్తం వస్తువులపై పరస్పరం సుంకాలు విధించుకుంటున్నా యన్న మాట.

ఈ ఏడాది ప్రారంభంలో తమ దేశంలోకి దిగుమతి అవుతున్న ఉక్కు, అల్యూమినియంపై సుంకాలు విధించిన ట్రంప్ చర్య వల్ల చైనా ఎక్కువ నష్టపోయినా ఇంకా అనేక దేశాలపై ప్రభావం పడింది. ఉదాహరణకు మన దేశం నుండి అమెరికాకు ఎగుమతులు దెబ్బతిన్నాయి. ఐరోపా దేశాలనుండి మోటారు విడిభాగాలపై ట్రంప్ ప్రభుత్వం అదనపు సుంకాలు విధించడంతో ఐరోపా సమాజ దేశాలన్నీ ట్రంప్‌పై ధ్వజమెత్తాయి. కాని రాను రాను ట్రంప్ ఇతర దేశాలతో ఏదో విధంగా సర్దుబాటు చేసుకుంటూ వాణిజ్య యుద్ధాన్ని మొత్తంగా చైనాపై ఎక్కుపెట్టడం, చైనాపై అనేక ఆరోపణలు చేస్తూ అంతర్జాతీయ సమాజంలో దాన్ని ఏకాకిని చేయడానికి ప్రయత్నిస్తుండడంతో అమెరికా వాణిజ్య యుద్ధం వెనుక అసలు ఉద్దేశాలు ఒక్కొక్కటే బయటపడుతున్నాయి.

అంతర్జాతీయ వాణిజ్యంలో చైనా అనుసరిస్తున్న 'అన్యాయమైన వాణిజ్య పద్ధతుల'ను ఎంత త్వరగా విడనాడితే సమస్య అంత త్వరగా పరిష్కారం అవుతుందని చైనాపై వాణిజ్య ఆంక్షలు విధిస్తూ ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ చెబుతున్న 'అన్యాయమైన వాణిజ్య పద్ధతులు' ఏమిటి? చైనా తమ దేశంలో చౌకగా ఉత్పత్తి అయిన వస్తువులను అమెరికా మార్కెట్‌లో గుమ్మరిస్తుండడం వల్ల రెండు దేశాల మధ్య వాణిజ్య సమతుల్యత దెబ్బతింటోందని అమెరికా వాదిస్తోంది. దానివల్ల చైనాతో వాణిజ్యంలో అమెరికాకు పెద్ద ఎత్తున లోటు ఏర్పడుతోందని అంటోంది. నిజానికి అమెరికా 105 ఇతర దేశాలతో (మన దేశంతో సహా) కూడా వాణిజ్య లోటు కలిగి ఉంది. కానీ చైనానే ప్రత్యేకించి ఎందుకు వేలెత్తి చూపిస్తోంది? పైగా అమెరికాతో వాణిజ్య లోటు తగ్గించుకోడానికి తాము సిద్ధంగా ఉన్నామని చైనా నాయకత్వం ప్రకటించింది. వాటన్నిటినీ అమెరికా తిరస్కరించి ట్రంప్ తెంపరితనం ప్రకటించకానికి అసలు కారణం వాణిజ్య లోటులో లేదన్న విషయం బోధపడిపోతూనే ఉంది.

వాస్తవం ఏమంటే....చైనా 2015లో ప్రకటించిన ఆర్థికాభివృద్ధి కార్యక్రమాన్ని పూర్తిగా విడనాడాలనీ, ఆధునిక ఉన్నత టెక్నాలజీ ఆర్థిక రంగంలో అది తమకు లోబడి ఉండాలని అమెరికా కోరుతోంది. ఈ అంశంపై అమెరికా ప్రభుత్వం ఈ ఏడాది మేలో ప్రవేశపెట్టిన విధాన పత్రంలో ఇలా పేర్కొంది: "మేడ్ ఇన్ చైనా 2025 పారిశ్రామిక ప్రణాళికలో పేర్కొన్న పరిశ్రమలకు చైనా ప్రభుత్వం మద్దతివ్వకూడదు, మార్కెట్‌ను వక్రీకరించే సబ్సిడీలు ఇవ్వకూడదు"

### ఏమిటీ 'మేడ్ ఇన్ చైనా 2025 పారిశ్రామిక ప్రణాళిక'

చైనా ప్రధాని లీ క్వెకాంగ్ 2015లో ఈ ప్రణాళిక విడుదల చేశారు. పదేళ్లలో అంటే 2025 నాటికి చైనా హై టెక్నాలజీ పారిశ్రామిక రంగాల్లో వేగంగా ముందుకు పోయి పశ్చిమ దేశాల స్థాయిని అందుకోవాలన్నది దీని లక్ష్యం. వీటిలో 10 ప్రధాన రంగాలున్నాయి. అవి... 1. ఎలక్ట్రిక్ కార్లు, ఇతర కొత్త ఇంధన వాహనాలు 2. కొత్త తరం ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), టెలికమ్యూనికేషన్స్ 2. ఆధునిక రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు (ఎఐ) 4. వ్యవసాయ టెక్నాలజీ 5. అంతరిక్ష, గగన తల ఇంజినీరింగ్ 6. కొత్త సింథటిక్ వస్తువులు 7.


ఆధునిక విద్యుత్ పరికరాలు 8. కొత్త తరం బయో ఔషదలు 9. ఆధునిక రైల్వే సదుపాయాలు 10. హై టెక్ సముద్ర ఇంజినీరింగ్.

నాల్గవ పారిశ్రామిక విప్లవంగా చెబుతున్న దానికి ఈ రంగాలు కేంద్రంగా ఉంటాయి. జర్మనీ ప్రభుత్వం 'పరిశ్రమ 4.0 అభివృద్ధి ప్రణాళిక' పేరుతో అమలు చేస్తున్న మాదిరిగానే చైనా ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ఆధునిక పారిశ్రామికాభివృద్ధివైపు ముందడగు వేయడానికి ఈ ప్రణాళికను రూపొందించి అమలు పరుస్తోంది. ట్రంప్ ప్రభుత్వం ప్రస్తుతం తన వాణిజ్య యుద్ధాన్ని ఈ అభివృద్ధి ప్రణాళికపై కేంద్రీకరించింది. చైనా ఈ ప్రణాళికను విడనాడితేనే వాణిజ్య ఆంక్షలు అంతమవుతా యంటున్నది. అంటే చైనా ఎప్పటికీ ఇప్పటి మాదిరిగా చౌక శ్రమతో కూడిన వస్తువులను విదేశాలకు అమ్ముకుని బ్రతకాలనీ, అత్యాధునిక టెక్నాలజీ విషయంలో ఇప్పటి మాదిరిగానే పశ్చిమ దేశాపై ఆధారపడాలన్నది అమెరికా ఉద్దేశం.

ఇప్పటివరకు చైనా మౌలిక వినిమయ వస్తువులైన వస్త్రాలు, చెప్పులు, నిత్యావసర ఎలక్ట్రానిక్ వస్తువులు విదేశాలకు ఎగుమతి చేస్తూ అభివృద్ధి సాధించింది. తక్కువ వేతనాలతో తయారయ్యే ఈ తక్కువ విలువైన వస్తువులను విదేశాలకు ఎగుమతి చేయడంలో అది మెక్సికో, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, తైవాన్ వంటి ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోటీ పడుతోంది. దాని వల్ల చైనా ఆర్థిక వ్యవస్థ మధ్య స్థాయికి వచ్చి ఆగిపోయే ప్రమాదం ఉంది. దీన్నే 'మిడిల్ ఇన్‌కమ్ ట్రాప్' అంటారు. దీన్ని అధిగమించి అభివృద్ధి చెందాలంటే అది కార్మికు లకు అధిక వేతనాలు లభించే అత్యాధునిక పరిశ్రమలవైపు నడవాల్సిందే. చైనా ప్రభుత్వ 'మేడ్ ఇన్ చైనా 2025 వ్యూహం' ప్రధాన లక్ష్యం అది.

ప్రపంచ వస్తూత్పత్తి విలువ గొలుసులో (గ్లోబల్ ప్రొడక్షన్ చైన్) చైనా దిగువ భాగంలో ఉంది. అంటే అది ఉత్పత్తి గొలుసులో తక్కువ విలువను సమకూర్చుతోంది. అత్యాధునిక రంగాల్లో అభివృద్ధి చెందడం ద్వారా ఈ గొలుసులో పైపైకి పోయి అమెరికా స్థాయికి ఎదగాలని అది లక్ష్యం నిర్దేశించుకుంది. అందుకే 2020 నాటికి కీలక వస్తువుల ఉత్పత్తిలో 40 చైనా ఉత్పత్తి చేయాలని 2025 నాటికి 75 శాతం ఉత్పత్తి చేయాలని నిర్ణయించింది. ఆధునిక హైటెక్ రంగం ముఖ్యంగా ఫార్మాస్యూటికల్ రంగం ఇప్పుడు పూర్తిగా అమెరికా, ఇతర పశ్చిమ దేశాల చేతుల్లో ఉంది. ఫార్మాస్యూటికల్స్‌తో పాటు సెమీ కండక్టర్ల విషయంలో చైనా బాగా వెనుకబడి ఉంది.

**"ప్రపంచ వస్తూత్పత్తి విలువ గొలుసులో (గ్లోబల్ ప్రొడక్షన్ చైన్) చైనా దిగువ భాగంలో ఉంది. అంటే అది ఉత్పత్తి గొలుసులో తక్కువ విలువను సమకూర్చుతోంది. అత్యాధునిక రంగాల్లో అభివృద్ధి చెందడం ద్వారా ఈ గొలుసులో పైపైకిపోయి అమెరికా స్థాయికి ఎదగాలని అది లక్ష్యం నిర్దేశించుకుంది. అందుకే 2020 నాటికి కీలక వస్తువుల ఉత్పత్తిలో 40 చైనా ఉత్పత్తి చేయాలని 2025 నాటికి 75 శాతం ఉత్పత్తి చేయాలని నిర్ణయించింది."**




4వ సాంకేతిక విప్లవంలో అగ్రస్థానం కోసం పశ్చిమ దేశాలతో చైనా పోటీ పడుతోంది

ప్రపంచ సెమీకండక్టర్లలో 60 శాతం చైనాలో వినియోగించబడుతున్నాయి. కానీ ఇక్కడ 13 శాతం మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. మిగిలిన భాగం దిగుమతులపై ఆధారాపడాల్సి వస్తోంది. అందువల్ల 2025 నాటికి హైటెక్ రంగంలో 70 శాతం స్వయం సమృద్ధి సాధించాలనీ, 2049 నాటికి అంటే చైనా విముక్తి చెంది వందేళ్లు గడిచే నాటికి ఆధునిక సోషలిస్టు దేశంగా మారాలని చైనా కమ్యూనిస్టు పార్టీ 19వ జాతీయ మహాసభ నిర్దేశించింది. ఈ '2025 పారిశ్రామిక ప్రణాళిక'కు అనుగుణంగానే చైనా ఇటీవలి కాలంలో సంప్రదాయ పారిశ్రామిక ఉత్పత్తులను తగ్గించి హైటెక్, ఉన్నత జీతాలు ఇచ్చే పరిశ్రమల్లో ఉత్పత్తి పెంచడం ప్రారంభించింది. సోలార్ పరిశ్రమ, బుల్లెట్ రైళ్లు, ఇతర ఆధునిక పరిశ్రమల్లో అది ఉరకలు పరుగులు పెడుతోంది. అత్యాధునిక పరిశ్రమలు చైనాలో అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం నుండి సహకారం సబ్సిడీల రూపంలో అందాలి. పరిశోధన, ఆవిష్కరణలపై భారీ పెట్టుబడి పెట్టాలి. ఈ పనులు చేస్తూ చైనా ప్రభుత్వం స్థానిక పరిశ్రమలకు లక్ష్యాలు నిర్దేశించి ప్రణాళిక ప్రకారం ఫలితాలు సాధిస్తోంది. గతంలో చైనా ప్రభుత్వం తమ దేశంలోకి వచ్చి సంయుక్త రంగంలో పెట్టుబడులు పెట్టే పశ్చిమ దేశాల పరిశ్రమలకు అన్ని సదుపాయాలు కల్పించడంతో పాటు 'నిర్దిష్ట కాలంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని చైనా స్వంతం చేయాలన్న' నిబంధనలు పెట్టేది. ఆ విధంగానే అది పారిశ్రామికాభివృద్ధి సాధించగలిగింది. ఇప్పుడు హైటెక్ పరిశ్రమల విషయంలో కూడా చైనా అదే పద్ధతి అనుసరిస్తోంది. చైనా మార్కెట్‌లోకి ప్రవేశించాలనుకుని పెట్టుబడులు పెట్టే విదేశీ హైటెక్ కంపెనీలన్నీ విధిగా కొంత కాలానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని చైనాకు అప్పగించాలి. అమెరికా పాలక వర్గాలకు, అధ్యక్షుడు ట్రంప్‌కు ఇది నచ్చడం లేదు. మేడ్ ఇన్ చైనా 2025 ప్రణాళికలోని నిబంధనలు చైనా మార్కెట్‌లో అమెరికా కంపెనీల పట్ల న్యాయ విరుద్ధంగా ఉన్నాయని ఆయన అంటున్నారు. అందువల్ల ఈ అభివృద్ధి ప్రణాళికనే ఎత్తివేయాలనేది ఆయన డిమాండు.

నీ అభివృద్ధి చెందుతున్న దేశాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల స్థాయిని అందుకోవాలంటే ప్రభుత్వాల సహకారం, టెక్నాలజీని సంపాదించుకోవడం మినహా మరో మార్గం లేదు. నిజానికి అమెరికాతో సహా పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలన్నీ

**❝ డాలరు యొక్క ఈ ఆధిపత్యాన్ని నిలుపు కోడానికి అమెరికా సామధాన బేధ దండో పాయలన్నిటినీ ఉపయో గిస్తుంది. మొదటిది, ప్రపంచ ముడి చమురు వ్యాపారమంతా డాలర్లలోనే జరిగేట్లు అమెరికా చూసుకుంది. దీనికోసం సౌదీ అరేబియాతో ఒక ఒప్పందం చేసుకుంది. సౌదీలో ప్రజాస్వామ్యం అంటూ లేని రాచరిక పాలన సాగుతున్నా అమెరికా దాన్ని అన్ని విధాలా రక్షించడానికీ, గల్ఫ్‌లో సౌదీ శత్రువులపై ముఖ్యంగా ఇరాన్‌పై కాలు దువ్వడానికీ కారణం అదే. ❞**



చైనా ప్రధాని లీ కెకియాంగ్




2025 నాటికి ఉన్నతస్థాయి ఉత్పత్తుల తయారీకి చైనా ప్రణాళిక రూపొందించింది

మొదట్లో ఇలాగే వ్యవహరించాయి. అమెరికా తన దేశంలో పరిశ్రమలు చిగురిస్తున్న కాలంలో సుంకాలు, సబ్సిడీల సాధనాలను ఉపయోగించు కుంది. తన కన్నా బాగా అభివృద్ధి చెందిన దేశాల నుండి సాంకేతికతను తెచ్చుకుంది. విదేశీ పెట్టుబడులను బాగా నియంత్రించింది. తరువాత కాలంలో అభివృద్ధి చెందిన జపాన్, తూర్పు ఆసియా దేశాలు, దక్షిణ కొరియా, తైవాన్, హాంగ్ కాంగ్, సింగపూర్ కూడా ఈ మార్గాన్నే అనుసరించాయి. కానీ ఇప్పుడు చైనా ఈ పద్ధతి పాటిస్తే మాత్రం అమెరికాకు తప్పు కనిపించడానికి ఆర్థిక కారణాల కన్నా రాజకీయ కారణాలే ప్రధానమైనవని విశ్లేషకులు చెబుతున్నారు.

**అమెరికా ఆధిపత్యాన్ని నిలుపుకోడానికే**

ప్రపంచంలో దిగజారిపోతున్న తన ఆర్థికాధిపత్యానికి చైనా నుండి ప్రమాదం వస్తోందని అమెరికా భావిస్తున్నందునే దాన్ని కట్టడి చేయడానికి ఈ వాణిజ్య యుద్ధాలకు పాల్పడిన విషయం నేడు స్పష్టమైపోతోంది. అవసరమైతే సైనిక యుద్ధాలకు కూడా వెనుకాడ బోమని అమెరికా నేతలు ప్రకటిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో చైనాను ట్రంప్ "వ్యూహాత్మక ప్రత్యర్థి" అని ప్రకటించిన విషయం విదితమే. వ్యూహాత్మక ప్రత్యర్థి అంటే సైనిక శత్రువు అని అర్థం. గత సెప్టెంబర్ 21న అమెరికా సైనిక దళాల ఇండో–పసిఫిక్ కమాండ్ అధిపతి అడ్మిరల్ డేవిడ్‌సన్ అమెరికన్ సెనెట్ సైనిక కమిటీ ముందు మాట్లాడుతూ "యుద్ధం మాత్రమే చైనాను నిలువరించగలదు" అన్నారు. ఆయనకు ముందు పనిచేసిన అడ్మిరల్ హారిస్ కూడా ఫిబ్రవరి నెలలో ఇలానే మాట్లాడారు. ప్రస్తుత అమెరికా నాయకత్వపు వైఖరి పరిశీలిం చినా, గత చరిత్రనూ, రెండో ప్రపంచ యుద్ధా నంతర పరిణామాలనూ పరిశీలించినా అమెరి కా ఈ వాణిజ్య యుద్ధంతో ఆగబోదని అర్థమవుతుంది.

డాలరు ఆధిపత్యాన్ని, అత్యాధునిక సాంకే తిక పరిజ్ఞానంలో పశ్చిమ దేశాల ఆధిపత్యాన్ని కాపాడుకోడానికి సామ్రాజ్యవాదం ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదం ఎంతటి నైచ్యానికైనా పాల్పడుతుందని గత కొన్ని దశాబ్దాలుగా జరిగిన పరిణామాలు మన కళ్లకు కట్టాయి. డొనాల్డ్ ట్రంప్ ప్రస్తుతం అమెరికా ఆర్థిక వ్యవస్థ ఎదు ర్కొంటున్న రెండు సవాళ్లతో సతమతమవు తున్నారు. మొదటిది, రిజర్వు కరెన్సీగా అమెరికా డాలరుకు ఎదురవుతున్న సవాలు. రెండోది డిజిటల్, హైటెక్ రంగాల్లో తన ఆధిపత్యానికి గండి కొడుతున్న పరిణామాలు. ప్రపంచంపై అమెరికా ఆధిపత్యానికి ఈ రెండు కీలకంగా ఉన్నాయి.

ఆర్థికరంగంలో అమెరికా ఆధిపత్యానికి ప్రధాన కారణం డాలరు రిజర్వు కరెన్సీగా ఉ ండడమే. ఇతర దేశాలు డాలర్లు సంపాదించడా నికి సరుకులు ఎగుమతి చేయాలి. కానీ అమెరికా కు ఆ అవసరం లేదు. అది తనకు కావలసినన్ని డాలర్లు ముద్రించేస్తుంది. వాటితో ప్రపంచంలో ఏ ఆస్తినైనా, సంస్థనైనా, సాంకేతిక పరిజ్ఞానా న్నైనా కొనేస్తుంది. వాటితో విదేశాలనుండి భారీగా దిగుమతులు చేసుకుంటుంది. ఇతర దేశాలు తమ కరెన్సీలను ఇష్టం వచ్చినట్లు ముద్రిస్తే ద్రవ్యోల్బణం పెరిగిపోతుంది. కానీ అమెరికాకు ఆ బాధ లేదు. ఎందుకంటే అది ముద్రించే అదనపు డాలర్లను ప్రపంచ దేశాలన్నీ పంచుకుంటాయి. ఎందుకంటే అది రిజర్వు కరెన్సీ గనుక. ప్రపంచ వాణిజ్యంలో అమెరికా వాటా 15 శాతానికన్నా తక్కువేగానీ ప్రపంచ వాణిజ్యంలో 70 శాతం డాలర్లలోనే జరుగు తుంది. డాలరు యొక్క ఈ ఆధిపత్యాన్ని నిలుపు కోడానికి అమెరికా సామధాన బేధ దండో పాయలన్నిటినీ ఉపయోగిస్తుంది. మొదటిది, ప్రపంచ ముడి చమురు వ్యాపారమంతా డాలర్లలోనే జరిగేట్లు అమెరికా చూసుకుంది. దీనికోసం సౌదీ అరేబియాతో ఒక ఒప్పందం చేసుకుంది. సౌదీలో ప్రజాస్వామ్యం అంటూ లేని రాచరిక పాలన సాగుతున్నా అమెరికా దాన్ని అన్ని విధాలా రక్షించడానికీ, గల్ఫ్‌లో సౌదీ శత్రువులపై ముఖ్యంగా ఇరాన్‌పై కాలు దువ్వడానికీ కారణం అదే. రెండోది, చమురు వ్యాపారంలో డబ్బు లావాదేవీలు ప్రధానంగా అమెరికా బ్యాంకుల ద్వారా జరుగుతాయి. ఈ బ్యాంకులు డాలర్లలోనే చెల్లింపులను అంగీకరిస్తాయి.

ఏదైనా దేశం డాలర్లలో కాకుండా ఇతర కరెన్సీలలో చెల్లింపులకు పూనుకుంటే అమెరికా అంగీకరించదు. దాడులు చేస్తుంది. ఇరాక్‌పై దాడిచేసి సద్దాం హుస్సేన్‌ను చంపడానికికారణం ఆయన సామూహిక మారణాయుధాలు దాయడం కాదని ఇప్పుడు తేలిపోయింది. మరి అసలు కారణం ఏమిటి? సద్దాం చమురు లావాదేవీలు యూరోల్లోనూ, ఇతర కరెన్సీల్లోనూ జరపడమే.

ఇప్పుడు చైనా నుండి, ఇతర దేశాల నుండి కూడా డాలరుకు ముప్పు వస్తున్నది. ఈ దేశాలు తమ తమ దేశీయ కరెన్సీల్లో చమురు చెల్లింపులు చేసుకుంటున్నాయి. కొన్ని దేశాలు ముఖ్యంగా ఇరాన్ స్థానిక కరెన్సీలతో బాటు, బార్టర్ పద్ధతిలో కూడా చమురు వాణిజ్యం చేస్తోంది. చైనా పెద్ద ఎత్తున తలపెట్టిన బెల్ట్ అండ్ రోడ్డు

ప్రాజెక్టు కాంట్రాక్టులను స్థానిక కరెన్సీల్లోనే ఇవ్వాలని నిర్ణయించుకుంది. అందువల్ల అమెరికాకు చైనాపై మంట.

చైనాపై అమెరికా వాణిజ్య యుద్ధాన్ని గురిపెట్టడానికి మరో కారణం హైటెక్ రంగంలో అది రూపొందించుకున్న 2025 పారిశ్రామిక ప్రణాళిక. ఈ రంగంలో చైనా తన ఆధిపత్యానికి సవాలు విసురుతోందని అమెరికా భావిస్తోంది. పైగా అమెరికాకు చెందిన అతిపెద్ద టెక్నాలజీ సంస్థలైన గూగుల్, ఫేస్‌బుక్‌లను చైనా తమ దేశంలోకి రానీయడం లేదు. అది తన స్వంత ఇంటర్ నెట్‌ను తయారు చేసుకుంది. దీన్ని అనుసరించి రష్యా, బ్రెజిల్, ఇంకా అనేక దేశాలు స్వంత ఇంటర్‌నెట్ సంస్థలను రూపొందించుకున్నాయి. ప్రస్తుతం ఐరోపా ఆర్థిక సమాజ దేశాలు కూడా స్వంత ఇంటర్‌నెట్ రూపొందించుకోవాలని భావిస్తున్నాయి. దీనర్థం డిజిటల్ రంగంలో అమెరికా ఆధిపత్యానికి గండి పడుతోందన్న మాట. చైనాపై అమెరికా మంటకు ఇది రెండో కారణం.

### చైనాను నిలువరించే యత్నం

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత సోవియట్ యూనియన్‌ను సైనిక, ఆర్థిక దిగ్బంధనానికి గురిచేసినట్లు చైనాను దిగ్బంధించడమే అమెరికా లక్ష్యంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అందుకే ట్రంప్ చైనాతో వాణిజ్య వివాదాలను డబ్ల్యుటిఓ లో పెట్టి పరిష్కరించుకోడానికి ప్రయత్నించకుండా అమెరికా చట్టాలను ఏకపక్షంగా ఆశ్రయించాడు. అమెరికా ట్రేడ్ చట్టం 1974లోని 301 అధికరణాన్ని డబ్ల్యుటిఓ ఏర్పడిన తరువాత అమెరికా ప్రభుత్వాలు పెద్దగా ఉపయోగించలేదు. ఈ చట్టం వాణిజ్యాన్ని అమెరికా భద్రతతో ముడిపెడుతుంది.

చైనాను వాణిజ్య పరంగా తీవ్ర ఒత్తిడికి గురిచేస్తే అది తన ఆధిపత్యం కిందకు వస్తుందని అమెరికా భావిస్తోంది. వాణిజ్య యుద్ధాన్ని అది కేవలం డబ్ల్యుటిఓ నిబంధనల పరిధిని మించి విస్తరిస్తోంది. సైనిక రంగంలో కూడా దానికి ఆధునిక టెక్నాలజీ అందకుండా చేయడం, వ్యూహాత్మకంగా చైనాను నిలువరించడం అనే లక్ష్యంతో ట్రంప్ పావులు కదుపుతున్నారు. రష్యాకు చెందిన రోసోబోరోన్ ఎక్స్‌పోర్ట్ సంస్థ నుండి ఆయుధాలు, విడిభాగాల దిగుమతుల ఒప్పందం కుదుర్చుకున్నందుకుగాను చైనా పరికరాల అభివృద్ధి సంస్థమీదా, దాని అధిపతి అయిన లి షాంగ్ఫుపైనా ట్రంప్ ప్రభుత్వం సెప్టెంబర్ నెలలో ఆంక్షలు విధించింది. అమెరికా ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకున్నదన్న నెపంతో దానిపై ఆంక్షల పేరుతో మరో దేశం (చైనా)పై ఆంక్షలు విధించడం ఇదే ప్రథమం. చైనా పరికరాల విభాగం రక్షణ రంగ టెక్నాలజీ కోసం అవసరమైన పరికరాలను విదేశాల నుండి దిగుమతి చేసుకుంటుంది.

**❝ చైనాపై అమెరికా వాణిజ్య యుద్ధాన్ని గురిపెట్టడానికి మరో కారణం హైటెక్ రంగంలో అది రూపొందించుకున్న 2025 పారిశ్రామిక ప్రణాళిక. ఈ రంగంలో చైనా తన ఆధిపత్యానికి సవాలు విసురుతోందని అమెరికా భావిస్తోంది. పైగా అమెరికాకు చెందిన అతిపెద్ద టెక్నాలజీ సంస్థలైన గూగుల్, ఫేస్‌బుక్‌లను చైనా తమ దేశంలోకి రానీయడం లేదు. అది తన స్వంత ఇంటర్ నెట్‌ను తయారు చేసుకుంది.❞**




అమెరికా ఆంక్షల వల్ల చైనా ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో పడిందని దాన్ని మరింత ఒత్తిడికి గురిచేస్తే దిగొస్తుందని అమెరికా ప్రభుత్వం భావిస్తున్నది. "చైనాతో తక్షణం ఒప్పందానికి రావలని మామీద ఒత్తిడి ఏమీ లేదు. వాళ్ల మీదనే ఆ ఒత్తిడి ఉంది" అని సెప్టెంబర్ మొదటి వారంలో డొనాల్డ్ ట్రంప్ ఒక ట్విట్టర్ మెసేజ్‌లో పేర్కొన్నాడు. "మా మార్కెట్లు పుంజుకున్నాయి, వారి మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. రానున్న కాలంలో మేం అదనపు సుంకాల ద్వారా కోట్ల డాలర్లు పొందబోతున్నాం, పైగా మా దేశంలోనే ఉత్పత్తులు చేస్తాం"అని ఆయన అన్నారు.

అమెరికా వాణిజ్య యుద్ధ చర్యల వల్ల చైనా ఆర్థిక వ్యవస్థ ఇబ్బందుల నెదుర్కొంటున్న మాట వాస్తవమే. ఈ ఏడాది ప్రారంభం నుండి చైనా స్టాక్ మార్కెట్లు పడిపోయాయి. దాని కరెన్సీ యువాన్ బలహీనపడింది. దేశంలో గృహ నిర్మాణం, పరిశ్రమలు, రైల్వేలు, ఇతర స్థిరాస్తి వ్యాపారాల్లో పెట్టుబడులు తగ్గిపోయినట్లు చైనా అధికారికంగా విడుదల చేసిన గణాంకాలు తెలుపుతున్నాయి.


అయితే అంతమాత్రానా చైనా అమెరికా డిమాండ్లన్నింటికీ తలగ్గే అవకాశం లేదని అంతర్జాతీయ నిపుణులతోబాటు చైనా ఆర్థిక వేత్తలు కూడా చెబుతున్నారు. ముఖ్యంగా ద్వైపాక్షిక వాణిజ్యంలో సమతుల్యతను పెంపొందించడం కోసం అనేక అమెరికా వస్తువులపై సుంకాలు తగ్గించడానికి చైనా అంగీకరించింది. రెండు దేశాల మధ్య వాణిజ్య లోటును చాలా వరకు పూడ్చడానికి కూడా రెండు దేశాల మధ్య జరిగిన చర్చల్లో చైనా ప్రభుత్వం అంగీకరించింది. కానీ మొత్తంగా చైనా ఆర్థికాభివృద్ధినే పణంగా పెట్టి దాని '2025 ఆధునిక టెక్నాలజీ అభివృద్ధి ప్రణాళిక'ను విడనాడడానికి మాత్రం అది సిద్ధంగా లేదని చైనా స్పష్టం చేసింది. ఇతర దేశాల నిపుణులు కూడా ఈ విషయంలో అమెరికా చేస్తున్న డిమాండు గొంతెమ్మ కోర్కె అనీ, దుర్బుద్ధితో కూడినదనీ అంటున్నారు. "మా ఆర్థిక వ్యవస్థలో కొన్ని ప్రతికూలాంశాలు కనిపించగానే చాలా చంకలెగరేస్తారు. కానీ వాళ్లు మా ఆర్థిక వ్యవస్థ మొత్తం ముఖచిత్రం చూడరు" అని చైనాకు చెందిన యింగ్డా సెక్యూరిటీస్ ప్రధాన ఆర్థిక నిపుణుడు లి డాసియావో అన్నారు. "చైనా ప్రపంచంలోనే అతి శీఘ్రంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని, మాకు 3 లక్షల కోట్ల డాలర్ల విదేశీ నిల్లలున్నాయనీ, మాకు అతి పెద్ద అంతర్గత మార్కెట్ ఉందనీ మర్చిపోతున్నారు" అని ఆయన పేర్కొన్నారు. అమెరికాకు చెందిన ఫైనాన్సియల్ టైమ్స్ పత్రిక ఒక వ్యాసంలో..ట్రంప్ భావిస్తున్నట్లు అమెరికా వాణిజ్య ఒత్తిళ్లకు చైనా లొంగిపోయే అవకాశం లేదు అని రాసింది. "చైనాపై అమెరికా వాణిజ్య ఆంక్షల ప్రభావం తక్కువే. చైనా మొత్తం అన్ని దేశాలకు చేస్తున్న ఎగుమతులు దేశ జిడిపిలో

(మిగతా 20వ పేజీలో)

శ్రమ దోపిడి

# వేతనాలు - కార్మికులు

**పి. అజయకుమార్**



రచయిత
సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు

**మా**ర్క్స్ రచించిన పెట్టుబడి గ్రంథంలో అదనపు విలువ సిద్ధాంతం కీలకమైనది. నెలకు రూ.18 వేలు కనీస వేతనం నిర్ణయించాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. కార్మికుడు తన 8 గంటల శ్రమతో ఖర్చయిన శక్తిని తిరిగి కూడ దీసుకొని మరో రోజు వచ్చి పని చేసే దానికి కార్మికుడు, కార్మికుని కుటుంబానికి కావలసిన కనీస అవసరాలను తీర్చేందుకు ఇచ్చేదే కనీస వేతనం అని మార్క్స్ నిర్వచనం చెప్పారు.

కార్మికుడు చేసిన 8 గంటల శ్రమకు వేతనం ఇచ్చినట్లు కనపడుతుంది. శ్రమ ఫలితాన్ని కార్మికునికి పూర్తిగా ఇచ్చేస్తే పెట్టుబడిదారునికి లాభం ఉండదు. కార్మికుడు తన 8 గంటల శ్రమలో ముడి సరుకులను ఉపయోగించి మరో సరుకును తయారు చేస్తే ముడి సరుకులలో నిక్షిప్తమైన శ్రమ కాలానికి అదనంగా మరికొంత శ్రమ కాలం దానిలో కలుస్తుంది. అందుకని కొత్త సరుకు విలువ (మారకపు విలువ) పెరుగుతుంది. సరుకుల తయారీ ప్రక్రియలోనే పాత విలువలకు అదనంగా కొత్త విలువ చేరుతుంది. దీనినే చేరిన విలువ (ఏడెడ్‌వేల్యూ)గా పారిశ్రామిక సాంవత్సరిక సర్వే ఫలితాలలో వాడతారు.

పెట్టుబడిదారుడు కార్మికుని శ్రమశక్తిని తన పెట్టుబడితో మారకం చేసుకుని ముందుగా కొంటాడు. శ్రమశక్తిని కలిగిన సజీవ కార్మికుడు పెట్టుబడిదారునికి స్వాధీనమై 8 గంటల శ్రమ చేస్తాడు. శ్రమశక్తి ఖరీదును 4 గంటల శ్రమలోనే పెట్టుబడిదారుడు తిరిగి రాబట్టుకుంటాడు. మొదటి భాగం శ్రమ శక్తికి ఇచ్చినది కనీస వేతనమయితే రెండో భాగంలోని 4 గంటల శ్రమ విలువ పెట్టుబడిదారుని సరాసరి లాభం. ముడి సరుకులు, యంత్రాలు, భవనాల అరుగుదల, సహాయక పదార్థాలు తమ విలువను మాత్రమే కొత్త సరుకులో చేరుస్తాయి. శ్రమశక్తి మాత్రం తన విలువనేగాకుండా అదనపు విలువ (లాభం)ను కూడా కొత్త సరుకులో చేరుస్తుంది. పెట్టుబడిదారుడు కార్మికుని శ్రమదోపిడీని తీవ్రం చేసే కొద్దీ వేతనాలు–లాభాల మధ్య నిష్పత్తులు మారతాయి. అందుకనే వేతనాన్ని అస్థిర పెట్టుబడిగా, ముడిసరుకులు తదితర పాత విలువలను స్థిర పెట్టుబడిగా మార్క్స్ పేర్కొన్నారు.

వేతన రంగంలో ఇప్పుడు జరుగుతున్న పరిణామాలను మార్క్స్ 150 సంవత్సరాల క్రితమే తన పెట్టుబడి గ్రంథంలో రాశారు. కనీస వేతనాలు కూడా రాని కోట్లాది మంది కార్మికులు ఉంటారు. అదే సమయంలో కనీస వేతనాల కంటే ఎక్కువ వచ్చే వారి సంఖ్య వీరి కంటే తక్కువ అయినప్పటికీ వారికి వచ్చే వేతనాలు అనేక రెట్లు ఎక్కువ ఉంటాయి. తిరుపతి నగర శివారులో ఉండే ఒక పరిశ్రమ యం.డి (ఓనరు) 2016–17 ఆర్థిక సంవత్సరానికి తీసుకున్న వేతనం రూ.38 కోట్ల 6 లక్షలు. ఆ పరిశ్రమలోని మధ్య స్థాయి ఉద్యోగి వేతనం కంటే యం.డి వేతనం 2082 రెట్లు ఎక్కువ.

ఇటువంటి వారితో పాటు పరిశ్రమల్లో, ప్రభుత్వశాఖలలో ఉండే ఉన్నత స్థాయి అధికారులు ఉంటారు. యూనియన్లు పెట్టుకుని దశాబ్దాల తరబడి పోరాడుతూ తమ వేతనాలను పెంచుకున్న మధ్యతరగతి ఉద్యోగులు ఉంటారు. ఐటి రంగంలో, సర్వీసు రంగంలో అధిక వేతనాలు పొందుతున్న ఉద్యోగులు ఉన్నారు. కనీస వేతనం కూడా రాని కోట్లాది మంది కార్మికుల వేతనాలను, కనీస వేతనం కంటె ఎక్కువ వచ్చే వారి వేతనాలను సరాసరి చేస్తే కనీస వేతనం వస్తుంది. శ్రమశక్తి తన విలువకే అమ్ముడుపోతుందని మార్క్స్ నిర్ధారించారు. మార్క్స్ తన అధ్యాయనంలో ప్రతి అంశానికి సామాజిక సగటును లెక్కలోకి తీసుకున్నారు.

మార్క్స్ వేతనాలను మూడు రకాలుగా పేర్కొన్నారు. (1) డబ్బు వేతనాలు (2) అసలు వేతనాలు – డబ్బు వేతనాలతో కొనగలిగే సరుకులు, సేవల పరిమాణం. వేతనాలు పెరిగాయి లేదా తగ్గాయి అని చెప్పేటప్పుడు డబ్బు వేతనాలను మాత్రమే దృష్టిలో ఉంచుకోకూడదు అని చెప్పారు మార్క్స్. (3) సాపేక్ష వేతనాలు – కార్మికుడు కొత్తగా చేర్చిన విలువలో లాభం వాటాతో పోల్చినప్పుడు వేతనం వాటాను సాపేక్ష వేతనం తెలియజేస్తుంది. శ్రమ దోపిడీ తీవ్రమయినప్పుడు పెట్టుబడిదారుని లాభంతో పోలిస్తే కార్మికుల వేతనాలు పడిపోతాయి. ఉత్పాదకత పెంచటం, పని గంటల పొడిగింపు, నైపుణ్య కార్మికుల స్థానంలో తక్కువ వేతనాలతో మహిళలు, పిల్లల నియామకం తదితర పద్ధతుల ద్వారా పెట్టుబడిదారులు శ్రమ దోపిడీని తీవ్రతరం చేస్తారు.

ఒప్పందాల ద్వారా లేదా ప్రభుత్వాల స్పందనల ద్వారా వేతనాలు పెరిగినప్పుడు కార్మికులు, ఉద్యోగులు సంబరాలు చేసుకుంటారు. ఈ సంతోషం 4, 5 సంవత్సరాలు తిరిగీ, తిరగక ముందే ఆవిరవుతుంది. ధరల పెరుగుదల వలన డిఏ వచ్చే వారికి తక్కువ వేగంతో, డిఏ లేని కార్మికులకు అతి వేగంగా అసలు వేతనాలు పడిపోతాయి. మరలా ఆందోళనలు, పోరాటాలు మామూలే. జీవితమంతా ఇదే సరిపోతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో వేతనం కోసం తమ శ్రమశక్తిని అమ్ముకోవాల్సిన దుస్థితి కార్మికులకు ఉంటుంది. దీన్నే వేతన బానిసత్వంగా మార్క్స్ పేర్కొన్నారు. ఒకవేళ వేతనాలు పెంచుకోగలిగినా కార్మికులకు ఇనుప సంకెళ్ళు బదులు బంగారు సంకెళ్ళు వస్తాయి తప్ప సంకెళ్ళు పోవు. దోపిడీ వ్యవస్థ అంతమయినప్పుడే కార్మికులకు విముక్తి వస్తుందన్నారు మార్క్స్.

మార్క్స్ అధ్యయనంలో మరో ముఖ్యమైన అంశం మార్కెట్లు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రతి అంశాన్ని మార్కెట్ నియంత్రిస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి అయ్యే కొద్దీ ప్రభుత్వ నియంత్రణలో ఏమైనా ఉంటే దాన్ని కూడా మార్కెట్‌కు వదిలేస్తారు. మన దేశంలో ఈ పరిణామాలను చూస్తున్నాం. పెట్టుబడిదారీ వ్యవస్థలో

ప్రణాళికాబద్ధత ఉండదు. డిమాండ్‌ను బట్టి సరఫరాను నియంత్రిచటం ఉండదు. కాబట్టి మార్కెట్లు నిరంతరం ఒడిదుడుకులకు గురవుతాయి. ఈ ఒడిదుడుకులు, హెచ్చుతగ్గుల సరాసరి వద్ద సరుకు తన విలువకే అమ్ముడు పోతుందన్నారు మార్క్స్.

సరుకు కార్మికుని శ్రమ ఉత్పాదితం. అందులో వాడిన ముడిపదార్థాలు కూడా అంతకు ముందటి శ్రమ (మృతశ్రమ) ఉత్పాదితాలే. ముడి పదార్థాలతో తయారైన సరుకులో కొత్తగా చేరిన విలువలో వేతనం, లాభాల వాటా ఉంటుంది. సరుకు విలువకు మించి అమ్మినందు వలన పెట్టుబడిదారునికి లాభం రాదు. సరుకు ఉత్పత్తి క్రమంలోనే పెట్టుబడిదారుని లాభం ఉంటుంది. ఈ లాభం కార్మికుని శ్రమ ఫలితం. పెట్టుబడిదారుడు దాన్ని కొల్లగొడుతున్నాడు.

సరుకు విలువను రాబట్టాలంటే అది మార్కెట్‌కు వెళ్ళాలి. మార్కెట్‌లో సరుకు ధరను డిమాండ్, సరఫరాలు నిర్ణయిస్తాయి. డిమాండ్ తక్కువగా ఉండి సరఫరా ఎక్కువ ఉంటే ధర పడిపోతుంది. డిమాండ్ ఎక్కువగా ఉండి సరఫరా తక్కువగా ఉంటే ధర పెరుగుతుంది. దానికి తగ్గట్టుగా పెట్టుబడిదారుని లాభం కూడా పెరుగుతుంది. సరుకు ధరను డిమాండ్, సరఫరాలు నిర్ణయించేట్లయితే డిమాండ్, సరఫరాలను ఏది నిర్ణయిస్తుందని మార్క్స్ ప్రశ్న వేసి వాటిని పెట్టుబడుల ప్రవాహం నిర్ణయిస్తుందని సమాధానం చెప్పారు. లాభాలు ఎక్కువగా వచ్చే రంగంలోకి పెట్టుబడులు ఎక్కువగా ప్రవహిస్తాయని, అవి ఎంత వరకూ ప్రవహిస్తాయంటే వరుసగా అత్యధిక లాభాల నుండి సామాన్య లాభాలకు, ఉత్పత్తి ఖర్చులకు, నష్టాలకు దారి తీసే వరకూ ప్రవహించి వెనక్కు మళ్ళుతాయని చెప్పారు.

డిమాండ్ – సరఫరాల మధ్య తారతమ్యాన్ని లెక్కించేందుకు అక్కడ మీటర్లు ఏమీ ఉండవు. ఇదొక అరాచకపు వ్యవస్థ. ఒకసారి స్థాపించిన పరిశ్రమను అవసరమైనప్పుడు వెంటనే తొలగించలేరు. తీరా నష్టాలు వచ్చిన తర్వాత వాటిని పెద్ద పెద్ద భారీ పరిశ్రమలు మాత్రమే తట్టుకుంటాయి. ఈ క్రమంలో చిన్నవన్నీ మూతపడతాయి. ఆర్థిక సంక్షోభాలకు ఇదొక కారణం. మార్కెట్‌లో సరుకులు ఎక్కువగా అమ్మి లాభాలు సంపాదించేందుకు పెట్టుబడిదార్ల మధ్య పోటీ ఉంటుంది. తాము మాత్రమే మార్కెట్‌లో ఉండి మిగతా వారిని తప్పించటానికి సరుకులను చౌకగా అమ్మగలగటానికి పెట్టుబడిదార్లు ఆధునిక యంత్రాలను ప్రవేశపెడతారని, కార్మికుల ఉత్పాదక శక్తిని పెంచటం

**"సరుకు కార్మికుని శ్రమ ఉత్పాదితం. అందులో వాడిన ముడిపదార్థాలు కూడా అంత కు ముందటి శ్రమ (మృతశ్రమ) ఉత్పాదితాలే. ముడి పదార్థాలతో తయారైన సరుకులో కొత్తగా చేరిన విలువలో వేతనం, లాభాల వాటా ఉంటుంది. సరుకు విలువకు మించి అమ్మినందు వలన పెట్టుబడిదారునికి లాభం రాదు. సరుకు ఉత్పత్తి క్రమంలోనే పెట్టుబడిదారుని లాభం ఉంటుంది. ఈ లాభం కార్మికుని శ్రమ ఫలితం. పెట్టుబడిదారుడు దాన్ని కొల్లగొడుతున్నాడు."**



వేతనాల పెంపుకోసం పోరాడుతున్న ఆశా కార్మికులు

ద్వారా చౌక ధరలకు అమ్మగలుగుతారని మార్క్స్ చెప్పారు. మిగతా పెట్టుబడిదార్లు కూడా మార్కెట్లో నిలబడటానికి ఆధునిక యంత్రాలు ప్రవేశ పెడతారని ఈ పోటీ నిరంతరం కొనసాగుతుందన్నారు. ఈ పోటీలో చిన్న పెట్టుబడి దారులు పాల్గొనలేక కార్మికవర్గంలో చేరిపోతారు.

ఆధునిక యంత్రాల ప్రవేశం వలన తక్కువ సమయంలో ఎక్కువ సరుకులు ఉత్పత్తి అవుతాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి అయ్యే కొద్దీ పెట్టుబడి వృద్ధి కూడా ఎక్కువగా ఉంటుంది. పెట్టుబడి పెరిగే కొద్దీ కార్మికుల సంఖ్య కూడా పెరుగుతుంది. కానీ పెట్టుబడి పెరిగినంత స్థాయిలో కార్మికుల సంఖ్య పెరగదు. మొత్తం పెట్టుబడిలో అస్థిర పెట్టుబడి (వేతనాలు) వాటా తగ్గి స్థిర పెట్టుబడి వాటా (భూమి, యంత్రాలు, భవనాలు, ముడిసరుకులు) పెరుగుతుంది. ఆధునిక యంత్రాల ప్రవేశం, సంక్షోభాల వలన నిరుద్యోగం పెరుగుతుంది. నిరుద్యోగ సైన్యం పెరిగే కొద్దీ కార్మికుల బేరసారాల శక్తి కూడా తగ్గిపోతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం శ్రమ యొక్క విలువను దాని కనీస స్థాయికి తగ్గిస్తుంది. నూటికి 99 సందర్భాల్లో కార్మికులు జీతాల పెంపుకై చేసే పోరాటాలు అంతకు ముందు ఉన్న శ్రమ విలువను నిలబెట్టుకోటానికి చేసే పోరాటాలే అవుతాయని మార్క్స్ నిర్ధారించారు.

కార్మికులు చేసే పోరాటాలు పెట్టుబడిదారీ వ్యవస్థ వలన వచ్చే దుష్పరిణామాలకు వ్యతిరేకంగా మాత్రమేనని, వాటికి గల కారణాలకు వ్యతిరేకంగా కాదన్నారు మార్క్స్. పరిస్థితులు దిగజారకుండా ఆపగలుగుతున్నారు తప్ప అసలు మార్గాన్ని మార్చటం లేదని కార్మికులు గుర్తించాలని మార్క్స్ కోరారు. వ్యాధి తీవ్రతను తగ్గిస్తున్నారేగాని వ్యాధిని నిర్మూలించటం లేదు. నేటి ఆర్థికవ్యవస్థ కార్మికుల్ని ఎన్నో బాధలకు లోను చేస్తున్నది. ఆర్థికంగా, సామాజికంగా దాన్ని మార్చే అవకాశాన్ని కూడా ఏక కాలంలో సృష్టిస్తుందనే విషయాన్ని కార్మికులు గుర్తుంచుకోవాలన్నారు మార్క్స్.

"సాధారణంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం జీతాల సగటు స్థాయిని తగ్గిస్తుందేగాని పెంచదు. పెట్టుబడిదార్ల దాడులను ప్రతిఘటించే కేంద్రాలుగా కార్మికసంఘాలు మారతాయి. అవి తమ శక్తిని చాకచక్యంగా ఉపయోగించకపోతే కొంతవరకు పరాజయం పొందుతాయి. నేటి ఆర్థికవ్యవస్థ యొక్క దుష్ఫలితాలకు వ్యతిరేకంగా పోరాడటంతోనే సంతృప్తి చెంది, మొత్తం వ్యవస్థను మార్చేందుకు కూడా పోరాడకపోతే, తమ అంతిమ విముక్తిని సాధించేందుకు జీతాల వ్యవస్థను కూలదోసేందుకై తమ సంఘటిత శక్తిని ఉపయోగించకపోతే ట్రేడ్ యూనియన్లు సాధారణంగా పరాజయం పొందుతాయి." ❊

ఆర్థికరంగం

# ముంచుకొస్తున్న సంక్షోభం

**ఎ. కోటిరెడ్డి**



రచయిత
ప్రజాశక్తి సహాయ సంపాదకులు

భారతదేశం ప్రపంచంలోని అన్ని దేశాల కన్నా అధిక ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నదని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నది. అభివృద్ధిలో అగ్రస్థానానికి చేరామని ప్రభుత్వం చేస్తున్న ప్రచారం ప్రజలను మభ్యపెట్టటానికి ఉద్దేశించినది మాత్రమే. 2018-19 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికలో జిడిపి పెరుగుదల 7.5 శాతానికి చేరిందని, అభివృద్ధిలో చైనాను మించిపోయామని, 2020 తర్వాత రెండంకెల వృద్ధిరేటు సాధిస్తామని, 2025 నాటికి 5 ట్రిలియన్ డాలర్లకు మన ఆర్థిక వ్యవస్థ పెరుగుతుందని బిజెపి నేతలు, సరళీకరణ విధానాలను తలకెత్తుకొన్న కొందరు ఆర్థికవేత్తలు డంభాలు పోతున్నారు. స్టాక్‌మార్కెట్ సూచి, బడా పెట్టుబడిదారుల ఆస్తుల పెరుగుదల, ఆర్థికాభివృద్ధిని పర్యవేక్షించే వివిధ సంస్థల నాయకత్వ స్థానాలలో తన తొత్తులను కూర్చోబెట్టి, వారు ఇస్తున్న తప్పుడు లెక్కలను ఆధారం చేసుకోవటం, సరళీకరణ విధానాల అమలును ప్రపంచస్థాయిలో పర్యవేక్షిస్తున్న రేటింగ్ ఏజన్సీలు చేస్తున్న ప్రకటనలు తదితరాలను ప్రభుత్వం తన ప్రచారం కోసం వినియోగించుకొంటున్నది. ఈ అభివృద్ధి ప్రచారం మాటున ప్రభుత్వం నయా ఉదారవాద ఆర్థిక విధానాలను మరింత వేగంగా అమలు చేస్తున్నది. ఆర్థికవ్యవస్థ స్థితిని గురించి ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి, వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల అధ్యయనంలో వెల్లడౌతున్న అంశాలకు సంబంధం ఉండటం లేదు. ఉదాహరణకు పెద్దనోట్ల రద్దు వలన నల్లధనాన్ని అరికట్టామని, ఆర్థికాభివృద్ధి వేగవంతం అయిందని ప్రభుత్వం ప్రచారం చేస్తుండగా, ఈ చర్య ఫలితంగా లక్షలాది చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడ్డాయని అనేక అధ్యయనాలలో వెల్లడైంది. 1.27 కోట్లమంది ఉద్యోగాలు కోల్పోయారని దేశ ఆర్థికవ్యవస్థను పర్యవేక్షిస్తున్న ప్రభుత్వసంస్థ సిఎంఐఈ వెల్లడించింది. ఇదే విధమైన విశ్లేషణలను గతంలో అనేక సంస్థలు వెల్లడించాయి. సరళీకరణ విధానాలను అమలు జరిపిన దేశాలలో ఆర్థికాభివృద్ధిని గురించి ప్రభుత్వాలు గొప్పగా ప్రచారం చేసుకోగా ఫలితాలు మాత్రం భిన్నంగా వచ్చిన ఉదాహరణలు అనేకం ఉన్నాయి. ప్రస్తుతం మనదేశంలోని పాలకవర్గాలు కూడా కూడా ఇదే విధమైన ప్రచారం చేస్తున్నాయి.సరళీకరణ విధానాలు దేశ ఆర్థికవ్యవస్థను, ప్రజల స్థితిగతులను దిగజారుస్తుండగా, ప్రపంచంలో మనదే అగ్రస్థాయి అభివృద్ధి అని ప్రభుత్వం ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నది.

2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం సరళీకరణ విధానాల అమలును వేగవంతం చేసింది. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి, పెట్రో ధరల పెంపుదల, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, బ్యాంకులను ప్రైవేటు వారికి అప్పగించటం తదితరాలు సరళీకరణను విధానాలను వేగంగా అమలు చేయటంలో భాగం మినహా ప్రజా సంక్షేమం, దేశాభివృద్ధికి తీసుకున్న చర్యలు కావు. ఈ విధానాల వలన దేశ పారిశ్రామికరంగం దెబ్బతిన్నది. లక్షల సంఖ్యలో చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు మూతపడ్డాయి. లక్షలాది పరిశ్రమలు ఖాయిలా పడ్డాయి. వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు మరింత తీవ్రమైనాయి. రైతాంగం అప్పుల పాలవటం, ఆత్మహత్యలు చేసుకోవటం పెరిగింది. చేతివృత్తులు దివాళా తీయటంతో వృత్తిదారులు ఉపాధిని కోల్పోతున్నారు. నిరుద్యోగం, సంపద కేంద్రీకరణ పెరగటంతో ఆర్థిక అసమానతలు తీవ్రం అవుతున్నాయి. ఒక్క శాతంగా ఉన్న కోటీశ్వరుల చేతుల్లోకి 73 శాతం సంపద చేరింది. దరిద్రం పెరుగుతున్నది. రూపాయి పతనం నిరంతరంగా కొనసాగుతూ సెప్టెంబరు 15 నాటికి డాలరుకు 72 రూపాయలను దాటిపోయింది. పోషకాహారలోపంతో శారీరక, మానసిక ఎదుగుదల స్థంభించిన పిల్లలు 50 శాతంపైగా ఉన్నారు. 50 శాతంకు పైగా మహిళలు రక్తహీనతతో అనారోగ్యం బారిన పడుతున్నారని వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థల విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. అభివృద్ధి ప్రచారంలోని డొల్లతనాన్ని ఈ అంశాలు వెల్లడిస్తున్నాయి.

దిగజారిపోతున్న సామాజిక ప్రమాణాలు, విలువలు దిగువ తరగతి ప్రజలు, మహిళల దుస్థితిని కళ్ళకు కడుతున్నాయి. మహిళలపై అత్యాచారాలు పెరిగాయి. ముక్కుపచ్చలారని బాల బాలికలపై అత్యాచారాలకు పాల్పడటం, హత్యలు చేయటం పెరుగుతున్నది. బలహీన వర్గాలపై దాడులు, దౌర్జన్యాలు, కుల, మత విభేదాలు పెరిగాయి. వీటన్నింటి ఫలితంగా దేశం మున్నెన్నడూ ఎరుగని ఆర్థిక, సామాజిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది.

సరళీకరణ విధానాలను అమలు చేస్తున్న ప్రభుత్వాలు చేస్తున్న ప్రచారానికి, ఆ విధానాల ఫలితాలకు ఏమాత్రం సంబంధం ఉండదని ప్రపంచదేశాల అనుభవం స్పష్టం చేస్తున్నది. సరళీకరణ విధానాలను అమలు చేసిన అనేక దేశాల ప్రభుత్వాలు తమ దేశాలలో అద్భుతమైన అభివృద్ధిని సాధిస్తున్నామని ప్రచారం చేస్తుండగానే ఆ దేశాలు సంక్షోభంలో చిక్కుకోవటం కళ్ళ ముందు కనిపిస్తున్న వాస్తవం. మెక్సికో, అర్జెంటైనా, చిలీ, థాయ్‌లాండ్, ఇండోనేషియా, దక్షిణ కొరియా, గ్రీస్, పోర్చుగల్ తదితర దేశాలు గతంలో ఎదుర్కొన్న, ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంక్షోభం ఇదే విషయాన్ని సష్టం చేస్తున్నాయి. సరళీకరణ విధానాల అమలు వలన ఆ దేశాలలో సాధించామని చెప్పుకుంటున్న అభివృద్ధిని కొద్దిమందిగా ఉన్న దేశ, విదేశీ పెట్టుబడిదారులు, సమాజంలోని ఉన్నత వర్గాలు స్వంతం చేసుకోగా, కోట్లాదిగా ఉన్న సామాన్య ప్రజలు సంక్షోభ భారాల్ని భరించాల్సి వచ్చింది. మన

దేశం కూడా అదే పరిస్థితిలో ఉన్నదని ఆర్థిక వ్యవస్థ స్థితిగతులను పరిశీలిస్తే అర్థం అవుతుంది. సరళీకరణ విధానాలను అమలు చేసిన అన్ని దేశాల అనుభవాల సారాంశం ఇదే. గతంలో సరళీకరణ విధానాలను అమలుచేసి, సంక్షోభంలో చిక్కుకున్న దేశాలను పరిశీలిస్తే మనదేశం ఎటువంటి పరిస్థితులను ఎదుర్కోనున్నదన్న విషయం మనకు అవగతం అవుతుంది.

> “బెయిలవుట్ ప్యాకేజి షరతులకు అనుగుణంగా 95లో జెడిల్లో పొదుపు పథకాలను ప్రకటించి, ప్రజలపై పన్నుల భారాన్ని పెంచాడు. సంక్షేమ పథకాలకు కోత పెట్టాడు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించటం కోసం వడ్డీరేట్లను 80 శాతం పెంచాడు. ఫలితంగా పారిశ్రామిక ఉత్పత్తి, పరిశ్రమల నిర్మాణం కోసం రుణాలు తీసుకోవటం భారంగా మారింది.”

### మెక్సికో

సరళీకరణ విధానాల అమలుతో అత్యధిక అభివృద్ధిని సాధించినట్లు ప్రచారం జరిగిన మెక్సికో 1994వ సంవత్సరంలో సంక్షోభాన్ని ఎదుర్కొన్నది. 80వ దశాబ్దంలో అమెరికాలో ఆర్థికమాంద్యం ఏర్పడటంతో అక్కడ వడ్డీరేట్లు కనిష్ఠస్థాయికి దిగజారాయి. పెట్టుబడులకు అవకాశాలు తగ్గాయి. లాభాల సంపాదన కోసం వెంపర్లాడుతున్న అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడులు లాభాలచ్చే దేశాల కోసం అన్వేషణ ప్రారంభించాయి. అటువంటి సమయంలో మెక్సికో సరళీకరణ విధానాల అమలును వేగవంతం చేయటంతో ఆ దేశంలోకి విదేశీ పెట్టుబడులు ఎక్కువ మొత్తంలో వచ్చాయి. 1990–94 మధ్య 71.2 బిలియన్ డాలర్ల విదేశీ సంస్థాగత పెట్టుబడులు(ఎఫ్ఐఐ) ఆ దేశంలోకి వచ్చాయి. ఈ నిధులు స్వల్పకాలిక లాభాల కోసం రావటంతో వాటితో పారిశ్రామికీకరణ, ఆర్థికాభివృద్ధి సాధ్యం కాలేదు. దేశం నుండి ఎగుమతులు పెరిగాయి. కాని దిగుమతులు అంతకు మించి పెరగటంతో వాణిజ్యలోటు 30 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఆనాటి మెక్సికో జిడిపిలో ఇది 8 శాతం దేశంలోకి వచ్చిన నిధులలో 72 శాతాన్ని విదేశీ వాణిజ్య లోటు తీర్చటం, దేశీయ వినియోగాన్ని పెంచటం కోసం వినియోగించారు. ఆర్థిక పరిస్థితులు సానుకూలంగా ఉన్న దశలో గృహస్తులకు వినియోగరుణాల్ని ఎక్కువగా ఇవ్వటం ద్వారా వస్తు వినిమయాన్ని పెంచారు. ఈ చర్యతో బ్యాంకులు, వినియోగదారుల రుణభారం పెరిగింది.

మెక్సికో ఈ విధానాలను అమలుచేస్తున్న సమయంలోనే అమెరికాలో తిరిగి వడ్డీరేట్లు పెరగటం ప్రారంభమైంది. దీనితో స్వల్పకాలిక లాభాలు ఆశించి దేశంలోకి వచ్చిన సంస్థాగత పెట్టుబడులు అమెరికాకు తరలటం ప్రారంభించాయి. ఇదే సమయంలో దేశంలో ఆర్థిక సంక్షోభం ప్రారంభం కావటం, ప్రజలలో అసంతృప్తి పెరగటంతో రాజకీయ పరిణామాలు వేగం పుంజుకున్నాయి. చియాపాస్ ప్రాంతంలో జపాటిస్టాల తిరుగుబాటు ప్రారంభమైంది. అనంతరం జరిగిన ఎన్నికలలో జెడిల్లో అధ్యక్షునిగా ఎన్నికయాడు. ఆయన పెసో విలువను తగ్గించటం ప్రారంభించాడు. 1994 డిసెంబరు 20న పెసో విలువ 13 శాతం పడిపోయింది. అంతకు రెండురోజుల ముందే పెసో విలువ తగ్గింపు విషయాన్ని అధ్యక్షుడు జెడిల్లో తనకు సన్నిహితంగా ఉండే కొందరు పెట్టుబడిదారులకు తెలియజేయటంతో వారు తమవద్ద ఉన్న పెసోలను డాలర్లలోకి మార్చుకున్నారు. తీవ్రమౌతున్న ఆర్థిక సంక్షోభం, పెసో విలువ తగ్గింపుతో భయపడిన అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకోవటం ప్రారంభించారు. దానితో పెసో విలువ మరింత పడిపోయి డిసెంబరులో డాలరుకు 3.5 పెసోల నుండి 1995 మార్చి నాటికి 7.5 పెసోలకు క్షీణించింది. తర్వాత కొద్దికాలంలోనే స్టాక్ మార్కెట్ సూచీలు సగం విలువను కోల్పోయాయి. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని నిలబెట్టటానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఫలితాలనివ్వలేదు.



మెక్సికో సంక్షోభ సమయంలో స్థానిక ప్రజల ఆందోళన

ఆర్థిక సంక్షోభం నుండి బయటపడటానికి సహకరించాలని మెక్సికో అమెరికాను అభ్యర్థించింది. అమెరికాతో పాటు అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు ఐఎంఎఫ్, ప్రపంచ వాణిజ్యసంస్థ, జి–7 దేశాలు మెక్సికో బెయిలవుట్‌లో భాగస్వాములయ్యాయి. 50 బిలియన్ డాలర్ల బెయిలవుట్ ప్యాకేజీని రూపొందించారు. సంక్షోభానికి ఎవరైతే కారణమో ఆ ద్రవ్య పెట్టుబడిదారుల చేతుల్లోకే ఈ నిధుల్లో ఎక్కువ భాగం వెళ్ళాయి. ఈ సంక్షోభం, బెయిలవుట్లతో మెక్సికో ఆర్థికవ్యవస్థ మరింత సంక్షోభంలోకి జారిపోయింది. ప్రజల పరిస్థితులు దిగజారాయి. బెయిలవుట్ ప్యాకేజి షరతులకు అనుగుణంగా 95లో జెడిల్లో పొదుపు పథకాలను ప్రకటించి, ప్రజలపై పన్నుల భారాన్ని పెంచాడు. సంక్షేమ పథకాలకు కోతపెట్టాడు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించటం కోసం వడ్డీరేట్లను 80 శాతం పెంచాడు. ఫలితంగా పారిశ్రామికోత్పత్తి, పరిశ్రమల నిర్మాణం కోసం రుణాలు తీసుకోవటం భారంగా మారింది. దేశీయంగా రుణాలు తీసుకొని ఉత్పత్తిని కొనసాగించటం భారం కావటంతో మెక్సికో పెట్టుబడిదారులు పెట్టుబడులు పెట్టటం తగ్గించారు. ఫలితంగా నిరుద్యోగం పెరగటం, నిజవేతనాలు పడిపోవటం, రుణలభ్యత తగ్గటం, ధరలు, వడ్డీరేట్లు పెరగటంతో ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయాయి. మెక్సికోలో ప్రారంభమైన సంక్షోభం వివిధ దేశాలకు విస్తరించటంతో ఆ దేశాల ఆర్థికవ్యవస్థలు కూడా సంక్షోభంలో చిక్కుకున్నాయి.

> **"భాట్ విలువ తగ్గుతుందని స్పష్టం కావటంతో స్టాక్‌మార్కెట్‌లో అమ్మకాలు వెల్లువెత్తటంతో భాట్ 67 శాతం విలువను కోల్పోయింది. ఉదే సమయంలో జపాన్‌లో బాండ్లపై రాబడి పెరగటంతో అక్కడి నుండి వచ్చే ఎఫ్‌ఐఐలు ఆగిపోయాయి. విదేశీ పెట్టుబడులు పెద్ద మొత్తంలో బయటికి పోవటంతో 1997, జులై 2న భాట్ 20 శాతం విలువ కోల్పోయింది."**




థాయ్‌లో సంక్షోభ సమయంలో ప్రదర్శన

### థాయ్‌లాండ్

మెక్సికో సంక్షోభం తర్వాత రెండు సంవత్సరాలకు థాయ్‌లాండ్ సంక్షోభం ప్రారంభమై వెంటనే తూర్పు ఆసియా, తూర్పు యూరపు దేశాలకు విస్తరించింది. సంక్షోభం ప్రారంభమయ్యే వరకు ఐఎంఎఫ్, ప్రపంచ వాణిజ్య సంస్థలు అభివృద్ధి నమూనా అంటూ థాయ్‌లాండ్ గురించి ప్రచారం చేశాయి. సంక్షోభం ప్రారంభానికి ముందు వరకు మౌలిక ఆర్థిక సూచీలలో అత్యధిక భాగం బలంగానే ఉన్నాయి. థాయ్ లాండ్ అభివృద్ధి ప్రధానంగా ఎగుమతులపై ఆధారపడినది. సరళీకరణ విధానాల ప్రారంభానికి ముందు 4.96 శాతంగా ఉన్న వాణిజ్యలోటు 92లో 6.8 శాతానికి పెరిగింది. దేశంలోకి వస్తున్న విదేశీ పెట్టుబడులను వాణిజ్యలోటు తీర్చటం కోసం వినియోగించారు. 1985-95 మధ్య థాయ్ జిడిపి వృద్ధిరేటు 9.8 శాతంగా ఉంది. రుణాల చెల్లింపుకు 1985లో 31 శాతం ఆదాయాన్ని వినియోగించగా 95 నాటికి 11 శాతానికి తగ్గింది. ఎగుమతి ఆదాయంలో విదేశీ రుణ చెల్లింపులు 171 నుండి 102 శాతంకు తగ్గాయి. ఎగుమతులకు చెల్లించటం కోసం ఐదునెలలకు సరిపడే నిధులను సిద్ధంగా ఉంచారు. తక్కువ రుణభారం ఉన్న దేశంగా థాయ్‌లాండ్‌ను ఐఎంఎఫ్ అభివర్ణించింది. ఆ తర్వాత థాయ్ కరెన్సీపై ప్రారంభమైన స్పెక్యులేటివ్ ఎటాక్ (ఒక దేశ కరెన్సీ విలువను కృత్రిమంగా పడగొట్టటం ద్వారా లాభాలు సంపాదించుకొనే పద్ధతి) రుణాలు చెల్లించలేని దేశాలపైన మాత్రమే స్పెక్యులేటివ్ ఎటాక్ జరుగుతుందనే వాదన సరికాదని రుజువు చేసింది.

ప్రభుత్వం ద్రవ్యలోటును అధిగమించి, జిడిపిలో 2.5 శాతం మిగులును సాధించింది. ఎగుమతులు-జిడిపి రేషియో 90లో 34.1 శాతం నుండి 95లో 41.5 శాతంకు పెరిగింది. ద్రవ్యోల్బణాన్ని అతి తక్కువగా, జిడిపిలో 5 శాతానికి పరిమితం చేశారు. జిడిపి-వడ్డీ చెల్లింపుల నిష్పత్తి అతి తక్కువగా ఉంది. సంక్షోభానికి 18 నెలల ముందు వరకు ఈ మౌలికాంశాలన్నీ బలంగానే ఉన్నాయి. ప్రభుత్వం అమలు జరిపిన సరళీకరణ విధానాలు సమాజంలో కొద్దిసంఖ్యలో అధికాదాయ గ్రూపులను సృష్టించాయి. ఈ అధికాదాయ గ్రూపుల వినియోగం కోసం కార్లు, ఫ్రిజ్‌లు,వివిధ రకాల విలాస వస్తువులను దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. ప్రధానంగా విదేశాల నుండి దిగుమతి అయిన విలాస వస్తువులు, అధిక ధరలతో వినియోగ సరుకులను అమ్మే మాల్స్ సంఖ్య పెరిగింది.

1996లో థాయ్ ఎగుమతులు తగ్గి, దిగుమతులు పెరగటంతో సమస్యలు ప్రారంభం అయ్యాయి. 97లోనూ కోలుకునే సూచనలు కనిపించలేదు. ఈ సమయంలోనే థాయ్‌లో కార్మికుల వేతనాలు మిగతా దేశాల కన్నా అధికంగా పెరిగాయి. ఫలితంగా థాయ్ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పడలేకపోయాయి. 96లో ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతులకు డిమాండ్ తగ్గింది. ఇదే సమయంలో థాయ్ నుండి ఎగుమతి అవుతున్న వ్యవసాయోత్పత్తులపై అమెరికా, యూరోపియన్ యూనియన్‌లు ఆంక్షలు విధించాయి. ఈ కాలంలో థాయ్ కంపెనీలు విదేశీ రుణాలు తీసుకోవటానికి ఉదారంగా అనుమతులు ఇవ్వటంతో 97 నాటికి విదేశీ రుణం 87 బిలియన్ డాలర్లకు పెరిగింది. 92-96 మధ్య విదేశీ రుణ చెల్లింపులు 5 నుండి 49 బిలియన్ డాలర్లకు-9 రెట్లు- పెరిగాయి. దేశంలో అధికవడ్డీ రేట్లు ఉండటంతో విదేశీరుణాల కోసం ఎగబడ్డారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం సన్నగిల్లటంతో థాయ్ కరెన్సీ భాట్‌పై స్పెక్యులేటివ్ ఎటాక్ ప్రారంభమైంది. స్థిరమైన మారకం రేటును అవకాశంగా తీసుకొని విదేశీ, స్వదేశీ మదుపరులు డాలర్లను కొనటం ప్రారంభించారు. భాట్ విలువ తగ్గుతుందని స్పష్టం కావటంతో స్టాక్‌మార్కెట్‌లో అమ్మకాలు వెల్లువెత్తటంతో భాట్ 67 శాతం విలువను కోల్పోయింది. ఉదే సమయంలో జపాన్‌లో బాండ్లపై రాబడి పెరగటంతో అక్కడి నుండి వచ్చే ఎఫ్‌ఐఐలు ఆగిపోయాయి. విదేశీ పెట్టుబడులు పెద్దమొత్తంలో బయటికి పోవటంతో 1997, జులై 2న భాట్ 20 శాతం విలువ కోల్పోయింది. సహాయం కోసం ఐఎంఎఫ్‌ను అర్థించగా కఠినమైన షరతులు విధించింది. ఆ షరతుల అమలులో భాగంగా బడ్జెట్ ఖర్చును 100 కోట్లు తగ్గించటం, వ్యాట్‌ను 7 నుండి 10 శాతంకు పెంచటం, సబ్సిడీలు, సామాజిక సంక్షేమ ఖర్చుపై కోత విధించటం తదితర చర్యలు తీసుకున్నారు. ఈ పరిణామాల ఫలితంగా ఆర్థికవ్యవస్థ తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. 1998లో జిడిపి పెరుగుదల మైనస్ ఒక శాతంగా అంచనా వేశారు. ప్రభుత్వ ఖర్చు 30 శాతం తగ్గించి సామాన్యప్రజలకు అందే అనేక సదుపాయాలపై కోత విధించారు. ఈ రెండు దేశాల అనుభవాల ఆధారంగా మనదేశ

ఆర్థిక పరిస్థితిని పరిశీలిస్తే ప్రభుత్వ ప్రచార బండారం బయటపడుతుంది.

### రూపాయి విలువ కోల్పోవటం

ప్రస్తుతం మన రూపాయి విలువను కోల్పోతున్నది. కొద్దిరోజుల క్రితం డాలరుకు 67–68 రూపాయలుగా ఉన్న మారకం ఇపుడు 72 రూపాయలు దాటిపోయింది. ఈ పతనానికి అంతం ఎపుడన్నది చెప్పలేని పరిస్థితి. వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా రూపాయి తిరిగి 68–70 రూపాయల మధ్య స్థిరపడుతుందని ఆర్థికశాఖ అధికారులు ఇస్తున్న హామీలు ఎవరికీ విశ్వాసం కల్పించటం లేదు. రూపాయి విలువ కోల్పోవటానికి జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు దోహదం చేస్తున్నాయి. అమెరికాలో సంభవిస్తున్న పరిణామాలు రూపాయి విలువపై ప్రభావం చూపుతున్నాయి. అమెరికా జిడిపి స్వల్పంగా పెరగడం, డాలర్ల సరఫరాను అదుపు చేయబోతున్నదని వస్తున్న వార్తలు డాలర్లకు డిమాండ్‌ను పెంచుతున్నాయి. డాలర్ల లభ్యత పరిమితమైతే వడ్డీరేట్లు అనివార్యంగా పెరుగు తాయి. అపుడు ఇతర దేశాలలో పెట్టే పెట్టుబడుల కన్నా అమెరికాలో పెట్టే పెట్టుబడులపై అద నంగా లాభం వస్తుంది. కాబట్టి అభివృద్ధి చెందు తున్న దేశాలలోని ద్రవ్య పెట్టుబడులు అమెరికా కు తరలుతున్నాయి. అంతర్జాతీయ కరెన్సీ మార్కెట్‌లో వివిధ దేశాల కరెన్సీ లభ్యత ఆధారంగా వివిధ కరెన్సీల మార్కెట్ ధర నిర్ణయమౌతుంది. రూపాయి విలువ పతనమవటం వలన మనం చేసుకొనే దిగుమతులు భారం అవుతాయి. ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయం తగ్గిపోతుంది. ఫలితంగా ప్రజలపై భారాలు పెరగటం, ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రం కావటం పెరుగుతుంది.

స్టాక్‌మార్కెట్ సూచీలు అసాధారణంగా పెరుగుతున్నాయని, ఇది ఆర్థికాభివృద్ధికి సూచిక అని, ఇదంతా తమ విధానాల ప్రభావమేనని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. ఇది వాపు మాత్రమే. బలుపుకాదు. స్టాక్‌మార్కెట్‌లోకి ఎక్కువ నిధులు ప్రవహిస్తుంటే మార్కెట్ సూచీలు పెరుగుతాయి. ధనాన్ని మార్కెట్ నుండి వెనక్కి తీసుకొంటుంటే సూచీలు పడిపోతాయి. ఎఫ్ఐఐలు, దేశీయ పెట్టుబడిదారులు ఎక్కువ మొత్తం ధనాన్ని స్టాక్‌మార్కెట్ నుండి ఉపసంహరించుకొంటుంటే సూచీలు కుప్పకూలుతాయి. స్టాక్ మార్కెట్‌లో విదేశీ పెట్టుబడులను సులభతరం చేయటంతో పాటు దేశీయంగా ఉద్యోగులు, కార్మికుల పిఎఫ్, బీమారంగంలోని నిధులు తదితరాలను స్టాక్‌మార్కెట్‌కు తరలిస్తున్నారు.

"స్టాక్‌మార్కెట్ సూచీలు అసాధారణంగా పెరుగుతున్నాయని, ఇది ఆర్థికాభివృద్ధికి సూచిక అని, ఇదంతా తమ విధానాల ప్రభావమేనని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. ఇది వాపు మాత్రమే. బలుపుకాదు. స్టాక్‌మార్కెట్‌లోకి ఎక్కువ నిధులు ప్రవహిస్తుంటే మార్కెట్ సూచీలు పెరుగుతాయి. ధనాన్ని మార్కెట్ నుండి వెనక్కి తీసుకొంటుంటే సూచీలు పడిపోతాయి."



ముంబై స్టాక్ ఎక్స్ఛేంజ్

దేశీయంగా పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధితో సంబంధం లేకుండా సూచీలు పెరగటానికి కారణమిదే. ఆర్థికవ్యవస్థకు పెద్దకుదుపుకు గురికాని ప్రస్తుత పరిస్థితులలో ఏర్పడుతున్న ఒడిదుడుకులతోనే మదుపరులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అంతర్జాతీయంగా, లేదా దేశీయంగా కొద్దిపాటి ఒడిదుడుకులెదురైనా స్టాక్‌మార్కెట్ తల్లక్రిందులవుతుందని, మార్కెట్ సూచీలు కుప్పకూలుతాయని ప్రస్తుతం మార్కెట్లో జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

విదేశీ పెట్టుబడులను ఆకర్షించటం కోసం వడ్డీరేట్లు పెంచితే పరిశ్రమలకు రుణాలు భారం అవుతాయి. విదేశీ పెట్టుబడులను ఆకర్షించటం ద్వారా విదేశీ మారకద్రవ్యం లోటును తీర్చుకుందామని వడ్డీరేట్లను పెంచితే ప్రతికూల పరిణామాలు ఎదురౌతాయి. వడ్డీరేట్లు అధికంగా ఉండటం వలన దేశీయ పరిశ్రమలు, వాణిజ్య వర్గాలు రుణాలు తీసుకోవటం భారంగా మారుతుంది. దేశంలో పారిశ్రామిక కార్యకలాపాలు కుంటుపడతాయి. నిరుద్యోగం పెరుగుతుంది. వినియోగరుణాలు భారంగా మారతాయి. ప్రజలు రుణం ద్వారా వినియోగ సరుకులను కొనుగోలు చేయటాన్ని తగ్గించుకుంటారు. రియల్ ఎస్టేట్ కార్యకలాపాలలో అధికభాగం రుణాల వలననే వేగంగా జరుగుతున్నాయి. రుణాలు భారం అయితే ఆ రంగం కూడా మాంద్యంలోకి నెట్టబడుతుంది. ఇటువంటి ప్రతికూల పరిణామాలను వడ్డీరేట్ల పెంపుదల ద్వారా ఎదుర్కోవాల్సివస్తుంది.

వీటితో పాటు సరళీకరణ విధానాల అమలు వేగవంతం కావటం వలన ఏర్పడే పరిణామాలు కూడా వినియోగంపై ప్రభావం చూపుతున్నాయి. ప్రజల ఆదాయాలు తగ్గిపోతున్నాయి. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి, ప్రభుత్వశాఖలు, ప్రభుత్వరంగ సంస్థలలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకపోవటం, అదనంగా పెంచుతున్న ఆయిల్ ధరలు, కార్మికచట్టాలలో మార్పులు చేయటం ద్వారా వారి హక్కులను హరించటం, వ్యవసాయోపకరణాల ధరలు పెంచటం, ఉత్పత్తుల ధరలను దిగ్గోయటం తదితరాల వలన సామాన్య ప్రజల ఆదాయాలు పడిపోతున్నాయి. ఆదాయాలు పడిపోవటం వలన ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతున్నది. ఫలితంగా దేశీయ మార్కెట్ కుంచించుకుపోతున్నది. ప్రభుత్వం వివిధ దేశాలతో చేసుకుంటున్న వాణిజ్య ఒప్పందాల వలన దిగుమతులు పెరగటంతో మన ఉత్పత్తిరంగం నష్టపోతున్నది.

### వాణిజ్యలోటు

మెక్సికో,థాయ్‌లాండ్ రెండు దేశాలలోనూ సంక్షోభానికి ముందు వాణిజ్యలోటు పెరిగింది. వాణిజ్యలోటు, రుణ చెల్లింపుల సమస్య తదితరాలు సంక్షోభానికి దోహదం చేశాయి. ఆ రెండు దేశాలలో వాణిజ్యలోటు తీర్చటం కోసం దేశంలో కొచ్చిన విదేశీ మారక నిల్వలను వినియోగించారు. మనదేశ వాణిజ్యలోటు కూడా పెరుగుతున్నది. 2016–17లో 112 బిలియన్ డాలర్లుగా వున్న వాణిజ్యలోటు 2017–18లో 160 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ సంవత్సరం జులై మాసంలో 18 బిలియన్ డాలర్లకు పెరిగింది ఇది గత ఐదు సంవత్సరాలలోనే అత్యధికం. బిజెపి ప్రభుత్వం అనేక ఆసియా, యూరప్ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకొంటున్నది. అమెరికా ఆదేశాలకు తలొగ్గి ఇరాన్ నుండి చౌకగా లభిస్తున్న ముడి చమురు దిగుమతిని తగ్గించటంతో ఇతరదేశాల నుండి అధిక ధరలకు కొనుగోలు చేయాల్సివస్తుంది.

> **“ రూపాయి మారకం విలువ తగ్గటం ప్రారంభం అయిన తర్వాత ప్రైవేటు సంస్థలు విదేశీ రుణాలు తీసుకోవటం కోసం రూపొందించిన నిబంధనలను ప్రభుత్వం సరళీకరించింది. దానితో ప్రైవేటు సంస్థలు పెద్దమొత్తంలో విదేశీ రుణాలు తీసుకో వటానికి అవకాశం ఏర్పడింది. ఈ విధంగా ప్రైవేటు సంస్థలు తీసుకొనే రుణాలలో అత్యధిక భాగం స్వల్పకాలిక రుణాలే. ”**

మన రూపాయి విలువ పడిపోయి డాలరుకు 72 రూపాయలను దాటిపోవటం, రానున్న రోజులలో ముడి చమురు దిగుమతుల కోసం మరింత పెద్దమొత్తం ఖర్చు పెట్టాల్సిరావటంతో వాణిజ్యలోటు మరింత పెరుగుతుంది. ఫలితంగా విదేశీ మారకద్రవ్యం కోసం వెంపర్లాడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మన వద్ద 405 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలున్నాయని గొప్పగా చెబుతున్నారు. మనవద్ద ఉన్న విదేశీ మారకద్రవ్య నిల్వలు చైనాలాగా వాణిజ్య మిగులు ద్వారా సంపాదించినవి కాదు. ఈ మొత్తంలో 65 బిలియన్ డాలర్లు మాత్రమే విదేశాలలో ఉంటున్న భారతీయులు పంపినది. మిగతా వాటిలో స్వల్పకాల లాభాలు ఆశించి వచ్చిన ద్రవ్య పెట్టుబడులు ఎక్కువ ఉన్నాయి. అవి ఎప్పుడు దేశం వదలిపోతాయో తెలియదు. ఎఫ్ఐఐలు దేశం విడిచిపోవటం ప్రారంభిస్తే మన వాణిజ్య లోటు చెల్లించటం పెద్ద సమస్యగా మారుతుంది. లోటు మొత్తాన్ని తీర్చటం కోసం విదేశీ రుణాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రూపాయి మారకం విలువ తగ్గటం ప్రారంభం అయిన తర్వాత ప్రైవేటు సంస్థలు విదేశీ రుణాలు తీసుకోవటం కోసం రూపొందించిన నిబంధనలను ప్రభుత్వం సరళీకరించింది. దానితో ప్రైవేటు సంస్థలు పెద్దమొత్తంలో విదేశీ రుణాలు తీసుకోవటానికి అవకాశం ఏర్పడింది. ఈ విధంగా ప్రైవేటు సంస్థలు తీసుకొనే రుణాలలో అత్యధిక భాగం స్వల్పకాలిక రుణాలే. కొద్దికాలంలోనే వీటిని వడ్డీతో కలిపి తీర్చవలసి ఉంటుంది. ఎగుమతుల ద్వారా రుణాలు చెల్లించటానికి అవసరమైన మొత్తాన్ని సంపాదించలేకపోతే మార్కెట్లో డాలర్లను కొనుగోలు చేయాల్సి వుంటుంది. డాలర్ల కోసం ఎగబడినపుడు మార్కెట్లో రూపాయి విలువ మరింత క్షీణిస్తుంది. అటువంటి సందర్భంలో ‘దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవటం’ కోసం విదేశీ పెట్టుబడులు దేశం విడిచివెళ్ళటం ప్రారంభిస్తాయి. దానితో ఆర్థిక సంక్షోభం తీవ్రమౌతుంది. ప్రభుత్వం వద్ద ఉన్న విదేశీ మారక నిల్వలు తగ్గిపోతాయి. రుణాలు చెల్లించాల్సిన గడువు దగ్గర పడుతున్న కొద్దీ డాలర్ల కోసం ప్రభుత్వం వెంపర్లాడటం పెరుగుతుంది. రుణాలు చెల్లించలేని పరిస్థితులలో అమెరికా, అంతర్జాతీయ ద్రవ్యసంస్థలను ఆశ్రయించాల్సి వస్తుంది. మెక్సికో, థాయ్‌లాండ్, ఇండోనేషియా ఇతర దేశాలు సంక్షోభంలో చిక్కుకుని, తమ వద్దకు వచ్చినపుడు అమెరికా, అంతర్జాతీయ ద్రవ్యసంస్థలు ఏం చేశాయో భారత్ విషయంలోనూ అదే చేస్తారు. ఆర్థిక వ్యవస్థను సుదీర్ఘ సంక్షోభంలోకి నెట్టే విధానాలను మనపై రుద్దుతారు.

### రాజకీయ స్థిరత్వం పేరుతో నియంతృత్వం

సరళీకరణ విధానాలు అమలులో భాగంగా ప్రజాస్వామ్యాన్ని బలహీనం చేసి, నియంతృత్వాన్ని ప్రోత్సహిస్తారు. రాజకీయ అస్థిరత ఉంటే పెట్టుబడులు అక్కడి నుండి తమకు లాభం వస్తుందనుకున్న గమ్యానికి తరలుతాయి. దానిని నివారించాలంటే ప్రజా ఉద్యమాలను అణచివేయటం,ఎన్నికల విధానాన్ని బలహీనపరచటం, ఆర్థిక విధానాలను రూపొందించటంలో ఎన్నికైన ప్రభుత్వాలకున్న పాత్రను తగ్గించి, సామ్రాజ్యవాదులు, అంతర్జాతీయ ద్రవ్యసంస్థలకు ప్రాధాన్యత ఇవ్వటం తదితరాలు ఇప్పటికే అమలు జరుపుతున్నారు. రానున్న రోజులలో వీటిని మరింత తీవ్రంగా అమలుచేస్తారు.

ఇవన్నీ ఆర్థికవ్యవస్థను సంక్షోభంలో ముంచటానికి, బహుళజాతి, కార్పొరేట్ సంస్థలు అధికలాభాలను సంపాదించుకోవటానికి, ప్రజలపై అధికభారాలు వేయటానికి దోహదం చేస్తాయి. సరళీకరణ విధానాలను అమలు జరిపిన దేశాల అనుభవం ఇదే. ఇదే పరిణామాలు మనదేశాన్ని కూడా చుట్టుముట్టనున్నాయి. విస్తృతస్థాయిలో ప్రజాబాహుళ్యం ఐక్యంగా పోరాటాలకు సిద్ధమైనపుడే ఈ విధానాలను తిప్పికొట్టటం సాధ్యం అవుతుంది.

---

## ఆధిపత్యం కోసం అమెరికా ఆరాటం

(13వ పేజీ తరువాయి)

18 శాతం మాత్రమే. ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే ఎక్కువే కానీ 2006లో ఆ దేశ జిడిపిలో 35 శాతం నుండి ఇప్పుడు బాగా తగ్గిపోయింది” అని పత్రిక రాసింది. “అమెరికా ప్రభుత్వం భావిస్తున్నట్లు కాకుండా చైనా లొంగడానికి నిరాకరిస్తూ మరింత గట్టిగా నిలబడింది” అని చైనాలోని అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ బిల్ జారిట్ పేర్కొన్నారు. వాణిజ్య యుద్ధం వల్ల చైనా మాత్రమే దెబ్బతింటుందంటే పొరపాటు అమెరకాను, ఇతర ప్రపంచ దేశాలను కూడా దీని ప్రభావం తాకుతోంది. అమెరికా నుండి బొగ్గు, చమురు దిగుమతులపైనా, వ్యవసాయ దిగుమతులపైనా చైనా సుంకాలు పెంచడంతో అమెరికా రైతులనుండి గగ్గోలు ప్రారంభమైంది. బొగ్గు, చమురు పరిశ్రమల్లో వేలాది ఉద్యోగాలు పోయాయి. దీనికి తోడు చైనా నుండి దిగుమతులపై అమెరికా సుంకాలు పెద్ద ఎత్తున పెంచడం వల్ల అమెరికాలో వస్తువుల ధరలు పెరిగి ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఏర్పడింది. ఇతర దేశాలకు కూడా ఈ వాణిజ్య యుద్ధం తాకిడి ఉంది. ఏమైనా చైనాతో వాణిజ్యంలో ఆ మాటకొస్తే ప్రపంచ వాణిజ్యంలో అమెరికా అనుసరిస్తున్న బాధ్యతా రహిత విధానాల వల్లనే అది అన్ని దేశాలతో వాణిజ్య లోటులో పడింది. వాణిజ్య లోటు పోవాలంటే ముందుగా అమెరికా ఆర్థిక విధానాలు మారాలి. ఆ పని చేయడానికి బదులు అమెరికా మరింత బాధ్యతా రహితంగా వాణిజ్య యుద్ధాలకు పాల్పడుతోంది. చైనాతో వాణిజ్య లోటు తగ్గించుకోవడమే ఈ ‘యుద్ధం’ లక్ష్యమైతే అది ఎప్పుడో పరిష్కారం అయి వుండేను. కానీ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం లక్ష్యం అది కాదని, చైనా అభివృద్ధిని నిలువరించడమే అని తేలిపోతోంది. సార్వభౌమాధికారం గల ఏ దేశమూ, ఏ జాతీ దీన్ని అంగీకరించదు. చైనా కూడా అంగీకరిం చడం లేదు. అందువల్ల ఇప్పుడు అమెరికా వెనక్కి తగ్గడమా లేక సంపూర్ణ వాణిజ్య యుద్ధంగా మారడమా అనేది ప్రపంచం ముందున్న సమస్య. వాణిజ్య యుద్ధాలు అక్కడితో ఆగవనీ, సైనిక యుద్ధా లకూ దారితీస్తాయని ప్రపంచ చరిత్ర మనకు చెబుతున్న అనుభవం. “యుద్ధ మొక్కటే చైనాను నిలువరిస్తుంది” అని అమెరికా సైనిక జనరల్స్ చేస్తున్న ప్రకటనలను ప్రపంచ ప్రజలందరూ హెచ్చరికగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. ❊

అధ్యయనం

# సామాజిక తరగతులు - భూమి - అసమానతలు



రచయిత సుందరయ్య విజ్ఞానకేంద్రం మేనేజింగ్ కమిటీ సభ్యులు

సి. సాంబిరెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల అధ్వర్యంలో 2013లో సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహించాము. ఉత్తరాంధ్ర 7, దక్షిణాంధ్ర 21, రాయలసీమ 9, మొత్తం 37 గ్రామాల నుండి సమాచారం సేకరించాము. సమాచార సేకరణ రెండు విడతలుగా జరిగింది. మొదట గ్రామంలోని ప్రతి కుటుంబం నుండి సాధారణ సమాచారం సేకరించాము. రెండవ విడతలో కుటుంబ జీవనంలోని అన్ని కోణాలకు సంబంధించిన లోతైన సమాచారం 10శాతం కుటుంబాల నుండి సేకరించాము. ఈ వ్యాసంలో మొదటి విడత సేకరించిన సమాచారాన్ని విశ్లేషించే ప్రయత్నం జరిగింది.

విశ్లేషణకు పోయేముందు కొన్ని పదాలను పరిచయం చేయాలి. వ్యవసాయ భూములు అనేక రకాలు. కాని ఇక్కడ వాడింది సమానీకరించబడిన వర్షాధారపు భూమిని మాత్రమే. ఈ సమానీకరించబడిన వర్షాధార భూమిని లెక్కించటానికి – సాగునీటి వసతి వుండి, రెండు పంటలు పండే ఒక ఎకరం భూమి 5ఎకరాల వర్షాధారభూమికి సమానమౌతుందని తీసుకున్నాము. అట్లాగే సాగునీటి వసతి వుండి, ఒక పంటపండే ఒక ఎకరం భూమి 2.5 ఎకరాల వర్షాధారభూమికి సమానమవుతుంది. మిగిలేది వర్షాధార భూమి కాబట్టి, దానిని మార్చనవసరం లేదు. సమానీకరించబడిన వర్షాధారభూమి అంటే, సాగునీటి వసతిగల భూములను వర్షాధార భూములుగా మార్చి, వాటిని వర్షాధార భూములకు కలిపితే వచ్చే మొత్తం భూమి. కాబట్టి సమానీకరించబడిన వర్షాధారభూమి= సాగునీటి వసతిగల రెండు పంటలు పండేభూమి×5+సాగునీటి వసతిగల ఒక పంటపండే భూమి×2.5+వర్షాధారభూమి. ఈ సమీకరణాన్ని ఉపయోగించి సమానీకరించబడిన వర్షాధారభూమిని లెక్కించాలి. భూమి రెండు పంటలు పండే మాగాణి భూమి అయినా, ఒక్క పంటపండే మాగాణి భూమి అయినా వాటికి బదులు ఈ వ్యాసంలో సమానీకరించబడిన వర్షాధార భూమినే ఉపయోగించాము.

సమానీకరించబడిన స్వంతభూమి 40 ఎకరాలకు పైబడి వున్న కుటుంబాన్ని భూస్వామి కుటుంబంగా తీసుకున్నాము. సమానీకరించబడిన, అంటే సాగునీటి వసతి కలిగి రెండు పంటలు పండే భూమి 8ఎకరాలుగల కుటుంబం కూడా పైన తెలిపిన సమీకరణల ప్రకారం భూస్వామి కుటుంబం అవుతుంది. సాగునీటి వసతిగల ఒక పంటపండే భూమి 16ఎకరాలకు పైగా వున్న కుటుంబం కూడా భూస్వామ్య కుటుంబమే. సమానీకరించబడిన భూమి 20 ఎకరాల కంటే యెక్కువ, 40ఎకరాలుకంటే తక్కువ వున్న కుటుంబాన్ని ధనికరైతు కుటుంబంగా తీసుకున్నాము. అట్లాగే 10 ఎకరాల కంటే ఎక్కువ, 20ఎకరాలకంటే తక్కువ వుంటే అది మధ్యతరగతి కుటుంబం అని, 5ఎకరాల కంటే యెక్కువ 10ఎకరాల కంటే తక్కువ వుంటే అది చిన్నకారు రైతు కుటుంబం అని, ఒక ఎకరం కంటే యెక్కువ, 5ఎకరాల కంటే తక్కువ వుంటే సన్నకారు రైతు కుటుంబం అని, ఒక ఎకరంలోపు భూమివున్న కుటుంబాలు గాని, భూమిలేని కుటుంబాలు గాని వ్యవసాయ రంగంలో కూలి పని చేస్తుంటే వ్యవసాయ కార్మిక కుటుంబాలుగాను, మిగిలిన కుటుంబాల ప్రధాన వ్యాపకాన్ని బట్టి వారు వ్యవసాయేతర కార్మికులు, వృత్తిదారులు, వుద్యోగులు, వ్యాపారులు మొదలైన కుటుంబాలుగా గ్రామంలోని కుటుంబాలన్నిటిని వివిధ వర్గాలుగా విభజించాం. దిగువ విశ్లేషణలో వచ్చే భూస్వాములు, ధనికరైతులు, పేదరైతులు (చిన్నకారు+సన్నకారు రైతులు), వ్యవసాయ, వ్యవసాయేతర కార్మిక కుటుంబాలు యివే.

**1. భూస్వాములు, ధనిక రైతులు :**

**ఏ) భూస్వాములు :**

40ఎకరాలకు పైగా సమానీకరించబడిన స్వంతభూమి గలవారు భూస్వాములని చూశాము. వారు పొలం పనులు చేయరని, చేసినా నామమాత్రంగా వుంటుందని మా పరిశీలనలో వెల్లడైంది. కాబట్టి ఇది పూర్తిగా శ్రమ దోపిడీ మీద ఆధారపడే వర్గం. అట్లాంటి భూస్వాములు ఉత్తరాంధ్రలోని 7 గ్రామాల్లో 5 మంది, దక్షిణాంధ్రలోని 21 గ్రామాల్లో 21 మంది, రాయలసీమలోని 9 గ్రామాల్లో 24 మంది మొత్తం 50మంది వున్నట్లుగా లెక్క తేలింది. వారిలో అగ్రకులాల వారు అత్యధికంగా 78 శాతం (39)మంది వున్నారు. వారు బిసిలలో 22 శాతం (11)మంది మాత్రమే వుండగా, యస్‌సి, యస్‌టిలలో ఒక్కరు కూడా లేరు.

మొత్తం రాష్ట్రంలో దక్షిణాంధ్ర సుసంపన్నమైన ప్రాంతం. వ్యవసాయ రంగంలో బాగా అభివృద్ధి చెందిన ప్రాంతం. మిగిలిన ప్రాంతాల కంటే అక్కడే అగ్రకులాలు యెక్కువగా వున్నాయి. వారిచేతిలోనే అక్కడ భూ సంపద యెక్కువగా కేంద్రీకరించబడి వున్నది. అంత మాత్రాన వారంతా సంపన్నులని కాదు. వారిలోని సంపన్నులే యెక్కువ భాగం భూమిని దఖలు పరచుకొని వున్నారు. వారిలో పేదలు కూడా యెక్కువగానే వున్నారు. అయినా ఆ ప్రాంతంలోని 21 గ్రామాలలో వున్న 21మంది భూస్వాములు అగ్రవర్ణాలవారే. అక్కడ యితర కులాలకు స్థానం లేదు. ఈ పరిస్థితి ఒక్క భూస్వాములలోనే కాదు. ధనిక రైతులు, మధ్యతరగతి రైతులలో కూడా దాదాపు యిదే పరిస్థితి కనిపిస్తుంది. మరొక విధంగా చూస్తే 22 శాతం కుటుంబాలు మాత్రమే గల అగ్రకులాలలో 78శాతం (39) మంది భూస్వాములు వుండగా, దానికి దాదాపు రెట్టింపు 41శాతం కుటుంబాలుగల బిసిలలో 22శాతం (11) కుటుంబాలు భూస్వాములు మాత్రమే వున్నారు. మరొకప్రక్క 37శాతం కుటుంబాలుగల యస్‌సి, యస్‌టిలలో ఒక్క భూస్వామి కూడా లేదు.

**బి) ధనిక రైతులు :**

> **"మొత్తం 37 గ్రామాలలో పూర్తిగా శ్రమ దోపిడీకి గురి అవుతూ కూలి పనులు చేసే కుటుంబాలను పరిశీలిస్తే ఆ కూలి కుటుంబాలు యస్‌సిల నుండి 46 శాతం, యస్‌టిల నుండి 3శాతం, బిసిల నుండి 36శాతం వున్నట్లుగా లెక్క తేలింది. అంటే, కూలి కుటుంబాలలో బహుజన కుటుంబాలు, అంటే యస్‌సి, యస్‌టి, బిసి కుటుంబాలు అన్నీ కలిసి 85 శాతం వున్నాయి."**

గ్రామాల్లో భూస్వాములకు తోడు ధనిక రైతులు కూడా కీలకంగా తయారయ్యారు. వ్యవసాయంలో శ్రమ దోపిడీతో పాటు రకరకాల వ్యాపారాలు చేస్తూ వీరు ఆర్థికంగా బాగా బల పడ్డారు. భూస్వాములతో పాటు రాజకీయంగా కూడా గ్రామాల్లో మంచి పట్టు సంపాదించారు. పాలకవర్గ రాజకీయాలకు గ్రామాల్లో యీ రెండు వర్గాలే పునాది. అలాంటి ధనిక రైతులు వివిధ సామాజిక తరగతులలో యే యే మోతాదుల్లో వున్నారో పరిశీలిద్దాము.

ధనిక రైతులు ఉత్తరాంధ్ర 7 గ్రామాల్లో 8 మంది, దక్షిణాంధ్ర 21 గ్రామాల్లో 96మంది, రాయలసీమ 9 గ్రామాల్లో 106 మంది, మొత్తం 210 మంది వున్నారు. వారిలో మూడు వంతులకు పైగా అంటే, 72 శాతం (152) మంది 22 శాతం కుటుంబాలు మాత్రమే గల అగ్రకులాల్లోనే వున్నారు. 41 శాతం కుటుంబాలుగల బిసిలలో వారు నాల్గవ వంతు అంటే, 26 శాతం (54) మంది మాత్రమే వున్నారు. ఈ 54 కుటుంబాలలో కూడా అత్యధికంగా 41 కుటుంబాలు రాయలసీమలోనే వున్నాయి. కాబట్టే రాయలసీమలో అక్కడక్కడా బిసిలు కూడా దళితుల మీద దాడి చేయటం చూస్తాము. యస్‌సి,యస్‌టిలలో ధనిక రైతులు నామమాత్రంగానే వున్నట్లు సమాచార మందిం ది. 33 శాతం కుటుంబాలుగల యస్‌సిలలో యిద్దరు ధనికరైతు (0.9%)లు మాత్రమే వున్నా రు. అట్లాగే 4శాతం కుటుంబాలు గల యస్‌టిల లో కూడా యిద్దరు మాత్రమే ధనిక రైతులున్నారు.

మరొక రకంగా చెప్పాలంటే 22 శాతం కుటుంబాలుగల అగ్రకులాలలో 78శాతం భూస్వాములు, 72శాతం ధనిక రైతులు (పెత్తం దారీ వర్గాలు) వుండగా, 78శాతం కుటుంబాలు గల బహుజనులలో (బిసి+యస్‌సి+యస్‌టి) 22 శాతం భూస్వాములు, 28శాతం ధనిక రైతులు మాత్రమే వున్నారు. యీ నాటికీ గ్రామాల్లో అగ్రకులాల ఆధిపత్యం కొనసాగటానికి వారివద్ద పోగుపడిన యీ భూమే కారణం. భూకేంద్రీ కరణ యింత మోతాదులో తెలంగాణలో కని పించదు. అక్కడ భూస్వాములలో 29 శాతం, ధనిక రైతులలో 35శాతం బిసిలు వున్నారు. అట్లాగే యస్‌సి,యస్‌టిలలో భూస్వాములు 13 శాతం, ధనికరైతులు 8 శాతం వున్నారు.

**సి) శ్రమ జీవులు (కూలి కుటుంబాలు, పేదరైతు కుటుంబాలు)**

ఎ) మొత్తం 37 గ్రామాలలో పూర్తిగా శ్రమ దోపిడీకి గురి అవుతూ కూలి పనులు చేసే కుటుంబాలను పరిశీలిస్తే ఆ కూలి కుటుంబాలు యస్‌సిల నుండి 46 శాతం, యస్‌టిల నుండి 3శాతం, బిసిల నుండి 36శాతం వున్నట్లుగా లెక్క తేలింది. అంటే, కూలి కుటుంబాలలో బహుజన కుటుంబాలు, అంటే యస్‌సి, యస్‌టి, బిసి కుటుంబాలు అన్నీ కలిసి 85 శాతం వున్నాయి. కాబట్టి కూలి కుటుంబాలన్నీ దాదాపు బహుజన కుటుంబాలే కాగా వారిలో అగ్రకుల కుటుంబాలు నామమాత్రం(15శాతం)గానే వున్నాయి.

బి) అట్లాగే పేదరైతులు (చిన్నకారు రైతులు+సన్నకారు రైతులు) కూడా కష్టజీవులే. వారు కూడా శ్రమ దోపిడీకి గురి అయ్యేవారే గాని, శ్రమ దోపిడీ చేసేవారు కాదు. (వీరు కూలికి పెట్టుకునే దినాల కన్నా, కూలికిపోయే దినాలు యెక్కువ.) పేదరైతులు యస్‌సిల నుండి 16 శాతం, యస్‌టిల నుండి6 శాతం, బిసిల నుండి 47 శాతం, మొత్తం వారు దాదాపు 70శాతం వున్నారు. వీరంతా బహుజనులు. అంటే పేద రైతాంగంలో కూడా సింహభాగం బహుజనులే.సంపదలు సృష్టించేది యీ కూలీలు, యీ పేదరైతులే. అనుభవించేది మాత్రం అగ్ర కులాల్లోని భూస్వాములు, ధనిక రైతులు. అంటే, కష్టం ఒకరిదైతే అనుభవం మరొకరిదిగా వుంది.

**డి) కుటుంబ సగటు భూమి**

కుటుంబ సగటు భూమిని పరిశీలించినా అగ్రకులాలవారే మిగిలిన వారికంటే బాగా ముందు వున్నారని అర్థమౌతుంది. అగ్రకులాల కుటుంబ సగటు భూమి 5.53 ఎకరాలు కాగా, యస్‌సిల కుటుంబ సగటు 0.52 ఎకరాలు మాత్రమే వుంది. అంటే యస్‌సి కుటుంబ సగటు కంటే అగ్రకులాల సగటు 10.6 రెట్లు యెక్కువ. బిసి కుటుంబ సగటు కూడా యెక్కువ యేమీ కాదు. అది 2.2 ఎకరాలు మాత్రమే. అంటే అది అగ్రకులాల సగటుభూమిలో దాదాపు మూడవ వంతు. ఈ గ్రామాల్లో కేవలం 10.5 శాతం కుటుంబాలు కలిగిన కమ్మ, రెడ్డి కులాల వద్ద 31శాతం భూమి కేంద్రీకృతమై వుంది. కులాలవారీ కుటుంబ సగటు భూమిని పరిశీలిం చినా ఇలాంటి తారతమ్యాలే కనిపిస్తాయి. కమ్మ,రెడ్డి కులాల కుటుంబ సగటు భూమి వరుసగా 7.3, 7.2 ఎకరాలు కాగా మాల, మాదిగ కులస్థుల కుటుంబ సగటు అర్ధ ఎకరం మాత్రమే వుంది. అంటే వీరికంటే కమ్మ,రెడ్డి కులాల సగటు భూమి దాదాపు 15 రెట్లు అధికం. బిసి కులాలైన కొప్పులు వెలమ, యాదవ, తూర్పు కాపుల కుటుంబ సగటు భూమి వరుసగా 3.1, 2.5, 1.9 ఎకరాలుగా వుంది. బిసిలలో వృత్తి కులాలకు యీ భూమి మరింత తక్కువగా వుంది. వారి కుటుంబ సగటు 1ఎకరం నుండి 1.5 ఎకరాల వరకు మాత్రమే వుంది. ముస్లిం, ఒసి, బిసిలు కూడా సగటు భూమిరీత్యా యిదేస్థాయిలో వున్నారు. యీ తారతమ్యాలు దక్షిణాంధ్ర జిల్లాలలో మరింత తీవ్రంగా వున్నాయి. అంటే యీ జిల్లాలలో పై కులాలకు మరింత యెక్కువగాను, దిగువ కులాలకు మరింత తక్కువగాను భూములు వున్నాయి. కాని రాయలసీమలో యీ తార తమ్యాలు తక్కువగా కనిపిస్తాయి. దక్షిణాంధ్రలో మాల, మాదిగ కులస్థుల కుటుంబ సగటు 30 సెంట్లు మాత్రమే.

కులాల వారీగా భూమిలేని కుటుంబాలను పరిశీలిస్తే కమ్మ, రెడ్డి కులాలలో అలాంటి కుటుంబాలు వరుసగా 29శాతం, 25శాతం మాత్రమే వుండగా మాల, మాదిగ, శెట్టి బలిజ, రజక కులాలలో అలాంటి భూమిలేని కుటుం బాలు 80శాతానికి కొద్దిగా అటు,యిటుగా వున్నాయి. గోదావరి డెల్టా గ్రామాలలో మాల, మాదిగ కులస్తులలో యిలాంటి కుటుంబాలు 98 శాతం దాకా వున్నాయి. ఆ గ్రామాలలో భూమిలేని కుటుంబాలు సగటు 84 శాతం. అంటే ఆ గ్రామాల్లో స్వంతభూమి గల కుటుం బాలు 16శాతం మాత్రమే.

ఈ అసమానతలు తినే తిండిలో, ఆయుర్దా యంలో, చదివే చదువుల్లో, ఆరోగ్య సంరక్షణలో, అనుభవించే వసతుల్లో (వుదాహరణకు మరుగు దొడ్డి వంటగ్యాస్, ప్రయాణ సాదనం మొ॥) – అన్నింటిలోను బలంగానే కనిపించాయి. ❃

# ప్రజాస్వామ్యం - పెట్టుబడిదారీ 'అభివృద్ధి'

ఎంవిఎస్ శర్మ



రచయిత
ప్రజాశక్తి సంపాదకులు

(ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలోని రాజన్ గురుక్కల్ రచన ఆధారం)

సమాజంలో అసమానతలు, ఆర్థిక వ్యవస్థలో దొంతరలు ఏర్పడిన కాలం నుండీ ప్రజాస్వామ్యం ఒక సుదూర స్వప్నంగానే ఉంటోంది. కొద్దిమంది గుప్పెట్లోనే అధికారం ఉండిపోవడమే చరిత్రలో మనం చూస్తున్నాం. పలు సందర్భాలలో దీనినే ప్రజాస్వామ్యం అని భావించి పొరబడుతున్నాం కూడా. రాజ్యాంగాన్ని సవరించడం, మెరుగులు దిద్దడం ద్వారా బూర్జువా ప్రజాస్వామ్యాన్ని నిజమైన ప్రజాస్వామ్యంగా మార్చేయవచ్చునన్న నమ్మకం కూడా చాలామందిలో ఉంది. పశ్చిమదేశాల బూర్జువా ప్రజాస్వామ్యం ప్రపంచీకరణ శకంతో మానవ జాతి చరిత్ర చివరి దశకు చేరిందని, ఇదే అత్యుత్తమ, అత్యున్నత వ్యవస్థ అని ఫుకుయమా 1990లలోనే ప్రకటించాడు. అయితే మరో పదేళ్ల వ్యవధిలోనే పశ్చిమదేశాలలో తలెత్తిన ప్రజాఉద్యమాలు ఫుకుయామా జోస్యం తప్పిందని ఋజువుచేయనే చేశాయి.

**పెట్టుబడిదారీ వ్యవస్థ, ప్రజాస్వామ్యం**

సరుకుల మారకం కోసం మనం సృష్టించుకున్న డబ్బును పెట్టుబడిగా కొత్త అవతారంలోకి మార్చే శక్తుల, సాధనాల, ఉత్పత్తి సంబంధాలన్నింటా మొత్తం రూపమే పెట్టుబడిదారీ వ్యవస్థ. పారిశ్రామిక ఉత్పత్తి, లాభాల కోసమే జరిగే సరుకుల మార్పిడి – ఈ రెండు విధాలుగా డబ్బు 'పెట్టుబడి' అవతారాన్ని దాలుస్తుంది" పెట్టుబడిదారీ అభివృద్ధి అంటే అర్థం పెట్టుబడి మరింతగా పోగుబడడమే" అన్నాడు మార్క్స్. (1867)లో భూస్వామ్య వ్యవస్థ అనంతర కాలంలో ఉండిన రాజ్యాంగబద్ధమైన రాచరికంలో (ఇంగ్లండ్‌లో మాదిరిగా)ను, పిత్రుస్వామ్యంలోను పెట్టుబడిదారీ వ్యవస్థ న్యాయపరమైన, రాజకీయపరమైన వ్యవస్థ మూలాలు ఉన్నాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థ తొలిదశలోనే వలసలను చేజిక్కించుకోవడం దాని అభివృద్ధికి మొదటి కొండగుర్తు. 1776లో అమెరికా స్వతంత్రం ప్రకటించుకుని యుద్ధంతో దానిని దృవపరిచి అమెరికా సంయుక్త రాష్ట్రాలుగా ఏర్పడ్డాక రాజకీయ వ్యవస్థ బూర్జువా ప్రజాస్వామ్య రూపం తీసుకుంది. బూర్జువా వర్గం ఆధిపత్యంలో ఉన్న ప్రజాస్వామ్య రాజ్యాంగ యంత్రంపై ఆధారపడి పెట్టుబడిదారీ అభివృద్ధి కొనసాగింది. 1789 ఫ్రెంచివిప్లవం తో ప్రజాస్వామ్యం మధ్యతరగతిని దాటి ఇంకా విస్తరించే ఒక అవకాశం వచ్చింది. కాని మధ్య తరగతి బూర్జువావర్గంతో చేయి కలపడంతో అది సాధ్యపడలేదు. ఈ క్రమంలో అధికారాలన్నీ ఒకేదగ్గర కేంద్రీకృతం అయిపోయిన నెపోలియన్ బోనాపార్టి పాలన వచ్చింది. వలసలను చేజిక్కించుకోవడంలో పోటీపడే క్రమంలో, రాజ్యాధికారాన్ని సామ్రాజ్యవిస్తరణకు వాడుకుంటూ ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలకు దిగారు. ఆ తర్వాత వలస విధానానికి వ్యతిరేకంగా పోరాటాలు జరిగి ఉదారవాద ప్రజాస్వామ్య రాజ్యాలూ ఏర్పడ్డాయి. మరోవైపు కొన్ని దేశాలలో నియంతృత్వం వచ్చింది. ఆసియా ఖండంలో ఈ పరిణామాలు ఎక్కువగా జరిగాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ రెండు రకాల ప్రభుత్వాలతోనూ కలిసి పెరిగింది.

'స్వేచ్ఛా వ్యాపారం' సూత్రం ఎటువంటి ఆటంకాలూ లేకుండా అమలు జరగాలి గనుక వాక్స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం కోసం, స్వేచ్ఛా వ్యాపారాన్ని నిరోధించే నియంతృత్వ విధానాలను ఎదిరించి పోరాడవలసిన అగత్యం, బూర్జువా ప్రజాస్వామ్యాన్ని – దీనినే ఉదారవాద ప్రజాస్వామ్యం అని అంటారు– నిలబెట్టాల్సిన అవసరం పెట్టుబడిదారులకు కలిగింది. పైకి ప్రజలకోసమే, ప్రజలచేత నడిపించబడే ప్రజాస్వామ్యం అని అన్నా, స్వేచ్ఛామార్కెట్ కోసమే వారి ప్రజాస్వామ్య నిబద్ధత పనిచేసింది. నిజానికి కొద్దిమంది వ్యక్తుల పెత్తనం, గుత్తాధిపత్యం ఇవే పెట్టుబడిదారుల 'రహస్య' ఎజెండాగా ఉంటాయి. కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా బూర్జువా డెమొక్రాట్ల పోరాటాలను, బూర్జువా ప్రజాతంత్ర రాజ్యవ్యవస్థలను పెట్టుబడిదారులు ఎప్పుడూ సమర్థిస్తూనే వచ్చారు. ప్రోత్సహించారు కూడా. కమ్యూనిస్టు ఉద్యమాలకు వ్యతిరేకంగా నిరంతర ప్రతిఘటన ఉండేటట్టు వారు చూశారు. స్కాండినేవియన్ దేశాలలో (నార్వే, స్వీడన్, డెన్మార్క్) మాత్రం ఒకమేరకు ప్రజాస్వామ్యం మనగలిగినా, కీన్స్ నమూనాతో అక్కడ అమలు జరిగిన ఆర్థిక విధానాలు ఇప్పుడక్కడ నియంతృత్వ పద్ధతులు అనివార్యం అయ్యేలా చేస్తున్నాయి.

**'అభివృద్ధి' నినాదం**

మార్క్స్ సిద్ధాంతం ప్రకారం పెట్టుబడిదారీ విధానంలో 'అభివృద్ధి' అంటే పెట్టుబడిదారుల అభివృద్ధే. ఐతే మామూలుగా అన్ని తరగతుల ప్రజలూ 'అభివృద్ధి' అంటే తమ తమ తరగతుల అభివృద్ధి అనే అనుకుంటారు. నిజానికి వలస విధానం. సామ్రాజ్యవాదం కూడా పెట్టుబడిదారీ అభివృద్ధి విధానాలే. అవి సామాన్య ప్రజలకి కష్టాలు, కడగండ్లే మిగిల్చాయి. అలాగే 'ప్రపంచీకరణ' అన్నపదం కూడా. "ప్రపంచీకరణ' అంటేనే పెట్టుబడిదారీ ప్రపంచీకరణ. ఇది నయా వలస విధానం. నయా సామ్రాజ్యవాదం కొనసాగింపు. సంక్షోభాల కాలంలో, ఆర్థిక వ్యవస్థ తిరోగమనంలో ఉన్నా, పెట్టుబడిదారీ వ్యవస్థ సంపదను మరింత ఎక్కువగా పోగేసుకునే వ్యూహాలనే అనుసరించింది. వాటికి అభివృద్ధి' అన్న పేరు తగిలించి సమాజం ఆ వ్యూహానికి ఆమోదం తెలిపేలా వ్యవహారం నడిపింది. అందువలన 'అభివృద్ధి' అనేది చాలా మోసపూరితమైన పదం. ఎవరో అమాయకులు

> **"పెట్టుబడిదారుల మధ్య మాత్రం పోటీ ఉంటుందని. శ్రమజీవుల మధ్య ఉండేది, ఉండవలసినది సహకారం మాత్రమే తప్ప పోటీ కానేకాదని వారి ఆలోచనల్లో ఉండదు. ఆ పుస్తకం కొనడం, నెగ్గడం ఎలా? అని తాపత్రయ పడుతూ వ్యక్తిగానే మిగిలిపోతాడు తప్ప సమిష్టిత త్వాన్ని అలవర్చుకోడు వారు వ్యాప్తి చేసే సమాచారమే సత్యం అని, వారిచ్చే వివరణలు, వాదనలు మాత్రమే సరైనవని ప్రజలు భావించేలా చేస్తారు."**

మాత్రమే 'అభివృద్ధి' అంటే సమాజంలోని అన్ని వర్గాలకూ అభివృద్ధి జరుగుతుందని నమ్ముతారు. అభివృద్ధి అంటే పెట్టుబడి అభివృద్ధి. సాంకేతిక- ఇంధన రసాయన వాడకం ఉదృతంగా ఉండే పరిశ్రమల అభివృద్ధి, తద్వారా అత్యధిక లాభాల సాధన, మరింతగా పెట్టుబడి పోగుబడటం, జనాలచేత మరింత ఎక్కువగా ఖర్చు పెట్టిం చడం. దాదాపు భూమి ఉత్తరార్ధగోళంలోని దేశాలన్నింట్లో ఇటువంటి లక్షణాలే మనకి కనపడతాయి. ప్రపంచం మొత్తం మీద సాగే పెట్టుబడిదారీ కార్యకలాపాలను, లావాదేవీలను నియంత్రించేవి ఈ దేశాలే.

పెట్టుబడిదారీ దోపిడీకి 'అభివృద్ధి' అనే పంచదార పూతపూసి ప్రచారంలోకి తెచ్చిన మేధావులు చాలామంది ఉన్నారు. అదే సమయంలో ఆపై పొరను తొలగించి వాస్తవంగా జరుగుతున్న దోపిడీని, అసమానవాణిజ్యాన్ని ఎండగటిట్టన మేధావులూ ఉన్నారు. పెట్టుబడిదారీ విధానానికి, ప్రజాస్వామ్యానికి పొసగదని వీరు వాదించారు. వెనకబడ్డ దేశాలుగా కొన్ని మిగిలిపోవడం వెనుక పెట్టుబడిదారీ దోపిడీ ఉందని, వాటిని అదే విధంగా వెనకబడ్డ దశలోనే కొనసాగించడం ద్వారా ఈ దోపిడీని కొనసాగి స్తున్నారని వీరు ఎత్తిచూపారు. వలసవిధానం అనంతర కాలంలో కూడా నయా ఉదారవాదం, ప్రపంచీకరణ ప్రజాసామ్యాన్ని ఏ విధంగా బలహీనపరుస్తున్నాయో వీరు బహిర్గతం చేశారు. కులవ్యవస్థ, జాతివిభేదాలు, ప్రాంతీయ విభేదాలు వంటి అంశాలను ఆయాప్రభుత్వాలు కార్పొరేట్లకు కొమ్ముగాసే విధానాలను అమలు చేసే క్రమంలో ఏ విధంగా వాడుకున్నాయెూ వివరించారు. జాతిరాజ్యాల ప్రయోజనాలకు ప్రపంచీకరణ ఏ విధంగా ఆటంకమో తెలియ జేశారు. అదే సమయంలో జాతీయ భావాలు, ప్రాంతీయతత్వాలు ప్రపంచీకరణ శకంలో నియంతృత్వ పోకడలను సంతరించుకుని ఫాసిస్టు స్వభావాన్ని పొందే దిశగా పరిణమిస్తున్న వైనాన్ని వివరించారు.

గతంలో సామ్రాజ్యవాదం ఆయా జాతి రాజ్యాల పునాదులమీద అభివృద్ధి చెందింది. (జర్మన్, బ్రిటిష్, అమెరికన్, వగైరా) ఇప్పుడు ప్రపంచీకరణ శకంలో ఆయా జాతిరాజ్యాలను, వాటి పాలనా యంత్రాంగాలను పక్కనబెట్టి పెట్టుబడిదారీ వ్యవస్థ ముందుకు సాగుతోంది. ఐఎంఎఫ్. ప్రపంచబ్యాంకు, ప్రపంచవాణిజ్య సంస్థ వంటివి ఆయా జాతి రాజ్యాల హద్దులను, నియంత్రణలను దాటి ముందుకు పోతున్నాయి. ఇంకోపక్క ప్రజాసంక్షేమం చూసే బాధ్యత నుండి ప్రభుత్వాలు తప్పుకుని ప్రజల ఆస్తుల ప్రైవేటీకరణ వేగం పుంజుకోవడంతో దేశస్వావలంబన దెబ్బతింటోంది. ట్రంప్ వంటి కొందరు సంపన్న దేశాల అధినేతలు తమతమ జాతిరాజ్యాల సామ్రాజ్యావాదానికి ప్రాతినిధ్యం వహించే కన్నా ప్రపంచీకరణకు ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారని గమనించారు.

### పెట్టుబడిదారీ అభివృద్ధి - మానవ పరిణామశాస్త్రం

మానవ పరిణామం ఈ పోస్ట్ మోడరన్ కాలంలో పెట్టుబడిదారీ అభివృద్ధి సిద్ధాంతం వల్ల ఏ రీతిన ప్రభావితం అవుతుందో పరిశీలించి వివరించిన సామాజిక శాస్త్రవేత్తలు చాలామంది వచ్చారు. మైఖెల్ ఫోకాల్ట్, జోన్ ఫ్రాంకోయిస్‌లయెూటార్డ్, జేమ్స్ ఫెర్గూసన్, ఆర్టురోఎస్కోబార్ వంటివారు కొందరు ప్రముఖులు. "పెట్టుబడిదారీ అభివృద్ధి"కి సంబంధించిన బోధనలతో సామాన్య ప్రజల ఆలోచనా స్థితి (మైండ్‌సెట్)ని ప్రభావితం చేసి ఆ ప్రభావానికి ప్రజలు తలవొగ్గి అంగీకరించేలా పెట్టుబడిదారీ వ్యవస్థ చేస్తుందనివీరి ప్రతిపాదన. మౌలిక విషయాలలో సైతం ప్రజల ఆలోచన ప్రభావితమై "అభివృద్ధి బోధన"లలో ఉండే భావాలను గాని, ప్రతిపాదనలను గాని, సూత్రీకరణలను గాని వేటీని ఏమాత్రమూ ప్రశ్నించకుండా, సవాలు చేయకుండా యథాతథంగా అవే సత్యాలని అంగీకరించేలా చేస్తుంది. ఆ విధంగా ప్రజలు తలవొగ్గడానికి ఎటువంటి సమాచారం అవసరమో దానిని మాత్రమే వ్యాప్తిచేస్తారు. (ఉదా: "పోటీ ప్రపంచంలో నెగ్గడం ఎలా? అన్న థీమ్‌తో చాలా పుస్తకాలు వస్తున్నాయి. అసలు ఇది పోటీ ప్రపంచం ఎలా అవుతుంది? అన్న ప్రశ్న పుస్తకం కొనేవాడికి రాదు. పెట్టుబడిదారుల మధ్య మాత్రం పోటీ ఉంటుందని. శ్రమజీవుల మధ్య ఉండేది, ఉండవలసినది సహకారం మాత్రమే తప్ప పోటీ కానేకాదని వారి ఆలోచనల్లో ఉండదు. ఆ

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక, ప్రజాశక్తిప్రెస్,
గవర్నరుపేట, విజయవాడ.

**"పెట్టుబడిదారీ వ్యవస్థలో అభివృద్ధి ఏనాడూ ప్రపంచవ్యాప్తంగా ఒకేస్థాయికి చేరుకోదని, వెనకబడ్డ దేశాల, ప్రాంతాల దోపిడీ పైనే సంపన్నదేశాల, పెట్టుబడిదారుల సంపద పెరుగుదల ఆధారపడి ఉందని మన అనుభవం స్పష్టం చేస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడి రాక, సాంకేతిక పరిజ్ఞానం బదలాయింపు అనేవి వొట్టి బూటకం అని వెనకబడ్డ దేశాలు క్రమంగా గ్రహిస్తున్నాయి."**

పుస్తకం కొనడం, నెగ్గడం ఎలా? అని తాపత్రయ పడుతూ వ్యక్తిగానే మిగిలిపోతాడు తప్ప సమిష్టిత త్వాన్ని అలవర్చుకోడు) వారు వ్యాప్తి చేసే సమాచారమే సత్యం అని, వారిచ్చే వివరణలు, వాదనలు మాత్రమే సరైనవని ప్రజలు భావించేలా చేస్తారు.


చంద్రబాబు ఈ పనిలో అందెవేసిన చెయ్యి. అతను తిరుగులేని సత్యాలుగా ప్రజలకు చెప్పి వారిలో కూడా అత్యధికులు వాటిని ఏమాత్రమూ ప్రశ్నించకుండా, సవాలు చేయకుండా నమ్మే విషయాలు ఎన్నో ఉన్నాయి. మచ్చుకి కొన్ని:

1. "మన రాష్ట్రాన్ని నెంబర్‌వన్‌గా తీర్చి దిద్దుతా". మానవాభివృద్ధి సూచికలైన అక్షరాస్యత, వైద్యసదుపాయం, రక్షితనీరు లభ్యత , పోషకాహార లభ్యత, ఉపాధి, కనీసవేతనాల స్థాయి, రైతుల వ్యవసాయోత్పత్తులకు రేట్లు, యూనివర్సిటీలలో జరిగే పరిశోధనలు, – వీటిలో ఏ ఒక్కటీ ' ఆ నెంబర్‌వన్' తాలూకు కొలబద్దగా ఉండదు.

2. మనం అభివృద్ధి చెందాలంటే పెట్టుబడు లను ఆకర్షించాలి. పర్యావరణ రక్షణగాని, ఉపాధికల్పనగాని, కొనుగోలుశక్తి పెంచడం గాని, నైపుణ్యాన్ని పెంచడంగాని లక్ష్యాలుగా ఉండవు. పెట్టుబడిపెట్టేవాడు తన లాభం కోసం వస్తాడేతప్ప మనని అభివృద్ధి చేయడం కోసం కాదనే ఇంగిత జ్ఞానం ఈ వాదనలో ఉండదు.

3. మన రాష్ట్రాన్నిసింగపూర్‌లా అభివృద్ధి చేస్తాం.

40 లక్షల జనాభా గలిగిన ఒక పర్యాటక కేంద్రంగా, ఒక రవాణా హబ్‌గా సింగపూర్ ఉంది. 5 కోట్ల జనాభా గలిగిన వ్యవసాయ ప్రధాన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉంది. ఏనుగుని లేడిపిల్లలాగా మార్చేస్తాం అన్నట్టు ఉంది చంద్రబాబు ప్రకటన. కాని ఎంతోమంది దీనినొక ఉదాత్త లక్ష్యం అని భ్రమపడుతున్నారు. చంద్రబాబు చాలా కష్టపడుతున్నాడు అని సానుభూతి కూడా వ్యక్తం చేస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత కాలంలో 'అభివృద్ధి' గురించిన ప్రచారం ఎంత ఉధృతంగా సాగిందంటే ఆర్థిక కొలబద్దలు కాకుండా ఆహారపు టలవాట్లు, (చెయ్యితో కలుపుకు తినడం కన్నా, స్పూన్‌తో తినడం, పప్పులేదా కూర అన్నం కలిపి తినడం కన్నా ముందు 'సూపు తాగడం వంటివి) నివసించే ఇళ్ల డిజైన్లు, వేసుకునే దుస్తుల ఫ్యాషన్లు, ఇతర సాంస్కృతిక అంశాలు, మనది వెనకబడిపోయిన పేదదేశమేనని మీరు మాట్లాడకుండా వొప్పేసుకునే పరిస్థితి ఏర్పడింది. ఒకసారి



మనం వెనకబడిపోయాం అని ఒప్పేసుకున్నాక ఇక అభివృద్ధి కావాలంటే ఆ సంపన్న దేశాల దయాధర్మాలపైన ఆధారపడక తప్పదనే నిర్ధారణకు కూడా అనివార్యంగా వస్తాము. ఆ 'అభివృద్ధి' కోసం సంపన్న దేశాలతో అనేక ఒప్పందాలు, సంధులు కుదుర్చుకుని 'అభివృద్ధి' కోసం ఎదురుచూడటం మినహా చేసేదేమీ ఉండదు. ఈ ఒప్పందాల రూపంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని బదలాయిస్తామనో, ఆర్థిక సహాయం చేస్తామనో, తక్కువ వడ్డీకి అప్పులిస్తామనో, భారీ మొత్తాల్లో అప్పులిస్తామనో, ఎగుమతులను బాగా పెరిగేటట్టు చేస్తామనో చెప్పి సంపన్నదేశాలు వెనకబడ్డ దేశాలను తమ వలలో ఇరికించుకుంటాయి. నిజంగా ఆర్థికసహాయం వెనకబడ్డ దేశాలకు వస్తే అభ్యంతరం ఏముంటుంది?

కాని ప్రపంచ ఆర్థిక వ్యవస్థను సమగ్రంగా అధ్యయనం చేసిన గ్లోబల్ ఫైనాన్షియల్ ఇంటిగ్రిటీ అనే సంస్థ, నార్వేకు చెందిన ఆర్థిక పరిశోధనా సంస్థ (సెంటర్‌ఫర్ అప్లైడ్ రిసెర్చ్ ఎట్ ది నార్వేయర్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్) 2015లో వెల్లడించిన వాస్తవాలు వేరుగా ఉన్నాయి. 1980 –2015 మధ్య వెనకబడ్డ దేశాల నుండి సంపన్న దేశాలు తరలించుకుపోయిన సొమ్ము 16.3 లక్షల కోట్ల డాలర్లు! ఇందులో అప్పులపై చెల్లించిన వడ్డీయే 4.2 లక్షల కోట్ల డాలర్లు. పేదదేశాలలో నెలకొన్న సమస్యలకి పరిష్కారంగా వ్యాపారసంస్కరణలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అని, దిగుమతులపై ఆంక్షల సడలింపు అని, సుంకాల తగ్గింపు అని, ప్రైవేటీకరణ అని, పెట్టుబడి ప్రవాహంపై ఆంక్షల తొలగింపు అని, జాతీయ కరెన్సీ పూర్తిమారకం అని ఇలా రకరకాల ప్రతికూల సంస్కరణలను సిఫార్సు చేసి, వాటి అమలుకు వత్తిడిచేసి ఇక్కడి సంపదను దోచుకుపోతున్నారు.

ఈ మార్కెట్ చోదిత ప్రపంచంలోని వాతావరణం, ఈ కొత్త సంస్కృతి సృష్టించే వత్తిడి తీవ్రత వల్లనే ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. 1995 తర్వాత గడిచిన 20 సంవత్సరాలలో మనదేశంలో 5 లక్షల మందికి పైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. చేనేత వృత్తిలోని వారుకూడా పెద్దసంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇంతకుముందే ప్రస్తావించిన ప్రతికూల సంస్కరణలకు తోడు సంపన్న దేశాలు అప్పుడప్పుడు హఠాత్తుగా ఇక్కడ తాము పెట్టిన పెట్టుబడులను చెప్పాపెట్టకుండా తరలించుకుపోతాడు. అప్పుడు వెనకబడ్డ పేదదేశం పరిస్థితి ఇంకా హీనం అవుతుంది. ఆ పరిస్థితుల్లో మళ్లీ చేయూతనిచ్చే పేరుతో మరిన్ని విషమ షరతులతో రంగప్రవేశం చేస్తాయి ఈ సంపన్న దేశాలు. మనని ఉద్ధరించడానికే వారంతా వస్తున్నట్టు, తమ కృషితో, చాకచక్యంగా వారిని ఆకర్షించగలిగామని ఇక్కడ చంద్రబాబు, మోడీ అండ్‌కో గొప్పలు పోతూంటారు.

పెట్టుబడిదారీ వ్యవస్థలో అభివృద్ధి ఏనాడూ ప్రపంచవ్యాప్తంగా ఒకేస్థాయికి చేరుకోదని, వెనకబడ్డ దేశాల, ప్రాంతాల దోపిడీ పైనే సంపన్నదేశాల, పెట్టుబడిదారుల సంపద పెరుగుదల ఆధారపడి ఉందని మన అనుభవం స్పష్టం చేస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడి రాక, సాంకేతిక పరిజ్ఞానం బదలాయింపు అనేవి వొట్టి బూటకం అని వెనకబడ్డ దేశాలు క్రమంగా

**❝కార్పొరేట్ పెట్టుబడులు సహజవనరులను స్వాధీన పరుచుకోవడం, జీవవైవిధ్యాన్ని, పర్యావరణ సమతుల్యతను ధ్వంసం చేయడం, తరతరాలుగా స్థానిక ప్రజల జీవనాధారంగా ఉన్న భూముల నుండి, చెరువుల నుండి వారిని వెళ్లగొట్టడం, స్థానిక సంస్కృతిపై దాడిచేయడం, సాంప్రదాయ పరిజ్ఞానాన్ని పరిరక్షించకుండా నాశనం చేయడం, ఆవాస ప్రాంతాలను నివాసయోగ్యంగా లేకుండా ధ్వంసంచేయడం వంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నాయి.❞**



అడవులపై ఆధారపడిన గిరిజనులు

గ్రహిస్తున్నాయి. ఇది వెనకబడిన దేశాల అభివృద్ధి కోసం వచ్చిన విధానం కాదని, సంపన్న దేశాల పెట్టుబడిదారులు చేసే దోపిడీ మరో రూపమని తెలుసుకుంటున్నాయి. ఐతే ఇప్పటికీ కొందరు ఉదారవాద విధానాల సమర్ధకులు ఆశతోనే వున్నారు. సంపన్న దేశాల పెట్టుబడిదారుల బొక్కసాలు నిండి, సంపద పొంగిపొర్లి ఆ ప్రవాహం క్రమంగా ఒక్కో చుక్కగా పేదదేశాలకు వస్తుందనే పనికి మాలిన సిద్ధాంతాన్ని వారు పట్టుకు వేలాడుతున్నారు.

ఇంకోవైపు ప్రభుత్వాలు ప్రజాసంక్షేమ బాధ్యత నుండి క్రమంగా తప్పుకుని వెనక్కి పోతూండడంతో తాగునీరు, ఆహారం, ఆరోగ్యం, విద్య, ప్రజాపంపిణీ, వంటి రంగాలలో ప్రైవేటు మార్కెట్ పైనే ప్రజలు అంతకంతకూ హెచ్చుగా ఆధారపడవలసి వస్తోంది. కార్పొరేట్ పెట్టుబడులుసహజవనరులను స్వాధీనపరుచుకోవడం, జీవవైవిధ్యాన్ని, పర్యావరణ సమతుల్యతను ధ్వంసం చేయడం, తరతరాలుగా స్థానిక ప్రజల జీవనాధారంగా ఉన్న భూముల నుండి, చెరువుల నుండి వారిని వెళ్లగొట్టడం, స్థానిక సంస్కృతిపై దాడిచేయడం, సాంప్రదాయ పరిజ్ఞానాన్ని పరిరక్షించకుండా నాశనం చేయడం, ఆవాసప్రాంతాలను నివాసయోగ్యంగా లేకుండా ధ్వంసంచేయడం వంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నాయి. ఒకప్పుడు విత్తనాలను పరస్పరం ఇచ్చిపుచ్చుకునే రైతాంగం నేడు బహుళజాతి కంపెనీల విత్తనాలనే కొనవలసి వస్తోంది. అవి జీవవైవిధ్యాన్ని ధ్వంసం చేస్తున్నా నిస్సహాయంగా ఉండిపోతున్నారు. పెరిగిపోతున్న ఎరువుల ధరలు వ్యవసాయాన్ని భారంగా మార్చేశాయి. పంటలు బాగా పండిన సందర్భాలలో రేట్లు పడిపోవడం, లేదా కరువుకాటకాలతో పంటలు దెబ్బతినడం – ఏదైనా రైతుకి నష్టమే తప్ప లాభం లేని పరిస్థితి నెలకొంది. ఒకవైపు శతకోటీశ్వరుల వద్ద సంపద అంతులేనంతగా పేరుకుపోతూంటే ఇంకోపక్క దుర్భర దారిద్ర్యం లోకి అంతులేని సంఖ్యలో పేదలు నెట్టబడుతున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంనుండే కాదు, మంచినీటి వ్యాపారం ద్వారా సైతం శతకోటీశ్వరులు తయారవుతున్నారు.

అసమానతలను భరించలేనంతస్థాయికి తీసుకుపోతున్నందున పెట్టుబడిదారీ "అభివృద్ధి" దాని చివరి అంచుకు చేరుకుంటుంది. దానికి తోడు పర్యావరణానికి కలుగుతున్న ఎనలేని హాని ఆందోళనకర స్థాయికి చేరింది. ప్రకృతి ప్రకోపాలు పెరుగుతూ మానవజాతి మనుగడకే ప్రమాదంగా పరిణమిస్తున్నాయి. అందువలన పెట్టుబడిదారీ వ్యవస్థ కూలిపోవడం అనివార్యం అని స్పష్టం అవుతోంది.

## పర్యావరణం – 'అభివృద్ధి'

ప్రస్తుతం కొనసాగుతున్నది ప్రకృతి వనరులను విధ్వంసం చేసే అభివృద్ధి ఇది ఆర్థిక వ్యవస్థపై కొందరి పెత్తనానికి నిదర్శనం. ఎందుకంటే ఈ తరహా అభివృద్ధిలో సామాన్య ప్రజలు తమ జీవనాధారాలను కోల్పోతున్నారు. ఇంకోపక్క పెట్టుబడిదారులు కొత్త సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఎక్కడెక్కడో ఉన్న సహజవనరులన్నింటినీ కొల్లగొడుతున్నారు. ఇంతవరకూ స్థానిక ప్రజల ఆధీనంలో ఉన్న సహజవనరులు ఇప్పుడు వారి చేతుల్లోంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెత్తనం చెలాయించే వారి చేతుల్లోకి పోతున్నాయి. పర్యావరణ సమతుల్యతను పునరుద్ధరించే పేరుతో ప్రపంచబ్యాంకు స్థానిక ప్రజలకు అందించే 'సాయం' నిజానికి ఆ స్థానికులకు ఇంతవరకూ ఉన్న సహజమైన హక్కులను హరించివేస్తోంది. జీవవైవిధ్య అంతర్జాతీయ సంస్థలు ఆయాదేశాలకు ఆర్థికసహాయం చేస్తున్నాయి. నిజానికి ఈ సహాయాన్ని అందు కుంటున్న దేశాలు తమ ప్రకృతి వనరు లపై పెత్తనాన్ని కోల్పోయి అంతర్జాతీయ సంస్థ లకు ఆ పెత్తనాన్ని అప్పజెప్పుతున్నాయి.

"పర్యావరణ సమతుల్యతను కాపాడే అభివృద్ధి" అనే నినాదంతో జరుగుతున్న కార్యక్రమం పర్యవసానంగా ఏ సంపన్న దేశ జిడిపి కూడా తగ్గింది లేదు. అంటే పర్యావరణ పరిరక్షణ పేర ప్రపంచబ్యాంకు వగైరా సంస్థలు గాని, సంపన్న దేశాలు గాని ఆడుతున్న నాటకం అంతా తమ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకేనని స్పష్టం అవుతోంది. అందుకే పేదదేశాలలో లక్షలాది మంది ప్రజానీకం ప్రపంచబ్యాంకు వగైరా సంస్థలు, వారి ఏజెంట్లు చెప్పే 'అభివృద్ధి' ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమాలు చేపడుతున్నారు.

'అభివృద్ధి' ముసుగులో సాగుతున్న ఈ పెట్టుబడి విస్తరణ కార్యక్రమం పర్యవసానంగా అడవులు విధ్వంసమౌతున్నాయి. గిరిజనులకు అటవీ హక్కులు నిరాకరించబడుతున్నాయి. జనావాసాలు నాశనమౌతున్నాయి. జీవనోపాధిని కోల్పోతున్నారు. సంస్కృతి నాశనమై

పోతోంది. తాగునీటి వనరులు కలుషితమైపోతున్నాయి. వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకుంటున్నారు. వీటన్నింటి వలనా నష్టపోతున్న గిరిజనులు, పేదగ్రామీణులు వేరొక దారిలేక ఉద్యమాల బాట పడుతున్నారు. 'మేం ఎలా బతకాలి?' అన్నదే వారి పోరాటాన్నింటిలోనూ ముందు కొస్తున్న ప్రశ్న. మధ్యతరగతి ప్రజలు, మేధావులు, సామాజిక స్పృహ ఉన్న కొన్ని రాజకీయ శక్తులు వీరికి అండగా ఉంటూ సమాజం యొక్క మద్దతు ను కూడగడుతున్నారు.

**'అభివృద్ధి' వికేంద్రీకరణ**

ప్రపంచబ్యాంకు ఎజెండాలో "ప్రాంతీయ స్థాయి అభివృద్ధి" అనే అంశం చోటు చేసుకుంది. చాలామంది ఈ నినాదం చూసి ఇదేదో స్థానిక స్వపరిపాలనను బలోపేతం చేసే ప్రజాస్వామిక మార్పు అని పొరబడ్డారు. కాని నిజానికి ఇది అటువంటిది కాదు. 'పెట్టుబడి అభివృద్ధి' ప్రాజెక్టు నిర్వహణను వికేంద్రీకరించే ప్రణాళిక ఇది. నిజానికి ఇది స్థానిక సంస్థల అధికారాలను కుదించి ప్రేక్షక పాత్రకు దిగజార్చుతుంది. పిపిపి ప్రాజెక్టుపేరుతో, స్వచ్ఛందసంస్థల జోక్యాన్ని పెంచే ఎత్తుగడలతో ఒకపక్క స్థానిక సంస్థలు అమలు చేయవలసిన షరతులను ఏకపక్షంగా విధిస్తూ ఇంకోపక్క ప్రాజెక్టుల నిర్వహణలో ఆస్థానిక సంస్థలకు ఎటువంటి నిర్ణయాత్మక పాత్రా లేకుండా చేస్తున్నారు. ఆయా గ్రామాలలో ఏయే వర్గాలకు, కులాలకు ఆధిపత్యం ఉంటుందో వారి ఆధ్వర్యంలోనే ఈ 'అభివృద్ధి' ప్రాజెక్టులు అమలు జరుగుతున్నాయి. ప్రశ్నించే శక్తిని, విమర్శనాత్మకంగా చూడగలిగే సామర్థ్యా న్ని కోల్పోయిన పేదలు, అణగారిన తరగతులు ఈ పెత్తందారుల సైద్ధాంతిక పెత్తనానికి లోబడి సహాయం కోసం అర్రులు చాస్తున్నారు. దీనికి తోడు కులతత్వం, తెగల మనస్తత్వం, మత తత్వం వంటివి ప్రజల హేతుబద్ధతను దెబ్బ తీస్తున్నాయి. వారిలో సరైన రాజకీయ చైతన్యాన్ని రగుల్కొల్పడానికి ఈ పరిస్థితులు ఆటంకంగా ఉన్నాయి.

**❝సమాజానికి హానికలిగించే చర్యలన్నీ, 'ఔట్ సోర్సింగ్' డౌన్‌సైజింగ్' 'రేషనలైజేషన్' వంటి పదాలతో అమలు జరిగిపోతున్నాయి. సామాన్యప్రజలేమో ఇదంతా అభివృద్ధేనని భ్రమ పడి ప్రతిఘటించకుండా ఆమోదం తెలుపుతున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలోనే ప్రభుత్వాలు ఎన్నికైనట్టు కనపబడుతున్నా, నిజానికి కొద్దిమంది కార్పొరేట్ల చేతుల్లోనే రాజ్యాధికారం ఇరుక్కుపోయింది. "మరింత సామర్థ్యం" పేరుతో వీరు ప్రజల్ని, ప్రజాధనాన్ని దోచేస్తున్నారు.❞**

**పెట్టుబడిదారులతో కుమ్మక్కైన ప్రభుత్వం (క్రోనీ కాపిటలిస్టు స్టేట్)**

ప్రపంచంలో ఈనాటి జాతీయ ప్రభుత్వాలలో పూర్తి నియంతృత్వం చెలాయించేవి తక్కువగా కనబడుతున్నా, వీటిలో అత్యధిక భాగం అప్రజాస్వామికమైనవే. అసమాన ఆర్థిక పరిస్థితులు నెలకొన్న దేశాలలో పెట్టుబడి దారులదే పై చేయిగా ఉంది. పాతకాలపు ఉత్పత్తి విధానాలు, మార్కెట్ విధానాలు దాదాపు ధ్వంసం అయిపోయి, ప్రజానీకం అంతా పెట్టుబడిదారీ మార్కెట్‌తో అనుసంధానం అయిపోయి దాని దయాదాక్షిణ్యాలపై ఆధారపడే స్థితికి చేరారు. రైతులు, చేతివృత్తిదారులు పూర్తిగా మార్కెట్ మాయాజాలపు ఉచ్చులోనే ఇరుక్కుపోయి ఉన్నారు.

ప్రపంచీకరణ క్రమంలో ప్రజా సంక్షేమ రంగాల బాధ్యతల నుంచి ప్రభుత్వం బాహాటంగానే తప్పుకుంటోంది. ఇంకొకపక్క ప్రజల ఆస్తులైన పబ్లిక్ రంగసంస్థలు ప్రైవేటీకరించబడుతున్నాయి. భారతదేశంలో ప్రభుత్వరంగ వాటాల విక్రయం జోరుగా సాగుతోంది. జాతీయ ఆదాయపు వనరులను ఒక్కొక్కటిగా ప్రైవేటు పరం చేస్తూండడంతో ప్రభుత్వానికి ప్రతిఏటా డివిడెండ్లనిచ్చే ఆదాయపు వనరులు హరించుకుపోతున్నాయి. సమాజానికి హానికలిగించే చర్యలన్నీ, 'ఔట్‌సోర్సింగ్' డౌన్‌సైజింగ్' 'రేషనలైజేషన్' వంటి పదాలతో అమలు జరిగిపోతున్నాయి. సామాన్యప్రజలేమో ఇదంతా అభివృద్ధేనని భ్రమ పడి ప్రతిఘటించకుండా ఆమోదం తెలుపుతున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలోనే ప్రభుత్వాలు ఎన్నికైనట్టు కనపబడుతున్నా, నిజానికి కొద్దిమంది కార్పొరేట్ల చేతుల్లోనే రాజ్యాధికారం ఇరుక్కుపోయింది. "మరింత సామర్థ్యం" పేరుతో వీరు ప్రజల్ని, ప్రజాధనాన్ని దోచేస్తున్నారు.

"అభివృద్ధి" అనేపదం మనని చాలా తప్పుదోవపట్టిస్తోంది. అనేక 'ప్రజా వ్యతిరేక' చర్యలను మనం గమనించకుండా చేస్తున్నది. ప్రభుత్వ చర్యలు న్యాయమైనవేనని పలువురు భావించేలా చేస్తున్నది. ప్రజలను, వారి వనరులను కొల్లగొట్టి పెట్టుబడిదారులకు అప్పజెప్పే విధానాల వెనుక ప్రభుత్వ యంత్రాంగం నిర్వహిస్తున్న దుర్మార్గపు పాత్రను ఈ 'అభివృద్ధి' నినాదం కప్పిపుచ్చుతోంది. ఈ క్రమంలో రాజ్యాధికారం సైతం ప్రైవేటీకరించబడుతోంది. ప్రభుత్వ బ్యాంకుల రుణాలను వసూలు చేసే పని, నేర విచారణ చేసే పని వంటివి కూడా ప్రైవేట్ ఏజన్సీలకు అప్పజెప్పున్నారు. అధికార యంత్రాంగం అసమర్థులతో నిండిపోయిందనో, అవినీతిమయమైపోయిందనో, బాధ్యతారాహిత్యంగా ఉందనే పేరుతో ప్రభుత్వం చేపట్టవలసిన పనులను సైతం ప్రైవేటు ఏజన్సీలకు అప్పజెప్తున్నారు.

ప్రత్యేక ఆర్థిక మండళ్ల ఏర్పాటు క్రోనీ క్యాపిటలిజానికి ఒక పెద్ద ఉదాహరణ.. అభివృద్ధి చేస్తామనే పేరుతో ఏర్పాటు చేస్తున్న ఎస్.ఇ.జడ్.లు నిజానికి పెట్టుబడిదారులకు భారీ రాయితీలు, మినహాయింపులు కల్పిస్తున్నాయి. దేశానికి రావాల్సిన ఆదాయం రాకుండా పోతోంది. దీనికితోడు ఎస్.ఇ.జడ్‌లు ఏర్పడిన ప్రాంతాలలో అధికారం కూడా ప్రైవేటు పెట్టుబడిదారులే చెలాయిస్తున్నారు.

బ్యాంకులలోని 'నిరర్థక ఆస్తుల పునర్నిర్మాణం' పేరుతో బ్యాంకు అప్పుల్ని వసూలు చేసేపని ప్రైవేటుపరం చేస్తున్నారు. ఈ ప్రైవేటు సంస్థలు బ్యాంకు అప్పుల్ని వసూలు చేయడం

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, 'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

> **"సామ్రాజ్యవాదం అంటే పెట్టుబడిదారీ విధానపు అత్యున్నతమైన రాజకీయ చట్టబద్ధ రూపం. పెట్టుబడిదారీ దోపిడీ పైపై దశలకు పోతున్న కొద్దీ, ప్రజాస్వామ్య రూపాన్ని కొన సాగించడం అసాధ్యం అయిపోతూ ఉంటుంది. ఈ పెట్టుబడి దారీ రాజకీయ ఆర్థిక విధానం వల్లనే రాజ్యం నియంతృత్వ రూపాన్ని సంతరించుకుంటుంది తప్ప ఒకరిద్దరు వ్యక్తుల తలతిక్క/ దురహంకార పూరిత స్వభావాన్ని బట్టి కాదు."**

కన్నా, మాఫీ చేయడమే ఎక్కువగా చేస్తున్నాయి. ప్రజాధనాన్ని బహిరంగంగా ప్రభుత్వ ప్రోత్సాహంతో చట్టబద్ధంగా దోపిడీ చేయడమంటే ఇదే. ఇదే క్రోనీక్యాపిటలిజం. ఈ మొత్తం ప్రక్రియ పూర్తిగా అప్రజాస్వామిక పద్ధతులలోనే జరుగుతోంది.

**పెట్టుబడిదారీ వ్యవస్థ తాజాదశ**

'నాలెడ్జ్ ఎకానమీ', 'టెక్నో కాపిటలిజం' పేరుతో సాంకేతిక పరిజ్ఞానాన్ని, శాస్త్రీయ విజ్ఞానాన్ని పెట్టుబడి సంచయానికి వాడుకోవడం తాజాదశ. కొత్త ఆవిష్కరణలను, జ్ఞానాన్ని అత్యంత విలువైన 'సరుకు'గా వీటిని ఉత్పత్తి చేయడమే 'పరిశ్రమ'గా ఈ దశ పరిగణిస్తోంది. పేటెంట్లు, మేధోసంపత్తి హక్కుల పేరుతో శాస్త్ర వేత్తల పరిశోధనలు, ఆవిష్కరణలు సరుకుగా మారిపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న లాభాలలో ఈ రంగం ద్వారా వస్తున్నవి అయిదింట నాలుగువంతులు!

పేటెంట్లపేరుతో మేధోసంపత్తి హక్కుల వ్యాపారాన్ని కార్పొరేటీకరణ చేశారు. విజ్ఞానాభివృద్ధి, పరిశోధన ప్రభుత్వాల, ప్రభుత్వ పరిశోధనా సంస్థల పరిధుల నుండి తప్పించి బడా కార్పొరేట్లు చేజిక్కించుకున్నాయి. కార్పొరేట్ సంస్థలు అనేకమంది శాస్త్రవేత్తలను పనుల్లో పెట్టుకుని వారి పరిశోధనలను నియంత్రిస్తున్నాయి. ఆ శాస్త్రవేత్తల ఆవిష్కరణలపై మేధోసంపత్తి హక్కులను ఈ కార్పొరేట్లు కాజేస్తున్నాయి. ఈ మేధో దోపిడీ చట్టబద్ధంగా సాగే విధంగా ప్రపంచవ్యాప్తంగా ఏర్పాట్లు చేసుకున్నాయి. ప్రపంచంలో ఎక్కడెక్కడో ఉన్న మేధావులనందరినీ తమ ఆధీనంలోకి తెచ్చు కుంటున్నాయి.

ఈ కార్పొరేట్ల ఆధీనంలోని పరిశోధనా సంస్థలలో ఎటువంటి ప్రజాస్వామిక వాతావరణమూ లేదు. సాంకేతిక, సైనిక, పారిశ్రామిక కూటములుగా ఈ సంస్థలు పనిచేస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ రంగంలో కొందరిని శతకోటీశ్వరుల్ని చేశాయి. ఆ రంగంలో నిజంగా కృషి చేసిన వారికి ఆ కృషిపై ఎట్టి హక్కు లేకుండా పోయింది. కొన్ని రంగాలలో, కొంతమంది నిపుణలకి ఊహించలేనంత హెచ్చుజీతాలిచ్చి, వారిని ఒక ఆదర్శంగా చిత్రించడం కూడా ఇందులో భాగమే. ఈ మొత్తం ప్రక్రియలో ప్రజా తంత్ర వాతావరణమే లేకుండా నాశనమై పోయింది.

**నిరంకుశత్వాన్ని చట్టబద్ధం చేసే ప్రయత్నాలు**

గత రెండు దశాబ్దాలుగా భారతదేశంలో జరుగుతున్న ప్రయత్నాలు ఈ ప్రజాస్వామిక రాజ్యాన్ని క్రమంగా కార్పొరేట్ శక్తుల ఆధీనంలో పనిచేసే నిరంకుశ వ్యవస్థగా మార్చేస్తున్నాయి. కార్పొరేట్ల పెత్తనం అంటేనే అభివృద్ధి అని నమ్మే జనం దండిగా ఉన్నారు. ఆ విధంగా నమ్మేలా వారిని తయారుచేసింది కూడా ప్రభుత్వ యంత్రాంగమే. దీనికి తోడు కులం, మతం వంటి భావనల నుండి పుట్టుకొచ్చే చీలికలు, అస్తిత్వభావనలు, జాతీయ దురభిమానాన్నే ఒకగొప్ప చైతన్యంగా చిత్రీకరించగలిగిన వాదనలు– ఇవన్నీ కలిసి కార్పొరేట్ పెత్తనాన్ని, నియంతృత్వాన్ని సవాలు చేయకుండా అంగీకరించేలా చేస్తున్నాయి. ఈ ప్రక్రియ అంతా జరగాలంటే రాజకీయ నాయకత్వం కూడా స్వంతంగా ఆస్తులు కూడా బెట్టుకునే వారితో ఏర్పడాలి. అప్పుడే కార్పొరేట్ల పెత్తనం మరుగున పడుతుంది. రాజకీయ ప్రత్యర్థుల పరస్పర అవినీతి ఆరోపణల మాటున కార్పొరేటు దోపిడీ, పెత్తనం చల్లగా సాగిపోతూ ఉంటుంది.

1990 నుంచీ ఈ దేశంలో ప్రజాస్వామ్యాన్ని కుదించి నియంతృత్వాన్ని పెంచే ప్రక్రియ జరుగుతూనే ఉంది. సరళీకరణ, వ్యవస్థీకృత సర్దుబాట్లు, ప్రభుత్వరంగ వాటాల విక్రయం, విద్య, వైద్యం, రవాణా తదితర సేవారంగాల ప్రైవేటీకరణ, ఇవన్నీ ఐఎంఎఫ్ ప్రపంచబ్యాంకు ఆదేశాలు, ప్రపంచవాణిజ్య సంస్థ షరతుల ప్రకారం జరిగిపోతూనే ఉన్నాయి. 1995లో గాట్ ఒప్పందం తర్వాత వేగం మరికాస్త పుంజుకుంది. జరిగిన ఒప్పందాల పర్యవసానంగా సంపన్న దేశాలకే లాభాలు తరలిపోయే పరిస్థితి ఏర్పడింది. ఉన్నత విద్యారంగంలో ప్రైవేటు యూనివర్సిటీల చట్టంగాని, విదేశీ విద్యాసంస్థల చట్టంగాని, ఉన్నత విద్యాసంస్థల క్రమబద్ధీకరణ, పరిశోధనా చట్టంగాని, ఇవన్నీ మనదేశం నుండి సంపదను సంపన్న దేశాలకు తరలించుకుపోడానికి దోహదం చేసేవే.

2013 భూసేకరణ చట్టం, పర్యావరణ నిబంధనలను సరళతరం చేసి గతంలోని ముఖ్యమైన పర్యావరణ రక్షణ చట్టాలన్నింటిని నీరుగార్చే విధంగా జాతీయ పర్యావరణ నిర్వహణ సంస్థ ఏర్పాటు వంటివి ఈ దేశపు భూములను, సహజవనరులను సులువుగా కొల్లగొట్టుకుపోయేందుకు జారీ చేసినవే. ప్రజల నుండి, మేధావుల నుండీ అభ్యంతరాలు వచ్చినా, ఉద్యమాలు జరిగినా ప్రభుత్వం ఈ దిశగా పదే పదే తన ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉంది.

**ముగింపు**

సామ్రాజ్యవాదం అంటే పెట్టుబడిదారీ విధానపు అత్యున్నతమైన రాజకీయ చట్టబద్ధ రూపం. పెట్టుబడిదారీ దోపిడీ పైపై దశలకు పోతున్న కొద్దీ, ప్రజాస్వామ్య రూపాన్ని కొన సాగించడం అసాధ్యం అయిపోతూ ఉంటుంది. ఈ పెట్టుబడిదారీ రాజకీయ ఆర్థిక విధానం వల్లనే రాజ్యం నియంతృత్వ రూపాన్ని సంతరించుకుంటుంది తప్ప ఒకరిద్దరు వ్యక్తుల తలతిక్క / దురహంకార పూరిత స్వభావాన్ని బట్టి కాదు. క్రోనీ క్యాపిటలిస్టు ప్రభుత్వాలకు పెట్టుబడిదారీ అభివృద్ధి మీదే దృష్టి వుంటుంది తప్ప దానికి తోడు సామాజిక, పర్యావరణ న్యాయాన్ని కూడా పెంపొందించాలనే ధ్యాస గానీ, నైతిక బాధ్యత గాని ఉండదు. ప్రజలలో 'అభివృద్ధి' అనే మాట భ్రమలను కలిగించుతూ ఉండగలిగినంత కాలం ఈ పెట్టుబడిదారీ అనమాన అభివృద్ధి జరిగిపోతూనే ఉంటుంది. గిరిజనులు, పేదలు, దళితులు, రైతులు అన్యాయం అయిపోతూనే ఉంటారు. ఎస్. ఇ. జడ్.లు విస్తరిస్తూ కార్పొరేట్ల ప్రత్యక్ష అధికారాన్ని పెంచుకుంటూ పోతూనే ఉంటాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలను, చట్టసభలను స్థానిక సంస్థలను నీరుగారుస్తూ, వాటి అధికారాలను హరిస్తూ నియంతృత్వ చట్టాలు జారీ అవుతూనే ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న టెక్నో– మిలిటరీ – నయాసామ్రాజ్యవాదం ఇలానే కొన సాగితే ప్రజాస్వామ్యం మరణం అనివార్యం. ప్రజాస్వామ్యమా? పెట్టుబడిదారీ విధా నమా? ఏదో ఒకటి ఎంచుకోవలిసిన పరిస్థితి వచ్చింది. పెట్టుబడిదారీ విధానంలోనే 'అభివృద్ధి' సాధ్యపడుతుందనే భ్రమలనుండి బైటపడి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవలసిన తరుణం సమీపించింది.

❃

విశ్లేషణ

# వామపక్షాలది సైద్ధాంతిక ఓటమి కాదు

ప్రొ॥ విజయ్ ప్రసాద్



రచయిత
లెఫ్ట్‌వర్డ్ ఎడిటర్

**2014** లోక్‌సభ ఎన్నికల్లో భారతదేశ వామపక్షాలు నిర్ణయాత్మక ఓటమిని పొందాయన్నది వాస్తవం. కమ్యూనిస్టులు, వారి రాజకీయ భాగస్వామ్యపక్షాలైన వామపక్ష పార్టీలను విశాలమైన అర్థంలో 'వామపక్షం'గా పిలుస్తున్నారు. ఈ విశాల సాంప్రదాయ వామ పక్షాలలో సిపిఐ, సిపిఐ(యం), ఆర్‌యస్‌పి, ఫార్వర్డ్ బ్లాక్, సిపిఐ(యంయల్) లిబరేషన్, యస్‌యుసిఐ,సిపిఐ(మావోయిస్ట్) పార్టీలున్నాయి.

ఆమ్ ఆద్మీపార్టీ వామపక్షం కానప్పటికీ ఈ సంఘటనకు చేరువలో వున్నది . అవినీతి వ్యతిరేక నినాదంతో 2013 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన పార్టీగా అది గుర్తింపును పొందింది. కానీ అనంతరం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఆ వూపును కొనసాగించలేకపోయింది. వామపక్షాల్లో మావోయిస్టులు ఎన్నికల రాజకీయాలను వ్యతిరేకిస్తున్నారు. వారు రహస్యజీవితంలో వున్నారు. సిపిఐ, సిపిఐ(యం), ఆర్‌యస్‌పి, ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీలు తమ మధ్య పలు వ్యూహాత్మక అంశాలపై భిన్నాభిప్రాయాలున్నప్పటికీ తరచూ ఎన్నికల్లో కలసి పనిచేస్తున్నాయి. సిపిఐ(యంయల్) లిబరేషన్ ఒక అండర్ గ్రౌండ్ మావోయిస్టు పార్టీగా వుంటూ కొంత కాలంగా బహిరంగంగా పనిచేస్తున్నది. ఆ పార్టీకి బీహార్, జార్ఖండ్‌లలో కొంత ప్రభావం వున్నది. ఈ కాలంలో సిపిఐ(ఎం) వామపక్షాలలో అతి పెద్దదిగానూ, ప్రజలలో మంచి ప్రభావంగల పార్టీగా వున్నది.

2014 ఎన్నికల్లో త్రిపుర వామపక్ష సంఘటన ఘనవిజయం సాధించింది. కానీ వామపక్ష, ప్రజాతంత్ర సంఘటన కేరళలో ఆశించిన ఫలితాలను నమోదు చేయలేకపోయింది. పశ్చిమ బెంగాల్‌లో ఎనిమిది సంవత్సరాల క్రితం ఆరంభమైన ఓటమి దుష్ప్రభావం ప్రకోపించి వేగంగా ప్రమాదకర పరిధికి చేరింది. రాజకీయ ప్రత్యర్థులు ఓటర్లను భయపెట్టి, ఎన్నికలను తొత్తడం చేయడంవల్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని చెప్పటం సరైనదేకావచ్చు. కానీ ఆ కారణాలే అక్కడి ప్రస్తుత స్థితిని ప్రతిబింబించటంలేదు. 34 సంవత్సరాల వామపక్ష ప్రభుత్వ అవిచ్ఛిన్న పాలన అనంతరం, మమతాబెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) రాజకీయ సైద్ధాంతిక పట్టులోకి పశ్చిమబెంగాల్ జారిపోయింది. ఆధునిక భారతదేశ చరిత్రకు, మరీ ముఖ్యంగా 1991 అనంతరం సరళీకృత విధానాల కాలంలో గుండెకాయ వంటి ఈ పరిణామంపై లోతైన విశ్లేషణ జరగటం ఎంతయినా అవసరం.

2014 ఎన్నికల్లో బిజెపి దేశంలో మూడో వంతులోపు ఓట్లను మాత్రమే పొందగలిగింది. అందుకే బిజెపి సాధించిన విజయానికి సహజంగానే కొన్ని పరిమితులు ఉన్నాయి. ఎక్కువ సీట్లు సాధించిన ఏకైక పార్టీగా ఎన్నికల అనంతర పరిణామాల్లో బిజెపి కేంద్రంలో అధికారాన్ని చేపట్టింది. కేవలం బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ ఈ నాలుగు రాష్ట్రాల్లోనే దేశంలోని 27 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోనూ ఆ పార్టీ సాధించిన సీట్లలో సగం సీట్లున్నాయి. అక్కడ అది స్వల్ప తేడాలతోనే విజయాలను మూటగట్టుకుంది. ప్రతిపక్షాల ఓట్లు బాగా చీలడంవల్ల రాజస్థాన్‌లోని గంగానగర్ స్థానంలో 17మంది పోటీలో వుండగా బిజెపి (46శాతం), కాంగ్రెస్(45శాతం)పై విజయం సాధించింది. బిజెపి అధినాయకుడు మోడీ తాను పోటీ చేసిన వారణాసి, వొడోద్రా రెండు స్థానాల నుండి గెలుపొందారు. వొడోద్రాలో ప్రత్యర్థిపై మోడీ 5.70 లక్షల మెజారిటీని సాధించాడు. అది 2004 ఎన్నికల్లో పశ్చిమబెంగాల్‌లోని ఆరాంబాగ్ నియోజక వర్గంలో సిపిఐ(యం) అభ్యర్థి అనిల్‌బసు సాధించిన వర్తమాన రికార్డు స్థాయి ఆధిక్యత (5.9లక్షలు)కు చేరువలోవుంది. వారణాసిలో ఆప్ అభ్యర్థి అరవింద్ కేజ్రీవాల్‌పై రెట్టింపుకంటే అధిక ఓట్లు(4లక్షలు)తో మోడీ గెలుపొందాడు.

ఈ సంవత్సరం పశ్చిమబెంగాల్ ఆరాంబాగ్ లో అపురూప పొద్దార్(టిఎంసి), శక్తి మోహన్ మాలిక్ (సిపిఐ-ఎం)ను పెద్ద మెజారిటీతో ఓడించాడు. 2014లో ఎన్నికల ఓటమి బెంగాల్ వామపక్ష కూటమికి పెద్ద ఎదురుదెబ్బగా పరిణమించింది. ఆ ఎదురుదెబ్బే ఈ రచనకు ప్రేరణగా నిలిచింది. అది భారత వామపక్షాలైన కమ్యూనిస్టులతో పాటు, సోషలిస్టులు, మావోయిస్టుల రాజకీయ చరిత్రను అంచనా వేసేందుకు ఒక ప్రాతిపదికగా నిలుస్తుంది.

ఎన్నికల్లో బ్యాలెట్ పెట్టెవద్ద వామపక్ష సంఘటన ఓటమిని, వామపక్ష సిద్ధాంతాన్ని ప్రజలు తిరస్కరించడంగా ప్రధాన స్రవంతి ప్రచారం చేస్తున్నది. అంటే 1984లో బిజెపి రెండు సీట్లలో మాత్రమే గెలుపొందడాన్నిబట్టి భారత ఓటర్లు ఆ పార్టీ సిద్ధాంతాన్నంతటినీ తిరస్కరించినట్లు భావించవచ్చా? దానితో పాటు బిజెపి అనుబంధ సంస్థలైన ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్, వనవాసి కళ్యాణ కేంద్రంవంటి సంస్థలు భారతీయ సామాజిక నిర్మాణంలో లోతైన గోతులు తవ్వాయి. 1984లో హిందుత్వను పక్కన పెట్టారని నమ్మించబూనటం వారి మోసపూరిత ఆలోచనల్లో భాగమే. అలాంటి మోసపూరిత భాష్యాలతోనే 'మార్క్సిజాన్ని చరిత్ర చెత్తబుట్టలోకి ప్రజలు నెట్టేసినట్లు' వారు దుష్ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి సామాజిక న్యాయము, మరణశిక్ష వంటి పలు సమస్యలపై మార్క్సిస్టు పార్టీ తీసుకున్న వైఖరులు, భారత ప్రజానీకపు అంతర్జాతీయ అవగాహనలకు అనుగుణంగానే ఉన్నాయి. భారత ప్రజానీకంలో 40 శాతం మరణశిక్షను రద్దు చేయడానికి అనుకూలంగా ఉన్నారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా వామపక్షాలు మాత్రమే తమ వైఖర్లను నిర్ణయించుకుంటున్నాయి. 19వ శతాబ్దం నుండి మార్క్సిజం, కమ్యూనిజాలకు కాలం చెల్లిందంటూ 'మరణ నమోదు ప్రకటనలు' జారీచేస్తూ

> **“నూతన ఆర్థిక విధానాల అమలు వల్ల అసమానతలు పెరుగుతున్నాయి. కులం, మతం, లింగ వివక్ష వంటి సనాతన ఆచారాలు ఉధృతమై సామాజిక జీవితాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పని హక్కును రాజ్యాంగంలో చేర్చాలని, వేతనాలు పెంచాలని, సరైన పని పరిస్థితులను కల్పించాలని, పని ప్రదేశాల్లో లింగ వివక్షతను అరికట్టాలని, కార్మికవర్గ జీవితాల సంరక్షణలపై స్పష్టమైన డిమాండ్లు ఈ ప్రణాళికలో ఉన్నాయి.”**

పలు విషపూరిత రచనలు చేస్తున్నారు. కానీ ఆ సిద్ధాంతాలు ఓటముల నుండి తేరుకుని అజరామరంగా పునరుజ్జీవం పొందుతూ ప్రజల విశ్వాసాన్ని పొందుతున్న వాస్తవాన్ని వారు మరుగుపరుస్తున్నారు.

**శక్తివంతమైన సిపిఐ(యం) ఎన్నికల ప్రణాళిక**

వామపక్ష సంఘటనలో ప్రధాన భాగస్వామిగా ఉన్న సిపిఐ(ఎం) 2014లో విడుదల చేసిన ఎన్నికల ప్రణాళికను జాగ్రత్తగా అధ్యయనంచేస్తే పలు సమస్యల పట్ల వామపక్షాలు అవలంభిస్తున్న సూత్రబద్ధ వైఖరులను సానుభూతితో గమనించగలుగుతారు. ఈ ఎన్నికల ప్రణాళికతో కొందరు మార్క్సిస్టులు లేదా మార్క్సిస్టేతర సోషలిస్టులు భిన్నాభిప్రాయాన్ని కలిగి వుండవచ్చు. భారత సామాజిక అభివృద్ధిపై ఈ ప్రణాళికకు కొన్ని భిన్నమైన అంచనాలు ఉండవచ్చు. నూతన ఆర్థిక విధానాల అమలు వల్ల అసమానతలు పెరుగుతున్నాయి. కులం, మతం, లింగ వివక్ష వంటి సనాతన ఆచారాలు ఉధృతమై సామాజిక జీవితాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పని హక్కును రాజ్యాంగంలో చేర్చాలని, వేతనాలు పెంచాలని, సరైన పని పరిస్థితులను కల్పించాలని, పని ప్రదేశాల్లో లింగ వివక్షతను అరికట్టాలని, కార్మికవర్గ జీవితాల సంరక్షణలపై స్పష్టమైన డిమాండ్లు ఈ ప్రణాళికలో ఉన్నాయి. పంటలపై ప్రమాదకరమైన పురుగుమందుల వినియోగాన్ని నిలిపివేయాలని కూడా అది వక్కాణిస్తున్నది. వీటితోపాటు పెన్షన్ నిధులను స్టాక్ మార్కెట్లకు తరలించడాన్ని నిలిపివేయాలని, భూమిపై హక్కులను పునరుద్ధరించాలని, ప్రతివారికీ గృహవసతి కల్పించాలని, బడ్జెట్ నిధులను సక్రమంగా వినియోగించాలని, ప్రభుత్వ ఖర్చులో 40 శాతం మహిళలకు కేటాయించాలన్న అంశం కూడాపై డిమాండ్లలో భాగంగా వుంది.

ఇంకా సార్వత్రిక ఆరోగ్యాన్ని, ప్రజా రవాణా వ్యవస్థను, ఉమ్మడి ప్రభుత్వ భూములను, పర్యావరణం, గ్రామీణ రహదార్లు, చిన్న రైతుల పరిరక్షణకు తగు వ్యవస్థలను ఏర్పాటు చేయటం తదితర డిమాండ్లతో మ్యానిఫెస్టో నిండి వుంది. వికలాంగులకు, ముస్లిం మైనారిటీలకు, ఆదివాసీలకు పూర్తి హక్కులు కల్పించాలని ఈ నిచ్చెన మెట్ల సామాజిక కుల వ్యవస్థలో అణగారిపోతున్న కులాలకు, యితరులకు తగిన ఊరట లభించాలని, స్వలింగ సంపర్కులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, మహిళల పనికి, జీవనానికి అవసరమైన పూర్తి స్వేచ్ఛ కల్పించాలని, అందుకు న్యాయసమ్మతమైన సామాజిక వాతావరణాన్ని సృష్టించాలని ప్రణాళిక పిలుపునిస్తున్నది. ఫ్రీ సాఫ్ట్‌వేర్ వుద్యమాన్ని ప్రోత్సహించాలని, సైబర్ ప్రపంచాన్ని సైనికమయం చేయడాన్ని అరికట్టాలని ప్రణాళిక కోరుతున్నది. మేధోపరమైన హక్కులను పరిరక్షించాలని, ఆరోగ్యరక్షణ, ఔషధాల ధరలు సామాన్యునికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నది. ఒక స్వతంత్ర విదేశాంగ విధానాన్ని చేపట్టాలని, తద్వారా పాలస్తీనాకు అండగా నిలవాలని, ఇజ్రాయిల్‌తో మిలటరీ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని కూడా ప్రణాళిక డిమాండు చేస్తున్నది.

2014 సిపిఐ(ఎం) ఎన్నికల మానిఫెస్టో ఒక శక్తివంతమైన డాక్యుమెంట్. కానీ మీడియాలో దీనిపై లోతైన అధ్యయనం చేయలేదు. సమగ్ర చర్చ జరపలేదు. కనీసం దీన్ని గురించి ప్రధాన స్రవంతి మీడియాలో ప్రస్తావన కూడా చేయలేదు. ఈ ప్రణాళికకు మించి 'వామపక్ష అజెండా'తో కూడిన వేరొక శక్తివంతమైన డాక్యుమెంట్ కూడా లేదు. చివరకు వామపక్షాలకు అభిమానులైన వ్యాఖ్యాతల్లో కూడా దీనిపై చర్చ జరగలేదు. ఎందువల్ల? కమ్యూనిస్టు వ్యతిరేక ధోరణులున్న కార్పొరేట్ మీడియా సిపిఎం అభిప్రాయాలను కొట్టిపారేసింది. అది కేవలం ఎన్నికల పొత్తులపైనే తన దృష్టిని సారించింది. కొందరు వామపక్ష ఉదారవాద మేధావులు సిపిఐ(ఎం)పట్ల పలు కారణాలవల్ల తమ స్థాయికి తగని వ్యతిరేకతను పెంచుకున్నారు. అందుకే వారు ఈ ప్రణాళిక పట్ల ఎలాంటి శ్రద్ధ చూపలేదు. నేడున్న పరిస్థితుల్లో విశాలమైన ప్రజా పోరాటాల పట్ల అంకిత భావాన్ని కనపరిచే వామపక్ష ప్రణాళిక ఏదైనా ఇంతకంటే సమగ్రంగా ఉండజాలదు. విశాలమైన సామాజిక చట్రంలో యిమిడిపోయి ఏకం కావాలని ప్రజానీకాన్ని ప్రోత్సహించటం ఈ కాలంలో కూడా సాధ్యమేనని ప్రణాళిక ఉద్ఘాటించింది.

దేశవ్యాపితంగా ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో కూడా సిపిఐ(ఎం) నిశిత పరిశీలనా పద్ధతులను అవలంభించింది. సమాజంలో తమ చుట్టూ అలముకున్న ఎలాంటి అవినీతి పొగ సోకని ప్రజా నాయకులను పలువురిని అభ్యర్థులుగా ఆ పార్టీ ఎంపిక చేసింది. తమిళనాడులో సిపిఎం, సిపిఐలతో మాత్రమే ఎన్నికల కూటమి ఏర్పడింది. అక్కడ పార్టీతో సంబంధం వుండి, ప్రజా సంఘాల్లో పనిచేస్తూ, ప్రజాభిమానాన్ని చూరగొన్న అభ్యర్థులనే ఎంపిక చేశారు. ఐద్వా నేతలైన వాసుకి(ఉత్తర చెన్నయ్), ఎస్. తమిళ్ సెల్వి(తంజావూరు)లను అభ్యర్థులుగా ఎన్నికల బరిలో నిలబెట్టారు. దళిత మహిళలు, శ్రామిక మహిళల హక్కుల సాధనకోసం ఐద్వా రాష్ట్రంలో నిర్వహించిన పోరాటాల నుండి ఈ యిద్దరు నాయకులు ఎదిగివచ్చారు. తమిళనాడు అంటరానితనం నిర్మూలన ఫ్రంట్ (టియన్‌యుఇయఫ్)నుండి మరికొందరు నాయకులను ఎన్నికల బరిలో నిలిపారు. వీరు 2007 నుండి దళిత హక్కుల కోసం, అంటరానితనం నుండి సమాజాన్ని విముక్తి చేయడం కోసం జరిగిన పోరాటాల్లో ఆ సామాజిక శక్తుల్లో అభిమాన నాయకులుగా గుర్తించబడ్డారు. అలాంటి వారిలో ఆ సంస్థ ప్రధానకార్యదర్శి ఎ. శామ్యుల్ రాజ్ ముఖ్యులు. దక్షిణ తమిళనాడులో అంటరానితనానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలకు కేంద్రమైన 'విరుధూనగర్' నుండి ఆయనను అభ్యర్థిగా నిలిపారు. సిపిఐ(ఎం) తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి జి. రామకృష్ణన్ తమ పార్టీ కార్యకర్తలు, మద్దతుదార్ల కృషి గురించి యిలా చెప్పారు. “గత యాభై సంవత్సరాలలో వామపక్ష కార్యకర్తలు, వాలంటీర్లు, సానుభూతిపరుల్లో ఇలాంటి వుత్సాహాన్ని చూడలేదు. రోజు రోజుకూ వామపక్ష అభ్యర్థులకు మద్దతు పెరుగుతున్నది. ఈ పరిస్థితులన్నీ తమిళనాడులో వామపక్ష వుద్యమానికి ఎంతో గొప్ప భవిష్యత్ ఉన్నదని తెలియజేస్తున్నాయి. పనిచేయని శాఖల్లోని కార్మికులు ఎంతో ఉత్సాహంగా ఎన్నికల ప్రచార కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఎంతోకాలంగా నిరాశ, నిస్పృహల్లోవున్న సాను

భూతిపరులు యీ కార్యక్రమాలలో పాల్గొనేందుకు వుత్సాహం చూపారు. కానీ యీ అంశాలన్నీ ఎన్నికల విజయాలకు దారితీయలేదు. దీర్ఘ కాలంగా జరుగుతున్న ప్రజా వుద్యమాల ఫలితంగా ప్రజలతో నెలకొన్న లోతైన, స్థిరమైన సంబంధాలను పై అంశాలు పట్టి చూపుతున్నాయి.

పశ్చిమబెంగాల్‌లో 2007 నుండి సిపిఐ (ఎం), వామపక్షకూటమి క్రమంగా ప్రజాపునాదిని కోల్పోతూ ఇబ్బందుల్లో పడసాగింది. 2014లో ఆ సంఘటన తరపున ఎన్నికల బరిలో దిగిన 42 మందిలో 26 మంది కొత్త ముఖాలే. వారిలో అనుభవజ్ఞురాలైన సిపిఐ(యం) నాయకులు సుభాషిణి ఆలీ (బారక్‌పూర్), అతి పిన్నవయస్కుడైన షేక్ ఇబ్రహీం ఆలీ (25) (తాముల్క్) వున్నారు. ఈ క్షేత్రస్థాయి కార్యకర్తలు తృణమూల్ కాంగ్రెస్ (టియంసి)కి చెందిన సినీతారలు, క్రీడాకారులు వంటి సెలబ్రిటీలతో ఎన్నికల్లో తలపడవలసి వచ్చింది. ఈ సెలబ్రిటీలకు కనీస రాజకీయ అనుభవం లేకున్నా ప్రజలను సమీకరించగల ఆకర్షణాశక్తి ఉన్నది. అలాంటి వారితో పోటీచేసిన వామపక్ష అభ్యర్థుల్లో మహమ్మద్ సలీం (రాయ్‌గడ్), బొద్రుడ్డొజా ఖాన్ (ముర్షిదాబాద్)లు మాత్రమే గెలుపొందారు. ఆ రాష్ట్రంలో కమ్యూనిస్టు వుద్యమం ఆరంభ మయ్యాక వామపక్ష కూటమి, సిపిఐ(ఎం)లు ఈ ఎన్నికల్లో అతి పెద్ద అపజయాన్ని ఎదుర్కొన్నాయి.

❝ ఈ ఎన్నికల అపజయాలు కేవలం కమ్యూనిస్టులకే పరిమితం కాలేదు. అనుభవజ్ఞులైన పర్యావరణ పరిరక్షణోద్యమ నాయకురాలు మేధాపట్కర్(ఈశాన్య ముంబయి), న్యూక్లియర్ వ్యతిరేక ప్రచారకులు యస్.ఉదయ్‌కుమార్ (కన్యాకుమారి) ప్రతికూల ఫలితాలు పొందారు. వీరిరువురూ ఆమాద్మీపార్టీ తరపున పోటీ చేశారు. యిలాంటి గౌరవనీయులైన అభ్యర్థులలో కొందరు డిపాజిట్లు కూడా కోల్పోయారు. ❞

ఈ ఎన్నికల అపజయాలు కేవలం కమ్యూనిస్టులకే పరిమితం కాలేదు. అనుభవజ్ఞులైన పర్యావరణ పరిరక్షణోద్యమ నాయకురాలు మేధాపట్కర్(ఈశాన్య ముంబయి), న్యూక్లియర్ వ్యతిరేక ప్రచారకులు యస్.ఉదయ్‌కుమార్ (కన్యాకుమారి) ప్రతికూల ఫలితాలు పొందారు. వీరిరువురూ ఆమాద్మీపార్టీ తరపున పోటీ చేశారు. యిలాంటి గౌరవనీయులైన అభ్యర్థులలో కొందరు డిపాజిట్లు కూడా కోల్పోయారు.

ఇలాంటి నిప్పులాంటి కార్యకర్తలందరూ ప్రజా పోరాటాల నాయకులే. కానీ వారి వారి ప్రాంతాలలో ఆధిపత్య రాజకీయ పార్టీలు సృష్టించిన ఆటంకాలను వారు అధిగమించలేక పోయారు. ఈ అభ్యర్థులు కోట్లకు పడగలెత్తిన వారు కారు. 16వ లోక్‌సభలో రికార్డుస్థాయిలో వున్న నేరచరిత్రగల ఎం.పి.లవలె నేరగాళ్ళు కాదు. అత్యధిక ప్రజల కష్టాలను ప్రతిబింబించే స్పష్టమైన ఎజెండాలతోనే వీరు ప్రజల వద్దకు వస్తున్నారు. కానీ ప్రజల మద్దతును వీరు పొందలేకపోతున్నారు. ఎందువల్ల?


తమిళనాడు ఎన్నికల ప్రచారంలో సిపిఎం కార్యకర్తలు

వామపక్షాల ఓటమిని కేవలం ఎన్నికల్లో బలం తగ్గటంగానే చూడరాదు. అంతకంటే మించిన విశాలమైన అంశంగానే చూడాలి. వామపక్షాల ప్రచారం మూడు ప్రధాన అంశాలపై సాగింది. మొదటిది. పలు భారీ అవినీతి కుంభకోణాలకు అవకాశమిచ్చిన కాంగ్రెస్, బిజెపిలు దేశంలో అమలుపరుస్తున్న నయా సరళీకృత అభివృద్ధి (సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ) అజెండా. రెండవది. భారత సమాజంలోని బహుళత్వాన్ని గుర్తించేందుకు నిరాకరిస్తున్న హిందుత్వ సాంస్కృతిక గుత్తాధిపత్య ధృక్పధం. మూడవది. ఇజ్రాయిల్ నుండి పెద్ద మొత్తంలో ఆయుధాలు కొనుగోళ్లు చేయడంతో సహా అమెరికా వత్తిడికి సాగిలపడుతున్న భారత విదేశాంగ విధానం.

### బిజెపి ఎన్నికల ప్రచార అస్త్రాలు

పై మూడు అంశాల చుట్టూనే బిజెపి ఎన్నికల ప్రచారం కేంద్రీకరించింది. కానీ సరళీకృత విధానాల (యల్‌పిజి) పట్ల తన వైఖరిని బిజెపి తెలివిగా మరుగుపరచింది. కాంగ్రెస్ తన వూగిసలాటలతోను, భారీ అవినీతితోనూ సంస్కరణల ఎజండాను ఆటంకపరచిందని ఆరోపిస్తూ, అది కాంగ్రెస్ వ్యతిరేక ప్రచారానికి పూనుకుంది. బిజెపి చేసిన పై ఆరోపణలేవీ నూతన ఆర్థిక విధానాలను ఎండగట్ట లేదు. ప్రభుత్వం అవినీతితో సంస్కరణలను సంపూర్ణంగా అమలు చేయనందున సరళీకృత విధానాలను ప్రజానుకూలంగా అమలుపరచటంలో కాంగ్రెస్ విఫలమైందని ఆ పార్టీ ఆరోపించింది. ప్రపంచ బ్యాంకు లక్ష్యాలకు అనుగుణంగా కాంగ్రెస్ సుపరిపాలనను, సంస్కరణల ప్రక్రియను అంకితభావంతో అమలుపరచివుంటే, దేశంలో అభివృద్ధిరేటు పెరిగి, భారతీయులు మరింత సంపదలలో తులతూగివుండేవారని బిజెపి ప్రచారంచేసింది.

సంస్కరణలు దేశంలో ప్రతికూల ఫలితాలను యిస్తున్నప్పటికీ, బిజెపి సంధించిన ఈ వాదనలు భారత్‌లో నయా వుదారవాద విధానాలను పదికాలల పాటు కాపాడగలవని భారతీయ కార్పొరేట్లు, ఐ.యం.ఎఫ్. ప్రపంచ బ్యాంకులకు భరోసా లభించింది. ఇతర అంశాలతోపాటు యల్‌పిజి విధానాలకు మైలురాళ్ళు వంటి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను చిల్లర వ్యాపారంలోకి అనుమతించటం వంటి పలు సంస్కరణలకు పార్లమెంట్‌లో మన్‌మోహన్‌సింగ్ ప్రభుత్వం ఆమోదం పొందలేకపోవటం, ఈ క్రమంలో అవినీతి కుంభకోణాలలో కూరుకుపోయి అప్రతిష్టపాలైన కాంగ్రెస్ రాజకీయంగా నీరసించిపోయింది. అందుకే కాంగ్రెస్ స్థానంలో మరోకొత్త ప్రభుత్వం ఏర్పడితే యల్.పి.జి. విధానాలు కొత్త పుంతలు తొక్కుతాయని వారు భావించారు.

రెండు ఆరోపణలను బిజెపి ముందుకు తెచ్చింది. ఒకటి. 2జి స్పెక్ట్రమ్, కామన్‌వెల్త్ క్రీడలు వంటి భారీ కుంభకోణాలు. రెండు. నకిలీ లౌకికతత్వంపేర మైనారిటీలను, అణగారిన కులాలను బుజ్జగించటం. నరేంద్రమోడీ గద్దెనెక్కేందుకు ఎలాంటి రామమందిర రథ యాత్రలు చేసే అవసరం ఏర్పడలేదు. ఆర్.యస్.యస్. సంపూర్ణ సహకారంతో, 2002లో

> **“‘ప్రతిభ’ (మెరిట్) ఆధారంగానే ఎలాంటి వివక్ష లేని స్వేచ్ఛాయుత సమాజాన్ని నిర్మించాల్సిన అవసరం నేడున్నదన్న ‘సందేశం’ కూడా మోడీ సంభాషణల్లో వుందని వారు విశ్లేషిస్తు న్నారు. తరతరాలుగా పీడనకు, దోపిడికి గురౌ తున్న అణగారిన కులాల ప్రజలకు నష్టపరి హారంగా అమలౌతున్న (రిజర్వేషన్‌లు, సబ్‌ప్లాన్ నిధులు వంటి) వివక్షాపూరిత విధానాలను ఉపసంహ రించాలని వారు కోరుతున్నారు.”**

ముఖ్యమంత్రిగా మోడీ గుజరాత్‌లో సాగించిన నరమేధం ఆయన నాయకత్వ సామర్థ్యానికి గొప్ప నమూనాగా నిలిచింది. ఆ సామర్థ్యమే ఎలాంటి రామమందిర రథయాత్రలు లేకుండానే మోడీని ఢిల్లీ గద్దెనెక్కేందుకు అర్హుణ్ణి చేసింది. నాటి ‘హిందుత్వ’ నినాదాన్ని పక్కన పెట్టి, ‘అభివృద్ధి’ మంత్రాన్ని అందుకోవటమే హిందుత్వ శక్తుల విజయానికి మార్గం సుగమం చేసింది. 2004, 2009లో హిందుత్వ చిహ్నాన్ని తనవెంట నడిపిస్తే మతోన్మాదపు మెరుపులు ఓట్లను కురిపించగలవని ఎల్.కె. అద్వానీ విశ్వసిం చారు. నూతన ఆర్థిక విధానాల అమలులో అత్యంత విశ్వాసంతో తన సామర్థ్యాన్ని నిరూ పించుకున్న కాంగ్రెస్, నాడు బిజెపిని అధిగ మించగల్గింది. రామమందిరం పట్ల అనుకూ లత, మండల్ సిఫార్సులపట్ల వ్యతిరేకతలను దరిద్రరేఖకు ఎగువనున్న ఆశావహులైన ప్రజల బుర్రల్లోకి తేలికగా ఎక్కింది. రామమందిరం, కులపరమైన రిజర్వేషన్ సమస్యలను ప్రత్యేకంగా బలవంతంగా వారిపై రుద్దవలసిన అవసరం ఏర్పడలేదు. విశ్వహిందూ పరిషత్ నేత అశోక్ సింఘాల్ ‘ఆజ్‌తక్’ పత్రికా ప్రతినిధి రాహుల్ కన్వాల్‌తో ఇలా చెప్పారు. “తాను గెలిస్తే రామమందిర నిర్మిస్తామని ఎన్నికల ప్రచార సమయంలో 2014 మే 25న మోడీ వ్యక్తిగత సంభాషణలో నాతో చెప్పారు. ఈ కారణంగానే ఉత్తరప్రదేశ్, బీహార్‌లోని హిందుత్వ శ్రేణులు, మోడీ గెలుపుకు ఏకోన్ముఖంగా కృషి చేశాయి. మోడీ అయోధ్యలో నిలబడి తన వాగ్దానాన్ని అమలుపరచాలని వారు కోరడం లేదు. తన చర్యలు ఆదేశాల ద్వారా తన వాగ్దానం అమలు కు నిర్దిష్ట రూపమిచ్చారు.” అవినీతికి వ్యతిరేకంగా మోడీ నినాదాలు, ఉపన్యాసాలు కేవలం కుంభకోణాల పట్ల వ్యతిరేకతను సృష్టించేవి మాత్రమే కాదని పలువురు హిందువులు నమ్ము తున్నారు.

‘ప్రతిభ’ (మెరిట్) ఆధారంగానే ఎలాంటి వివక్ష లేని స్వేచ్ఛాయుత సమాజాన్ని నిర్మించాల్సి న అవసరం నేడున్నదన్న ‘సందేశం’ కూడా మోడీ సంభాషణల్లో వుందని వారు విశ్లేషిస్తు న్నారు. తరతరాలుగా పీడనకు, దోపిడికి గురౌ తున్న అణగారిన కులాల ప్రజలకు నష్టపరి హారంగా అమలౌతున్న (రిజర్వేషన్‌లు, సబ్‌ప్లాన్ నిధులు వంటి) వివక్షాపూరిత విధానాలను వుపసంహరించాలని వారు కోరుతున్నారు. “హిందుత్వ ఎవరి ఆధిపత్యానికీ ఆటంకం కాదని, అది అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తుందని, గౌరవనీయ వ్యక్తులకు అసమాన ప్రపంచంలో సమానత్వం పొందటం ఒక అదృష్టమని” అద్వా నీ, అతని అనుచర బృందం ప్రచారం చేసింది.

మోడీ ఒక అభివృద్ధి మనిషి(వికాస్ పురుష్) గా అభిషేకించబడ్డాడు. సమాజంలో ఒక భాగాని కి సమాన అవకాశాలు పొందే సమయం దూసు కొచ్చింది. కాంగ్రెసు తన ప్రకటిత లక్ష్యాల అమలుకు చిత్తశుద్ధితో పని చేస్తుందన్న నమ్మకం యువతలో అత్యధికులకు లేదు. కాంగ్రెస్ సాధించానంటున్న గొప్పల్లోని లోపాలను ఎత్తి చూపేందుకు,బిజెపి నుండి సంభవించే సామాజిక అనర్థాలు, ఆర్థిక అతిశయోక్తులు పై హెచ్చరికలు చేసే స్థాయికే వామపక్షం చౌరవ పరిమిత మయ్యింది. ప్రజల దృష్టిలో, వామపక్షాలు మొక్కుబడిగా వుండే ప్రత్యామ్నాయాలను ప్రతిపాదించగల స్థితిలోనే వున్నాయి. కానీ అవి భౌతిక శక్తిగా మారే అవకాశం కన్పించలేదు. ప్రత్యామ్నాయ విధానాల స్వప్నాలను ఈ ‘వాస్తవికత’ బలహీనపరుస్తున్నది. దీన్నొక సైద్ధాం తిక ఓటమిగానే ఎవరైనా గుర్తించాలి. అంటే దాని అర్థం బిజెపి ప్రచారాలను ఆమోదించా లని మాత్రం కాదు. భారత్‌లో అభివృద్ధి పరిధి కున్న అవకాశాలను సరళీకృత విధానాలు నిర్ణయిస్తున్నాయి.

వామపక్ష ప్రతినిధులు ఎంత తక్కువ సంఖ్యలో (మొదటి లోక్‌సభలో వలె)వున్నా, 16వ లోక్‌సభలో వారు ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నారు. 1952లో కమ్యూనిస్టు పార్టీ తరపున పార్లమెంటులో 16 మంది సభ్యులు న్నారు. ఇది ఆ కాలపు పార్టీ బృహత్తర కృషి వల్లనే సాధ్యమయింది. నాటి అవిభక్త బెంగాల్, మద్రాసు రాష్ట్రాల (నేటి ఆంధ్రప్రదేశ్), కేరళ, త్రిపుర, ఒరిస్సా నుండి ఈ సభ్యులు ఎన్నిక య్యారు. కిసాన్‌సభ నాయకుడు బిజయ్ చంద్ర దాస్ ఒరిస్సా నుండి ఎన్నికయ్యారు. మొదటి తరం కమ్యూనిస్టు ఎం.పి.లకు చట్టసభల అను భవం లేదు. కానీ కాంగ్రెస్ వారికి 1937 నుండి ప్రావిన్స్ (అవిభక్త రాష్ట్రాలు)లలో పాలించిన అనుభవం వుంది. ఈ అంశంపై కమ్యూనిస్టుపార్టీ పార్లమెంటరీ విభాగం నాయకులు ఎ.కె. గోపాలన్, హిరేన్ ముఖర్జీలు ఇలా చెప్పారు.“వాస్తవం చెప్పాలంటే పార్లమెం టరీ వ్యవహారాల్లోని మెళకువలను నేర్చుకునేం దుకు, ఈ రంగంలో ప్రవీణులని గుర్తింపు పొందిన ఇతరులను ఓడించేందుకు మాకు ఎక్కువ సమయం పట్టలేదు. మేం పార్లమెంటుకు కొత్తవారమన్నది వాస్తవం. ఐనా ప్రజలతో మాకు సజీవ సంబంధాలున్నందున ప్రారంభం లో కొంత జంకుగా వున్నప్పటికీ మాపై దాడిచేస్తూ, నిందలు మోపేవారి నుండి కూడా మాకు గౌరవం లభించేది.”

ఇలాంటి సత్‌సాంప్రదాయాల నుండి నేటితరం వామపక్ష ఎంపిలు నేర్చుకోవాలి. ప్రజా జీవితాలను, వారి సంక్షేమాన్ని ప్రమా దకర స్థాయికి నెడుతున్న బిజెపి విధానాలను 16వ లోక్‌సభలోని వామపక్ష ఎం.పి.లు ఎండగట్టాల్సిన అవసరం ఎంతయినా వుంది. గత మూడు దశాబ్దాలలో పార్లమెంట్‌లో బాధ్య త గల ప్రతిపక్షంగా వామపక్షం ముసాయిదా బిల్లులను అధ్యయనం చేస్తూ, వాటి ప్రభావాలను నికరంగా ఛాలెంజ్ చేస్తున్నది.


గ్యాస్ ధరలు, ఆదివాసీల నుండి భూములు గుంజుకొని ప్రైవేట్ మైనింగ్ సంస్థలకు కట్టబెట్టడం వంటి సమస్యలపై ప్రభుత్వ, ప్రైవేట్ ఏజెన్సీల మధ్య లాభసాటి ఒప్పందాలు కుదర్చటం ద్వారా ప్రజల సొమ్మును కైంకర్యం చేస్తున్నారు. కష్టించి నిజాయితీగా కృషిచేసే కమ్యూనిస్టు పార్లమెంట్ సభ్యులు ఇలాంటి ప్రజా వ్యతిరేక ఒప్పందాల గుట్టు విప్పుతున్నారు. ప్రభుత్వాన్నిప్రశ్నించే హక్కును వినియోగించుకుని లేదా సమస్యలపై లోతైన సాక్ష్యాలు కనుగొనేం దుకు వుద్దేశించిన పలు ‘కమిషన్’ల ప్రతిపాదిత జాబితాలలో స్థానం పొందటానికి చేసే ప్రయ త్నాలను చులకనగా చూడరాదు. క్షేత్రస్థాయిలో సమస్యలపై జరిగే ప్రజా వుద్యమాలలో కమ్యూని స్టులు భాగస్వాములు. కానీ ప్రభుత్వం వద్దగల కీలక ఫైళ్లను పరిశీలించి ఆ సమాచారంతో తమ సమాచారాలను బేరీజు

వేసుకునేందుకు వీరికి తరచూ అవకాశం వుండదు. చిల్లర వ్యాపారంలోనూ, రక్షణ రంగంలోనూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవేశంపై బహిరంగ చర్చ పెట్టాలని డిమాండ్ చేయవచ్చు. ఈ అంశంపై ప్రభుత్వాన్ని ఎండగట్టే ప్రశ్నలను సంధించవచ్చు.

పార్లమెంట్ గౌరవాలతో నిమిత్తం లేకుండానే, కార్పొరేట్‌శక్తుల మత్తులోవున్న మీడియా భ్రమల వత్తిడికి లొంగి, ఆ సంస్థలపై నిఘా వేసే పాత్రను బలహీనపరుస్తున్నది. 16వ లోక్‌సభ సభ్యులలోని చిన్న భాగంతో మాత్రమే లెఫ్ట్ సభ్యులు తలపడగలరు. కానీ అక్కడ చేరిన ఇతర రాజకీయ పార్టీలలో ఆర్థికాంశాలలో అగ్రగణ్యులుగా చెప్పబడుతున్న వారందరినీ కమ్యూనిస్టు సభ్యుడు ఒక్కరైనా నిలేయగల నాణ్యత, విషయ స్పష్టత వుంది. శ్రామిక ప్రజల హక్కుల విషయంలో 12మంది వామపక్ష సభ్యులు నిరంతరం జాగురూకతతో వుండాలి.

“ఒక నెలలోనే రక్షణ, మౌలిక సదుపాయాలు, రిటైల్ వ్యాపారం, బ్యాంకింగ్ రంగాల్లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించాలన్న పథకంతో మోడీ ప్రభుత్వం ముందుకు సాగింది. హిందుత్వ, దాని స్వదేశీ విభాగం, స్వదేశీ జాగరణ్ మంచ్, దాని కార్మిక విభాగం బిఎంఎస్‌ల ద్వారా ఒక రాజకీయ వేదిక ఏర్పాటుకు కొన్ని సాహసోపేత చర్యలకు పూనుకున్నట్టు ప్రకటించారు.”

ఒక నెలలోనే రక్షణ, మౌలిక సదుపాయాలు, రిటైల్ వ్యాపారం, బ్యాంకింగ్ రంగాల్లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించాలన్న పథకంతో మోడీ ప్రభుత్వం ముందుకు సాగింది. హిందుత్వ, దాని స్వదేశీ విభాగం, స్వదేశీ జాగరణ్ మంచ్, దాని కార్మిక విభాగం బిఎంఎస్‌ల ద్వారా ఒక రాజకీయ వేదిక ఏర్పాటుకు కొన్ని సాహసోపేత చర్యలకు పూనుకున్నట్టు ప్రకటించారు. బిజెపికి మిత్రులైన మేధావులు, గతం నుండీ దేశం స్వయం సమృద్ధం కావాలన్న అంశంపట్ల, బిజెపి మిత్రులైన మేధావులు, చివరకు ఒకనాడు ఈ అంశాన్ని బలంగా సమర్థించిన ఆర్‌ఎస్‌ఎస్ కూడా వుక్కిరి బిక్కిరౌతున్నది. లార్డ్ మేఘనాద్ దేశాయ్ బిజినెస్ పత్రికతో ఇలా చెప్పారు. “స్వదేశీ నినాదంతో పూర్తిగా కాలం వృధా చేసుకోవటమే అవుతుందని శలవిచ్చారు. ఆర్‌ఎస్‌ఎస్‌లో ఒక భాగం స్వదేశీకి కట్టుబడి వుంది. వారిలో అత్యంత ఆధునికులనబడేవారు



లోక్‌సభలో మాట్లాడుతున్న సిపిఎం ఎంపి మహమ్మద్ సలీం

దానికి దూరమయ్యారు. తమది జాతీయ ప్రభుత్వంగా ఘనంగా ప్రకటించుకునేవారు రక్షణ రంగంలో నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వుండాలని మాట్లాడుతున్నారు. ఒకనాడు వీరే విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా వ్యతిరేకించారు. అదే బిజెపి ఇప్పుడు ఐఎంఎఫ్ ప్రేరిత విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అగ్రభాగాన వుండే సంస్కరణల ఎజండాలో పూర్తిగా కూరుకుపోయింది. దాన్ని నిలువరించేందుకు వామపక్ష ఎం.పి.లు పార్లమెంట్‌లో అప్రమత్తంగా వుండాలి. బయట పార్లమెంటరీయేతర పోరాటాలను పెద్ద ఎత్తున నిర్వహించాలి.

తమకు ప్రజలు సంపూర్ణ మెజారిటీతో అధికారం కట్టబెట్టినట్లు ఫోజుపెట్టి బిజెపి పాలన సాగిస్తున్నది. పలు సాంస్కృతిక మంత్రి వర్గ విభాగాల్లోకి తన సైద్ధాంతిక భావజాల మున్న వుద్దండులను దట్టించే ప్రయత్నాలు ప్రారంభించింది. “ఇండియన్ కౌన్సిల్ ఫర్ హిస్టారికల్ రిసెర్చ్ విభాగా”నికి ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన ఆర్.ఎస్. రావును నియమించారు. అతని పరిశోధనాంశం ‘మహాభారతం తేదీ’ని నిర్ణయించటం. సంస్కృత సాహిత్యంలో ఈ పరిశోధన పత్రం కేంద్రంగా పెద్ద రగడ నడిచింది. అతని నియామకం ‘పిల్లిని పావురాల బోనులలో బంధించినట్ల’యింది. భారత్‌లో ప్రభుత్వేతర సంస్థలు (ఎన్‌జివో) పనితీరుపై గూఢచారి సంస్థ ఇచ్చిన నివేదికలను అధికారయుతంగా లీక్ చేసింది. అలాంటి సంస్థల్లో ప్రజా వుద్యమాలను, పోరాటాలను నడిపిన పాత్రగల ‘గ్రీన్‌పీస్’, ‘యాక్షన్ యాసిడ్’, ‘ఆమ్నెస్టీ ఇంటర్‌నేషనల్’ సంస్థలున్నాయి. సుప్రీం కోర్టులో గోపాల సుబ్రమణ్యం నియామకానికి బిజెపి ప్రభుత్వం అడ్డుకట్టవేసింది. ఆ విషయమై సుబ్రమణ్యం ఇలా చెబుతున్నారు. “గుజరాత్‌లో సోహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసును నేనొక స్వార్థరహిత సలహాదారుగా వాదించాను. అందువల్ల నాడు గుజరాత్ ముఖ్యమంత్రిగా నేటి ప్రధాని మోడీ, నేటి బిజెపి అధ్యక్షుడు అమిత్‌షాల ప్రతిష్ట దిగజారింది.” తనకు ప్రజలిచ్చిన స్వల్ప ఆధిక్యతను, సంపూర్ణ మెజారిటీగా చూపిస్తూ మోడీ ప్రభుత్వం పాలన సాగిస్తున్నది. 2014లో బిజెపికి 31శాతం ఓట్లు మాత్రమే లభించాయి. అంటే ‘బహుళత్వం’ ప్రతిబింబించేలా భారతీయులు బిజెపిని అధికారానికి తేలేదు. బిజెపికి ఓటు చేయని మెజారిటీ ప్రజలను మేల్కొల్పటానికి పెద్ద కృషి చేయవలసి వుంది. విజయోన్మాదంతో పాలన కొనసాగిస్తున్న బిజెపి ప్రయత్నాలను ప్రతి ఘటించేందుకు వారిని సన్నద్ధం చేయవలసివుంది.

**అనువాదం: వై సిద్ధయ్య**

## అభిప్రాయం

## ప్రమాదం అంచున వ్యవసాయం

“మన వ్యవసాయం ఏం కానుంది’ వ్యాసం అందరు చదవాలి. రాబోయే కాలంలో వ్యవసాయం భవిష్యత్తు ఏలా వుంటుందో చాలా వివరంగా ఉంది. ఉదారవాద విధానాలు అమలు జరిగి రాబోవు కాలంలో ప్రజలు తీవ్ర సంక్షోభంలో పడతారు. 1997 నుండి ఇప్పటివరకు దేశంలో 3లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా వుందో అర్థం అవుతుంది. ఒకప్పుడు 70 శాతం ప్రజలు గ్రామాలలో వుండేవారు. నేడు వలసలు పెరిగాయి. కొనసాగుతున్నాయి. మెగానగరాలు పట్టణాలు వస్తాయి. గ్రామాలు కనుమరుగు అవుతాయి. బహుళ జాతిసంస్థలు మనల్ని శాసిస్తాయి. భవిష్యత్తు సమాచారం అందించిన ఎమ్‌విఎస్ శర్మగారికి అభినందనలు.

– **తుంపాల శ్రీరామమూర్తి**, గాజువాక.

మతోన్మాదం

# సావర్కర్ ‘వీరత్వం’



రచయిత సుప్రీంకోర్టు
విశ్రాంత న్యాయమూర్తి

**ఏజి నూరాని**

“నమోదు చేయబడిన వాస్తవాలు ఒక్కొక్కటీ వెలుగులు చిమ్ముతూ ఎగిసిపడుతున్నా కూడా అతను ఏమాత్రం సిగ్గు పడడు” అన్నదో పాత సామెత. వీర్ సావర్కర్ విషయంలో జరిగిందిదే. నమోదు చేయబడ్డ ప్రతి విషయం లోనూ ఆయన చేసిన మోసం చూపిన వైషమ్యం, హత్యల పథక రచనల వ్యసనం బయటపడుతున్నాయి. ఆయన 1966లో కన్నుమూశారు. ఆ తరువాతి సంవత్సరం గోపాల్ గాడ్సే, గాంధీని చంపిన నాథురాం గోడ్సే అన్నదమ్ముడు, అతని సహ నిందితుడు, “గాంధీ హత్య–నేను” అని ఓ పుస్తకం రాశాడు. అందులో గాంధీ హత్యకు సంబంధించిన కేసులో నాథురాంకి సావర్కర్‌కి ఏ సంబంధం లేదని చెప్పడానికి ఏంతో కష్టపడ్డట్టు చెప్పుకున్నారు. సెషన్స్ జడ్జి సావర్కర్‌ని శిక్షించేందుకు సరిపడా సాక్ష్యాలు లేవని విడుదల చేసారు. అప్రువర్‌గా మారిన బాగ్డే ఇచ్చిన సాక్ష్యం పూర్తిగా నమ్మి ఆధారపడడానికి అవకాశం ఉన్నా చట్టరీత్యా స్వతంత్ర ధ్రువీకరణ అవసరం ఉన్నందువలన సావర్కర్ విడుదల చేయబడ్డారు. సావర్కర్ వ్యక్తిగత రక్షకుడు అయిన అప్పు రామచంద్ర కేసర్, ఆయన కార్యదర్శి గజానన విష్ణు దంబెల్, కోర్టులో సావర్కర్‌కి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పలేదు. వారు సావర్కర్ చనిపోయిన తరువాత మాత్రమే జస్టిస్ కపూర్ ముందు నిజం ఒప్పుకున్నారు. సావర్కర్‌కి వ్యతిరేకంగా ఎన్నో సాక్ష్యాలు ఉన్నప్పటికీ అవి కోర్టుకు అందుబాటులో లేవు.

1975లో భారతదేశ ప్రభుత్వం విద్యా మంత్రిత్వ శాఖ ప్రాచీన దస్తావేజుల ఆధారంగా ఒక పుస్తకాన్ని ప్రచురించింది. దీనిని ‘పీనల్ సెటిల్మెంట్స్’ అనే పేరుతో, ఆర్.సి. మజుందార్ అనే చరిత్ర కారుడు వ్రాసారు. ఆయన హిందూ మత పక్షపాతి. ఆయన చరిత్రను వీలయినంత ఎక్కువగా సావర్కర్‌కి అనుగుణంగా మలిచారు. అయితే పత్రాల అధారాలు ఉన్నచోట నిస్సహాయుడయ్యాడు. వెలుగుచూసిన పత్రాలు వీర్ సావర్కర్ వీరత్వాన్ని పూర్తిగా బహిర్గతం చేసాయి. ప్రస్తుత సంఘ్ పరివార్ సావర్కర్ గుర్తింపు తమ గుర్తింపుగా చూసుకుంటున్నా, సావర్కర్ అతని జీవిత కాలంలో అప్పటి ప్రభువులకు ఎన్నెన్ని క్షమాభిక్షలకు అభ్యర్థనలు పంపారో, ఎన్ని రకాలుగా పూచికత్తుపై విడుదల కావడానికి ప్రయత్నాలు చేసారో మొదటిసారిగా ఆ పత్రాలే బహిర్గతం చేసాయి. నిజానికి ఈనాటికీ అతనిలో సంఘ్ పరివార్ తమ భావాలను, విలువలను ప్రతిబింబించగల ఒక మూర్తిని చూసుకుంటున్నారు.

భారతదేశ ప్రజల ఆకాంక్షల పట్ల సానుభూతిగా ఉన్న అప్పటి నాసిక్ జిల్లా కలెక్టర్ ఏ.టి.ఎం. జాక్సన్‌ని హత్య చేసినట్టు రుజువు కావడంతో సావర్కర్‌కి శిక్ష ఖరారైంది. సావర్కర్‌ని అండమాన్ జైలుకు 1911లో తరలించారు. సావర్కర్ కుట్ర పన్నిన హత్యలలో ఈ ఒక్క హత్య కేసులోనే శిక్ష పడింది. మిగిలిన మూడు హత్యకేసుల్లో ఆయన తప్పించుకున్నారు. 1909లో కర్జన్, 1931లో ఎర్నెస్ట్ హాట్సన్‌పై హత్యా ప్రయత్నం (బులెట్ ప్రూఫ్ తొడుగుతో రక్షించబడ్డారు), 1948 జనవరి 30న గాంధీపై జరిగిన హత్యాయత్నం – ప్రతిసారి హత్యకు ప్రేరేపించేది సావర్కర్. కానీ తుపాకీలు వేరే ఎవరో నొక్కుతారు.

1911–1950 మధ్యకాలంలో సావర్కర్ ఇచ్చిన క్షమాపత్రాలు, పూచీకత్తుల పట్టి ఈ కింద ఇవ్వడం జరిగింది. ఈయన నాలుగు దశాబ్దాల “వీరుని” చరిత్రకు గుర్తుగానే మన పార్లమెంటులో అయన రాజకీయ అనుయాయులు అతను చంపేందుకు పథకం రచించిన ఆ గాంధీకి ఎదురుగా ఈయన చిత్రపటాన్ని పెట్టడం జరిగింది.

1. 1911 జులై 4న సావర్కర్ అండమాన్‌లోని సెల్యూలర్ జైలుకి తరలించబడ్డారు. ఆరునెలలు కాకముందే ఆయన క్షమాభిక్షకు దరఖాస్తు చేసుకున్నారు.

2. 1913 అక్టోబర్‌లో, వైస్రాయ్ ఎక్సిక్యూటివ్ కౌన్సిల్ హోంమంత్రి, సర్.రెజినాల్డ్ క్రడాక్, జైలును సందర్శించినపుడు కలుసుకున్నవారిలో సావర్కర్ కూడా ఉన్నారు. 1913, నవంబర్ 23న ఆయన వ్రాసిన నోట్‌లో సావర్కర్ క్షమాభిక్షను గురించి వ్రాశారు. సావర్కర్ తన రెండో క్షమాభిక్ష పత్రాన్ని 1913 నవంబర్ 14వ తేదీ సమర్పించారు. “ప్రభుత్వం ఏ హోదాలో నన్ను సేవ చేయమన్నా నేను సిద్ధమే. తండ్రిలాంటి ప్రభుత్వ ద్వారాలకు తప్పిపోయిన ఈ కొడుకు మరే విధంగా చేరగలడు..?” అంటూ ప్రాధేయపడ్డారు. “విప్లవవీరుడు”, “జాతీయవాది” అయినా సావర్కర్ గురించి క్రడాక్ ఈ విధంగా వ్రాసారు “సావర్కర్ దరఖాస్తు చేసుకున్నది క్షమాభిక్ష కోసం”. ఇదే తరహా ఆ తరువాత కాలంలో కూడా కొనసాగింది.

3. 1920 మార్చ్ 22న, సావర్కర్ మద్దతుదారుడు, జి.ఎస్.ఖోపర్డే, ఇంపీరియల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో ఒక ప్రశ్న లేవనెత్తారు. అందులో ఇలా ఉంది: “1915లో ఒకసారి 1918లో మరోసారి సావర్కర్ ఆయన అన్న ప్రభుత్వానికి తాము యుద్ధ సమయంలో సైన్యాన్ని సమకూర్చి పెట్టి ప్రభువులకు సేవ చేస్తామని, జైలు నుండి విడుదల అయితే సంస్కరణల బిల్ పాస్ అయిన వెంటనే ఆ చట్టాన్ని విజయవంతం చేయడానికి, శాంతి నెలకొల్పేందుకు సహకరిస్తామని దరఖాస్తు పెట్టుకున్న మాట నిజం కాదా? దానికి సమాధానంగా హోం సభ్యుడు, సర్ విలియం విన్సన్ట్ వినాయక్ దామోదర్ సావర్కర్ నుండి రెండు పిటిషన్లు పోర్ట్ బ్లైర్ సూపర్ ఇంటెండెంట్ ద్వారా అందిన మాట నిజమే. 1914లో ఒకటి 1917లో మరొకటి. మొదటి దానిలో ఆయన యుద్ధంలో ఏ రకమయిన సేవలు చేయడానికయినా సంసిద్ధతను తెలియ చేసి తనకు, మిగిలిన రాజకీయలందరికీ ఖైదీలకు కూడా సాధారణ క్షమాభిక్ష పెట్టమని అభ్యర్థించారు. రెండో పిటిషన్‌లో కేవలం రెండో విషయా నికే పరిమితమయ్యారు. “అంటే 1913తో పాటు 1917లో కూడా క్షమాభిక్షను అభ్యర్థించారు. 1914 అని విన్సన్ట్ అన్నది

1913లో పెట్టిన పిటిషన్ గురించే అయి ఉండవచ్చు.

4. 1920 మార్చి 30వ తేదీన మరో క్షమాభిక్ష పత్రం మొదటిసారిగా ప్రచురించబడింది. ఇది రచయిత ముందు ప్రచురించిన పుస్తకంలో లేదు. ఈ పిటిషన్ అయితే పూర్తిగా యాచించడమే. "ఇక విన్నవించుకోడానికి అవకాశం ఉన్న చివరిసారి ఇదే" అని బెదిరించారు. సావర్కర్ డిసెంట్రీ నుండి అయిదు నెలల క్రింద బాగుపడ్డారని విన్సెన్ట్ వెల్లడించారు. అతని ప్రాణానికి ఏమాత్రం ముప్పు లేదు. అతను తనను విడుదల చేయడానికి కొంతమంది ఇతర ఖైదీలను ఉదాహరణగా కూడా చూపారు" అన్నదమ్ముడు అరోబిందో ఘోష్, పోర్ట్ బ్లెయిర్‌లో తీవ్రమైన హత్యాయత్నం నేరం మోపబడినవాడు. తనేమో విధేయుడు." "తీవ్రవాది అవ్వడం అటుంచి కనీసం కూర్పట్కిన్, టాల్స్టాయ్‌లాంటి శాంతి, తాత్వికతకి సంబంధించిన అరాచకవాది కూడా కాదు." ఇంకా ఇలామొరపెట్టుకున్నాడు "నా గత విప్లవ ధోరణిని గమనించండి– ఇప్పుడేదో క్షమాభిక్ష అడుగు తున్నందువలననే కాదు, చాలా ఏళ్ల కిందటే ప్రభుత్వానికి సమర్పించిన (1918, 1914) నా పిటిషన్లలో శ్రీ మోంటేగ్ రూపొందించబోయే రాజ్యాంగానికి నేను కట్టుబడి పని చేస్తానని, దానికి అండగా ఉంటానని ప్రభుత్వానికి నేను తెలియచేసాను" అని ఆయన సూచించిన సంస్కరణలు నా ఆలోచనలను, ప్రకటనను మరింతగా ధ్రువపరిచాయి. ఈ మధ్యనే నేను రాజ్యాంగబద్ధంగా ఉంటానని, అభివృద్ధికి కృషి చేస్తానని, బాహాటంగా ప్రకటించాను."

ఎందుకయినా మంచిదని మరో మాట కూడా చేర్చారు "నేను రాజ్యాంగం బాటలో నడవడానికి మనస్ఫూర్తిగా ఇష్టపడుతున్నట్టు నిజంగా చెప్తున్నాను. నా చేతనైనంతగా బ్రిటిష్ ప్రభుత్వం యెడల ప్రేమను గౌరవాన్ని పెంచుకోడానికి ప్రయత్నిస్తానని" సవినయంగా మనవి చేస్తున్నాను. సహకారాన్ని కూడా పెంచుకుందాం. ప్రకటించబడినటువంటి 'రాజ్యం' నా హృదయాన్ని గెలుచుకుంది. "అదీ అతని జాతీయత!

ముగింపులో సావర్కర్ "ఇకపై ప్రభుత్వం నిర్దిష్టంగా, సహేతుకంగా సూచించినంత కాలం ఏ రకమైన రాజకీయాలలో పాల్గొనకపోవడానికి నేను, నా అన్న సంసిద్ధులుగా ఉన్నాము. ఇది కాక ఇతర ఏ రకమైన ప్రతిజ్ఞను చేయడానికైనా – ఉదాహరణకి ప్రత్యేకంగా ఒక ప్రాంతంలోనే ఉండాలనో, మా విడుదల తరువాత కొంత కాలం వరకు మా కదలికలు పోలీసులకు తెలియ చేయాలనో – ఇటువంటి మరే ఇతరమైనవి, రాజ్యం భద్రత దృష్ట్యా అవసరమైన సహేతుకమైన నిబంధనలు ఆమోదించడానికి కూడా నేను నా అన్న సంసిద్ధులం"

5. 1924లో కట్టుబడి ఉంటానని ఇచ్చిన మరో పత్రం 1995 ఏప్రిల్ 7 ఫ్రంట్‌లైన్ పత్రికలో ప్రచురించబడింది. ఇవన్నీ అవమానకరమైన క్షమాపణలు, అసహ్యకరమైన కట్టుబడి ఉంటానన్న హామీలతో నిండి ఉన్నవే.

6. 1948 ఫిబ్రవరి 22వ తేదీ ముంబయి పోలీస్ కమిషనర్‌కి గాంధీ హత్యకి సంబంధించిన అభియోగం తప్పించుకోడానికి "నేను ఏ రకమైన మతతత్వ, రాజకీయ కార్యకలాపాలలో ప్రభుత్వం ఆజ్ఞాపించినంత కాలం పనిచేయను" అని వ్రాసిచ్చారు.

7. 1950 జులై 13న బొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయవాది ఎం.సి.ఛాగ్లా, న్యాయవాది పి.బి.గజేంద్ర గడ్కర్‌కి "ఏ రకమైన రాజకీయ కార్యకలాపాలలో పాల్గనను, బొంబాయిలోని నా ఇంట్లోనే ఒక ఏడాదిపాటు ఉంటాను" అని వ్రాసిచ్చారు. హిందూ మహాసభ అధ్యక్షుడిగా రాజీనామా చేసారు.

సావర్కర్‌కి వైస్ రాయ్ లార్డ్ లైన్లిత్గోకి జరిగిన సంభాషణను మజియో కాసొలరీ ఇలా నమోదు చేసారు. 1930 అక్టోబర్ 9న ఆ "జాతీయవాది" "మన ప్రయోజనాలు ఇప్పుడు ఒకటే, మనం కలిసి పనిచేద్దాం" గాంధీకి, కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా అన్న దాంట్లో సందేహం లేదు. ("1930లలో హిందుత్వ యొక్క విదేశీ కలయిక", 2000 జనవరి 22 ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ)అని నమోదు చేసారు.

ఈ వ్యక్తీకరణలు అతని వారసులను కూడా వెన్నాడుతున్నాయి. ఏ.బి. వాజ్‌పాయ్ 1992 డిసెంబర్ 5న బాబ్రీ మసీదు కూల్చే సందర్భంలో ఇచ్చిన ప్రసంగం – 2005 ఫిబ్రవరి 28 ఔట్‌లుక్‌లో ఇది ప్రచురించబడింది. అలాగే అదే సమయంలో ప్రచురించబడిన మాలోయ్ కృష్ణ ధర్ పుస్తకం, ఓపెన్ సీక్రెట్స్‌లో వ్రాసిన ఎల్.కె. అద్వానీ యొక్క నేరాల్లో భాగస్వామ్యం ఈ కోవలోవే. ఈ విషయాలన్నీ బహిర్గతమవుతున్నా కొద్దీ వారు సిగ్గుతో కుంచించుకుపోక తప్పదు.

**(2005 ఫ్రంట్ లైన్ లో వచ్చిన ఏ జి నూరాని వ్యాసానికి స్వేచ్ఛానుసరణ కె. ఉషారాణి)**

---


## శరీరం ఛిద్రమైనా చెదరని యోధుడు

(2వ పేజీ తరువాయి)

అజ్ఞాతవాసానికి వెళ్లిన కొద్దిరోజులకే అప్పటికే గర్భిణిగా ఉన్న కామ్రేడ్ లక్ష్మీనారాయణ భార్య కమలమ్మ ఉపాధ్యాయ వృత్తిరీత్యా ఐలవరంలో ఉంటున్న తన తండ్రివద్దకు వెళ్లారు. కమలమ్మ ప్రసవించిన మూడు నెలలకు కామ్రేడ్ లక్ష్మీనారాయణ తన కొడుకును చూసేందుకు ఐలవరంలోని భార్యదగ్గరకు వచ్చారు. ఎవరూ ఊహించని రీతిగా సొంత బావమరిది, తమ్ముడు ఇన్‌ఫార్మర్లుగా మారిపోయారు. కామ్రేడ్ లక్ష్మీనారాయణ ఐలవరం రాగానే వీరిద్దరు కూడా ఐలవరం వచ్చి కామ్రేడ్ లక్ష్మీనారాయణను మాయమాటలతో మభ్యపెట్టి, కనగాల తీసుకెళ్లారు. బావమరిది, తమ్ముడు ద్రోహం చేస్తారని ఊహించని కామ్రేడ్ లక్ష్మినారాయణ ఎటువంటి ప్రమాదాన్నీ శంకించలేదు. ఈ ద్రోహులిద్దరూ పోలీసులను తీసుకొచ్చి కామ్రేడ్ లక్ష్మీనారాయణను పట్టించారు. పోలీసులు లక్ష్మీనారాయణను అరెస్టు చేసి వెల్లటూరులో ఒకరోజు నిర్బంధించాక, రేపల్లెలో రెండ్రోజులు చిత్రహింసలకు గురిచేశారు. ఆతరువాత భల్లూఖానుడివారిపాలెంలోని మలబార్ పోలీస్ క్యాంపునకు తరలించారు. అప్పటికే కామ్రేడ్ శేషశాస్త్రి అదే క్యాంపులో నిర్బంధాన్ని అనుభవిస్తున్నారు. తల్లినిగాని, ఊళ్లో పెద్దలను గానీ కామ్రేడ్ లక్ష్మీనారాయణతో మాట్లాడ్డానికి మలబారు మూకలు అంగీకరించలేదు. నాలుగైదురోజులపాటు వీరిద్దరినీ తీవ్ర చిత్రహింసలకు గురిచేశారు. కాళ్లూచేతులు కట్టేసి మోకాళ్లపై, అరికాళ్లపై లాఠీలతో బాదేవారు. కట్టేసిన చేతుల్లోనే కారపు ముద్దలు పెట్టేవారు. నాలుగు రోజుల చిత్రహింసల తరువాత కామ్రేడ్ శేషశాస్త్రిని, కామ్రేడ్ లక్ష్మీనారాయణను పోలీసుల జీపుకు కట్టి వీధులెమ్మట తిప్పారు. రాళ్ళు తగిలి, రప్పలు తగిలి, గుంతలలో ఎగిరిపడి ఆ ఇద్దరి కామ్రేడ్స్ శరీరాలు ఛిద్రమయ్యాయి. మొత్తం శరీరంలో గాయం కాని స్థలమంటూలేదు. నిలువెల్లా నెత్తురోడుతున్న శరీరాలపై అత్యంత పాశవికంగా ఉప్పు, కారం నీళ్ళలో కలిపి పోశారు. ఒళ్లంతా భగ్గుమని మండిపోతున్నా ఆ కామ్రేడ్స్ ఇద్దరూ చలించలేదు. అప్పటికీ ఈ కామ్రేడ్స్ నుంచి ఏరహస్యమూ రాబట్టలేకపోయిన పోలీసులు 1950 మే 11న వీరిని పాలపర్రు, ఉప్పలపాడు మధ్యనున్న డొంకరోడ్డులోని చింతలతోపు దగ్గర చెట్టుకు కట్టేసి కాల్చిచంపారు. సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబాల్లో పుట్టినా జీవితాంతం వ్యవసాయ కార్మికుల కోసం పోరాడి, వారి కోసమే మరణించిన కామ్రేడ్ శేషశాస్త్రి, కామ్రేడ్ లక్ష్మీనారాయణ చిరస్మరణీయులు.

**(గుంటూరుజిల్లా కమ్యూనిస్టు వీరులు పుస్తకంనుండి ఈ వ్యాసం గ్రహించబడినది)**

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-10-2018 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20



# పెట్టుబడిదారీ వ్యవస్థలో పత్రికా స్వేచ్ఛ బూటకం

**వి ఐ లెనిన్**

**“**అత్యంత ప్రజాస్వామికమైన బూర్జువా రిపబ్లిక్ కూడా బూర్జువావర్గం కార్మికవర్గాన్ని అణచివేయటానికి సాధనం మాత్రమే. కొద్దిమందిగా వున్న పెట్టుబడిదారులు కార్మికవర్గం మొత్తాన్ని అణచివేయటానికి ప్రభుత్వం ఉపయోగపడుతుంది. అత్యంత ప్రజాస్వామికమైన బూర్జువా రిపబ్లిక్‌లో కూడా ‘సమావేశ స్వాతంత్ర్యం’ అనేమాట ఏ మాత్రం విలువలేనిది. ధనికుల ఆధీనంలో ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు, సమావేశ మందిరాలు ఉంటాయి. సభలు, సమావేశాలలో పాల్గొనటానికి వారికి కావలసినంత విశ్రాంతి సమయం ఉంటుంది. బూర్జువా రాజ్యాంగయంత్రం వీటన్నింటినీ  పరిరక్షిస్తూ ఉంటుంది. ప్రజానీకంలో అత్యధిక సంఖ్యగా ఉన్న పట్టణ, గ్రామీణ కార్మికులు, చిన్న రైతులకు ఇవేవీ అందుబాటులో ఉండవు. ఇటువంటి పరిస్థితులు కొనసాగినంత కాలం ‘సమానత్వం’, ‘స్వచ్ఛమైన ప్రజాస్వామ్యం’ అనేవి బూటకంగానే మిగులుతాయి.

“‘పత్రికా స్వాతంత్ర్యం’ అనేది ‘సచ్ఛమైన ప్రజాస్వామ్యం’ యొక్క మరో ముఖ్యమైన నినాదంగా ఉంది. మంచి ముద్రణా శాలలు, పెద్దమొత్తంలో న్యూస్‌ప్రింటును పెట్టుబడిదారులు తమ స్వాధీనంలో పెట్టుకోవటంతో ఇక్కడ కూడా వారి ఆధిపత్యమే కొనసాగుతున్నది. కాబట్టి ఈ పత్రికా స్వాతంత్ర్యం అనేది మోసమని– సోషలిస్టులు అనేకచోట్ల లక్షలాది సందర్భాలలో చెప్పినట్లుగా– కార్మికులు అర్థం చేసుకుంటారు. అత్యంత ప్రజాస్వామిక దేశంగా చెప్పుకుంటున్న, రిపబ్లిక్ విధానం బాగా అభివృద్ధి అయిన అమెరికాలో వలెనే పత్రికలపై పెట్టుబడిదారుల ఆధిపత్యం ప్రపంచవ్యాపితంగా కొనసాగుతున్నది.

“పెట్టుబడిదారులు ఎల్లప్పుడూ ‘స్వాతంత్ర్యం’ గురించి మాట్లాడుతుంటారు. పెట్టుబడిదారులు మరింత సంపదలు పోగుచేసుకోవటానికి, కార్మికులు ఆకలితో మరణించటానికి స్వేచ్ఛ అని వారి స్వాతంత్ర్యానికి అర్థం. పెట్టుబడిదారులు పత్రికలకు లంచాలు ఇవ్వటానికి, ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మలచుకోవటానికి, దానిని ప్రజాభిప్రాయంగా ప్రచారం చేసుకోవటానికి తమ సంపదను వినియోగించుకోవటం  వారు చెబుతున్న పత్రికా స్వేచ్ఛకు అర్థం. స్వచ్ఛమైన ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తున్నామని చెప్పుకుంటున్న వారు ప్రజా ప్రచార సాధనాలపై బూర్జువా వర్గానికి ఆధిపత్యం కల్పించే నకిలీ, హానికరమైన పత్రికాస్వేచ్ఛను బలపరుస్తారు. చక్కటి వాదనలతో, తియ్యటి మాటల మాటున పూర్తి అసత్యాలను ప్రచారం చేస్తూ ప్రజలను వారి నిర్దిష్ట లక్ష్యమైన పెట్టుబడిదారుల బానిసత్వం నుండి పత్రికలను విడుదల చేయటమనే కర్తవ్యాన్నుంచి మళ్ళించటానికి ప్రయత్నించటం ద్వారా వాళ్ళు మోసగాళ్ళుగా నిరూపించుకుంటున్నారు.”

*(కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ మొదటి మహాసభలో లెనిన్ చేసిన ప్రసంగం నుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి.)*

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt.
Ph: 9490099275. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.13, No.6. Published on October 1, 2018